ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in
Published From Nizamabad
PRGI No.TELTEL/2010/33275

# ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

సోమవారం | 31-08- 2026 సంపుటి: 17, సంచిక: 149, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆



# వెయ్యి రోజుల ప్రజాపాలన

## సంక్షేమం నుంచి ప్రపంచస్థాయి తెలంగాణ




**హైదరాబాద్, ఆగస్టు 30 (ప్రజాకలం) :** ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను పూర్తి చేసుకుంది. ప్రజల ఆకాంక్షలను పాలనకు కేంద్రబిందువుగా చేసుకుని సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయాన్ని సమన్వయం చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగింది. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, కార్మికులు, పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూర్చే పథకాలతో పాటు పరిపాలనా సంస్కరణలు, కొత్త చట్టాలు, కొత్త విధానాలు, భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది.

వ్యవసాయం నుంచి పరిశ్రమల వరకు.. విద్య నుంచి వైద్యం వరకు.. మహిళా సాధికారత నుంచి యువత ఉపాధి వరకు.. డిజిటల్ పాలన నుంచి ప్రపంచస్థాయి పెట్టుబడుల ఆకర్షణ వరకు పలు రంగాల్లో కీలక నిర్ణయాలు తీసుకుంది. భవిష్యత్ తెలంగాణను దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలిక ప్రణాళికలను ప్రకటించింది.

తరువాయి 3వ పేజీలో...

### డ్రగ్స్‌కు బానిసైతే.. వ్యక్తికే కాకుండా

# సమాజానికీ నష్టం

- డ్రగ్స్ కు బానిసైతే వ్యక్తికే కాదు సమాజానికీ నష్టం
-దేశం డ్రగ్స్ రహిత భారత్ గా మారాలి

## మాదక ద్రవ్యాల వల్ల నష్టాలు అధికం



న్యూఢిల్లీ: నషా ముక్త్ యువ భారత్ కార్యక్రమాన్ని ప్రచారం చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ 137వ మన్ కీ బాత్ ఎపిసోడ్ లో పేర్కొన్నారు.

మాదకద్రవ్యాల వల్ల నష్టాలు అధికమన్న ప్రధాని మోదీ దేశం డ్రగ్స్ రహిత భారత్‌గా మారాలని ఆకాంక్షించారు. డ్రగ్స్ కు బానిసైతే వ్యక్తికే కాకుండా సమాజానికీ నష్టమని హెచ్చరించారు. డ్రగ్స్ కు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాలని పిలుపునిచ్చారు. నషా ముక్త్ యువ హ్యాష్ ట్యాగ్స్ పేరుతో పోస్టులు పెట్టాలని సూచించారు. పీఎం స్వనిధి ద్వారా మహిళా సాధికారత సాధ్యమైందని తెలిపారు. PM SVANidhi ద్వారా 35 లక్షల మంది మహిళలు లబ్ధి పొందారని ప్రకటించారు. వ్యాపారా వృద్ధికి పీఎం స్వనిధి ఉపయోగపడుతోందన్నారు. మహిళల వ్యాపారం వృద్ధి చెందితే కుటుంబమూ వృద్ధిలోకి వస్తోందని సూచించారు.

### ఖద్దర్ బట్టల వెనుక

# కన్నీటి గాధలు..!?

-అప్పులు.. ఆపై ఆర్థిక వనరులు కరువు..!
-ప్రజల్లో ఉండలేక.. రాజకీయం చేయలేక అవస్థలు..!
-ఆర్థిక అండదండలు ఇచ్చే "నీడ" కోసం ఎదురుచూపులు..!
-పైన పటారం... లోన లొటారం అన్న చందంగా ద్వితీయ శ్రేణి లీడర్స్ స్థితి..!




**మహబూబ్‌నగర్ ఆగస్టు 30 ప్రజాకలం ప్రతినిధి :** ఖద్దర్ బట్టలు వేసుకున్న నాయకుల కన్నీటి బాధలు వర్ణనాతీతం..! ఒకపక్క చేసిన అప్పులు తీర్చలేక.. తాము అప్పుల్లో ఉన్నామని ప్రజలకు చెప్పలేక.. ఆర్థిక వనరులను పొందలేక అదే తెల్లని ఖద్దర్ దుస్తులు మాత్రం ధరించి ఖతర్నాక్ గా తయారై తిరుగుతున్న వారి పరిస్థితి పగవాడికి కూడా రావద్దు అంటూ కొందరు ద్వితీయ శ్రేణి రాజకీయ నాయకులు బోరుమంటున్నారు. ఖద్దర్ దుస్తులు వేసుకున్న తాము తమ మనసులోని బాధను మాత్రం "ఖద్దర్" తో కవర్ చేసుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయాల్లో యువత రాణించాలని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చే రాజకీయ అగ్ర నాయకుల అండదండలు ఆచరణలో ఏమాత్రం ఉండవని పేర్కొంటున్నారు. రాజకీయాల్లోకి వచ్చిన ద్వితీయ, తృతీయ శ్రేణి లాంటి క్యాడర్ ఖద్దర్ దుస్తులకే పరిమితం కావాల్సి వస్తుందంటున్నారు. ఒకపక్క ఆర్థికంగా చితికి పోతూ.. మరొకపక్క అప్పుల్లో కూరుకుపోతూ.. మార్కెట్లో మాత్రం ఖద్దర్ దుస్తులతో కనిపిస్తూ.. తమ బాధను, భారమైన మర్యాదను కాపాడుకోవడానికి పడరాన్ని పాట్లు పడుతున్నామని వాపోతున్నారు.

**పైన పటారం.. లోన లోటారం.. ఖద్దర్ దుస్తుల యవ్వారం..!**

రాజకీయంలో వచ్చిన పాపానికి కద్దర్ దుస్తులు ధరించి మేకపోతు గాంబిర్యాన్ని ప్రదర్శించాల్సిన కర్మధాపరిచిందని పలువురు చోటామోటా నాయకులు అభిప్రాయపడుతున్నారు. పైకి తెల్లని దుస్తులు ధరించినప్పటికీ లోపల అంతా డొల్లగా మారిందని పేర్కొంటున్నారు. బయటికి హాట్ కేక్ లా కనిపించినా.. తినడానికి తిండి లేని పరిస్థితులు కూడా దాపురించేయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేసిన అప్పులను తీర్చలేక.. సంసారాన్ని నెట్టలేక.. ప్రజలకు ముఖం చూయించలేక తప్పని పరిస్థితుల్లో తిప్పలు పడుతున్నామని పేర్కొంటున్నారు.

తరువాయి 2వ పేజీలో...

## జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు విజయవంతం

**హైదరాబాద్, ఆగస్టు 30 ప్రజాకలం ప్రతినిధి :** జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ (SATG) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 28, 29, 30 తేదీలలో నిర్వహించిన క్రీడా, ఫిట్‌నెస్ కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయి. భారత ప్రభుత్వం ప్రకటించిన "ఖేలేగా భారత్ -- జీతేగా భారత్" నినాదానికి అనుగుణంగా ఈ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.

రాష్ట్రంలోని 32 జిల్లాల కేంద్రాలతో పాటు హైదరాబాద్ నగరంలోని వివిధ క్రీడా మైదానాలు, స్టేడియంలలో నిర్వహించిన కార్యక్రమాల్లో యువ క్రీడాకారులు, విద్యార్థులు, క్రీడాభిమానులు, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, క్రీడా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు కార్యక్రమాల నిర్వహణలో చురుకైన పాత్ర పోషించాయి.



ఆగస్టు 28న భారత హాకీ దిగ్గజం, దేశ క్రీడా గర్వకారణమైన మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని ఆయన సేవలను స్మరించడంతో పాటు క్రీడల ప్రాధాన్యం, క్రీడాస్ఫూర్తి, ఆరోగ్యకర జీవన విధానాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా "ఏక్ ఘంటా ఖేల్ కే మైదాన్ మేన్" కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించారు. ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, అథ్లెటిక్స్ తదితర క్రీడా పోటీలతో పాటు "29 ఛాలెంజ్", "పాస్ ది బాల్ ఛాలెంజ్",

తరువాయి 2వ పేజీలో...





## గుండమోని అంజయ్య నూతన గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్న మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి

మహేశ్వరం, ఆగస్టు 30,(ప్రజా కలం)

అమీర్‌పేట్ గ్రామ గుండమోని అంజయ్య గారి నూతన గృహప్రవేశానికి ముఖ్యఅతిథిగా మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.వారితో పాటుగా మహేశ్వరం నియోజకవర్గం పలువురి నాయకులు మహేశ్వరం నియోజకవర్గం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య,మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షులు నడికుడ శివ,మహేశ్వరం మండలం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకిశ్వర్ ముదిరాజ్,వత్తుల రఘుపతి శివగంగ టెంపుల్ చైర్మన్ అల్లె కుమార్,మహేశ్వరం గ్రామీణ పట్టణ అధ్యక్షులు లాజర్,వర్కల యాదగిరి గౌడ్,అమీర్‌పేట్ గ్రామ శాఖ అధ్యక్షులు మన్సన్‌పల్లి వెంకటేష్ గౌడ్,ఇందిరమ్మ కమిటీ అధ్యక్షులు ఆవుల రఘుపతి,ఇందిరమ్మ కమిటీ మెంబర్ సభ్యులు కడల భాస్కర్,మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు ఎర్ర చంద్రమోహన్,అమీర్‌పేట్ గ్రామ ఎస్సీ సెల్ అధ్యక్షులు నిగోల్లా బాలరాజ్,గళ్ళ అనిల్, తదిరులు పాల్గొన్నారు.

## పటాన్‌చెరులో బాల్ బ్యాడ్మింటన్ పోటీల సందడి..

### - 45వ ఉపకనిష్ఠ అంతర్‌జిల్లా ఛాంపియన్‌షిప్ ముగింపు.. విజేతలకు బహుమతులు..

పటాన్‌చెరు, ఆగస్టు 30 (ప్రజా కలం) ప్రతినిధి

విద్యతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించేందుకు పోటీలు వేదికగా




నిలుస్తున్నాయి.క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదలతోపాటు పోటీతత్వ స్ఫూర్తిని పెంపొందిస్తాయి.ఈ లక్ష్యంతో పటాన్‌చెరు ఎం.ఐ.జి.లోని శ్రీ వాణి విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో స్వర్గీయ కాటూరి శంకర రావు జ్ఞాపకార్థం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర 45వ ఉపకనిష్ఠ అంతర్‌జిల్లా బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారంతో ముగిశాయి.ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు మూడు రోజులపాటు నిర్వహించిన ఈ పోటీల్లో తెలంగాణలోని వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చాటారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా కాట సుధా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. క్రీడల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పోటీతత్వం పెంపొందుతాయని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై కూడా ఆసక్తి పెంచుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు..

## కార్మిక హక్కుల కోసం సీఐటీయూ పోరాటం

### పోరాడితేనే హక్కులు సాధ్యం: కే. రాజయ్య..

పటాన్‌చెరు, ఆగస్టు 30 (ప్రజా కలం) ప్రతినిధి

కార్మికుల హక్కులు, వేతనాలు, బోనస్‌లు, ఇతర సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలే మార్గమని సీఐటీయూ జిల్లా కోశాధికారి కే.రాజయ్య తెలిపారు. పటాన్‌చెరులోని శ్రామిక్ భవన్‌లో పెన్నార్ కార్మికుల సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కే.రాజయ్య మాట్లాడుతూ,కార్మికుల సమస్యలపై సీఐటీయూ నిరంతరం పోరాడుతోందని చెప్పారు.సీఐటీయూ ఉన్న చోట కార్మికులకు హక్కులు,వేతన ఒప్పందాలు,బోనస్‌లు,ఇతర సౌకర్యాలు సాధ్యమవుతున్నాయని పేర్కొన్నారు. కార్మిక హక్కుల విషయంలో సీఐటీయూ రాజీపడదని స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యూనియన్ నాయకులు శేషగిరిరావు, త్రిమూర్తులు, రాజు, దాసు, అర్జున్, రాజు, నగేష్, పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు..




# ఖద్దర్ బట్టల వెనుక కన్నీటి గాధలు..!?

మొదటి పేజీ తరువాయి...

ఒక్కోసారి ఖద్దర్ బట్టలను డ్రైవాష్ చేయించడానికి కూడా తమవద్ద డబ్బులు లేని పరిస్థితులు ఉన్నాయంటే అతిశయోక్తి కాదని అంటున్నారు. పార్టీలో పదోన్నతులు లేక.. ఇతర పార్టీల నుంచి వలస వచ్చిన వారి బాధ భరించలేకపోతున్నామని దిగాలు చెందుతున్నారు.

**ఆర్థిక భరోసా కరువు.. అప్పుల బెడద బరువు..!?**

రాజకీయంలో పార్టీలకతీతంగా కొంతమంది ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు అప్పులు చేసి మరీ రాజకీయ ఊబిలో చిక్కుకుంటున్నారు. ప్రెస్టేజ్ కోసం రాజకీయం చేయాల్సి రావడంతో ఉన్న ఆస్తులు అమ్మి అప్పుల మీద అప్పులు చేసి అవి తీర్చలేక.. బాధను బయటికి చెప్పలేక... చెప్పినా ఫలితం లేక తమలో తాము బోరున విలపిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్ సైలెంట్ గా ఉండడం, రియల్ ఎస్టేట్ వ్యాపారం అంతంత మాత్రమే కొనసాగడం, డబ్బు చలామణి, పెట్టుబడులు పెట్టే వ్యాపారులు రాకపోవడం పుండు మీద కారం చల్లినట్లు తమ పరిస్థితి తయారయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ఆర్థిక వనరులను సూచించే నాయకుడు లేకపోవడం... రాజకీయ చదరంగంలో చిక్కుకొని బిక్కుమంటున్నామని వాపోతున్నారు.

**ఖద్దర్ దుస్తుల రాజకీయం భయం భయం..!?**

నేటి పరిస్థితుల్లో రాజకీయాల్లోకి వస్తే ఒక బాధ.. రాకుంటే మరొక బాధ అన్న చందంగా. తమ పరిస్థితి తయారయిందని కొంతమంది కిందిస్థాయి లీడర్స్ వాపోతున్నారు. ప్రస్తుత పరిస్థితులను తమకు ఏ విధంగా అనుకూలంగా మార్చుకోవాలో తెలియని పరిస్థితుల్లో ఉంటున్నామని పేర్కొంటున్నారు. తమకు కాసింత ఆర్థిక భరోసా కల్పించే నాయకులు కరువయ్యారని లోలోన లబోధిపోమంటున్నారు.

తమ పరిస్థితి పొగాడికి కూడా రాకూడదని కోరుకుంటున్నారు. ప్రజల్లో తిరగలేక.. పస్తులు ఉండలేక రాజకీయం చేయకుండా ఉండలేక సతమతమవుతున్నట్లు సమాధానం ఇస్తున్నారు. ఖద్దర్ దుస్తులు విప్పితే తమ కష్టాలు కన్నీటి గాదలై ప్రవహిస్తున్నాయని పేర్కొంటున్నారు. యువత రాజకీయాల్లోకి వచ్చే ముందు ఒకటికి పది సార్లు ఆలోచించి రావాలని ఉచిత సలహాలు ఇచ్చేస్తున్నారు. ఏది ఏమైనాప్పటికీ ప్రస్తుత పరిస్థితుల్లో ఖద్దర్ దుస్తుల నాయకుల పరిస్థితి ముందు చూస్తే నొయ్యి.. వెనక చూస్తే గొయ్యి అన్న మాదిరిగా ఉందని అంటున్నారు. తమలోని నైపుణ్యాన్ని, ప్రాణం పెట్టి పనిచేసే స్వభావాన్ని, ప్రజల కోసం పాటుపడే వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకోవడంతో పాటు ఆర్థిక అండదండలు అందించే నాయకుడి నీడ కోసం నిరీక్షిస్తున్నామని నిగూఢ బాధను వ్యక్తం చేస్తున్నారు.!

## అంకితభావంతో పనిచేసిన ఉపాధ్యాయుడు కాయితీ గంగారెడ్డి

### పదవి విరమణ సందర్భంగా గంగారెడ్డిని సన్మానించినా ఉపాధ్యాయులు



గొల్లపల్లి ఆగస్టు 30 ప్రజాకలం ప్రతినిధి

గొల్లపల్లి మండలం వెంగళాపూర్ మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా కాయితి గంగారెడ్డి అందించిన విద్యాసేవలు మరువలేనివని వక్తలు కొనియాడారు.ఆయన పదవీ విరమణ, సన్మాన కార్యక్రమాన్ని ఆదివారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు,వక్తలు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు కోసం అంకితభావంతో పనిచేసిన ఆయన, విద్యాబోధనతో పాటు మంచి విలువలు, క్రమశిక్షణను నేర్పుతూ ఎందరో విద్యార్థులకు మార్గదర్శకులుగా నిలిచారని పేర్కొన్నారు. సుదీర్ఘ ఉద్యోగ జీవితంలో విధుల పట్ల నిబద్ధతతో పనిచేసి ప్రత్యేక గుర్తింపు పొందారని విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పడమే కాకుండా, వారిలో క్రమశిక్షణ, నైతిక విలువలు పెంపొందించడంలో ఉపాధ్యాయుడు కాయితి గంగారెడ్డి చేసిన సేవలు మరువలేని అని తోటి ఉపాధ్యాయులు కొనియాడారు. తన సుదీర్ఘ ఉపాధ్యాయ ప్రస్థానంలో ఎంతోమంది విద్యార్థుల జీవితాలకు మార్గదర్శకులుగా నిలిచి, వారి ఉన్నతికి కృషి చేశారని పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా ఆయన సేవలను, ఆదర్శాలను విద్యార్థులు, సహచర ఉపాధ్యాయులు గుర్తు చేసుకుంటారని తెలిపారు.ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ , కౌన్సిలర్ కోరుకంటి రాము లు గంగారెడ్డిని ఘనంగా సన్మానించారు.

వారు మాట్లాడుతూ ఆయన అందించిన విద్యాసేవలను ప్రశంసిస్తూ, పదవీ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం కాయితి గంగారెడ్డి మాట్లాడుతూ తన ఉద్యోగ జీవితంలో సహకరించిన అధికారులు, సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు, కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.భవిష్యత్తులోనూ విద్యా, సామాజిక సేవా కార్యక్రమాల్లో తనవంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు విజయవంతం



మొదటి పేజీ తరువాయి...

"మీట్ ది ఛాంపియన్స్" వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. మహిళలు, యువత, వృద్ధులు, దివ్యాంగులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు. వేడుకల ముగింపు సందర్భంగా ఆగస్టు 30న "స్పెషల్ సండేస్ ఆన్ సైకిల్", రన్‌లు, వాక్‌థాన్‌లు నిర్వహించి ప్రజల్లో ఫిట్‌నెస్, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. శారీరక దృఢత్వం, ఆరోగ్య సంరక్షణ, క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.

తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ అధికారులు మాట్లాడుతూ, యువతలో క్రీడా చైతన్యాన్ని పెంపొందించడం, ఆరోగ్యకర జీవన విధానాలను ప్రోత్సహించడం, ఫిట్ ఇండియా ఉద్యమాన్ని గ్రామీణ స్థాయికి విస్తరించడం లక్ష్యంగా మూడు రోజుల పాటు ఈ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పడిన క్రీడా ఉత్సాహం తెలంగాణలో క్రీడా సంస్కృతి మరింత బలోపేతం కావడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు.



## ట్రైబల్ వెల్ఫేర్ రెసిడేన్సియల్ స్కూల్ భవనాన్ని పరిశీలించిన మాజీ మంత్రి

రుద్రంగి, ఆగస్టు 30(ప్రజాకలం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామంలో నిర్మిస్తున్న ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ స్కూల్ భవన నిర్మాణాన్ని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ ఆదివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిర్మాణపు పనులు నెమ్మదిగా సాగుతుండటంతో పనులను తొందరగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడారు. మూడు నెలల్లో మిగిలిన పనులు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. భవన నిర్మాణ పనులు పూర్తి అయితే వేములవాడలో తాత్కాలిక భవనంలో కొనసాగుతున్న స్కూల్ ఇక్కడి విశాలమైన భవనంలోకి తరలించినట్లయితే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. అలాగే మానాల పరిసర ప్రాంతాల గిరిజన విద్యార్థులకు ఏంతో మేలు జరుగుతుంది అని అన్నారు. ఆయన వెంట పలువురు ప్రజాప్రతినిధులు ఉన్నారు.

## బర్కత్‌పుర యూత్ అధ్యక్షుడిగా తమీజుద్దీన్

### ఆదివారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నిక

### యువత ఐక్యతే బలం.. సమాజ సేవే లక్ష్యం

### నూతన అధ్యక్షుడు తమీజుద్దీన్

మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 30(ప్రజా కలం): బర్కత్‌పుర యూత్ అధ్యక్షుడిగా తమీజుద్దీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం బర్కత్‌పురలో యూత్ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో



నూతన అధ్యక్షుడిగా తమీజుద్దీన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం యూత్ సభ్యులు, నాయకులు నూతన అధ్యక్షుడిని శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ యువత ఏకతాటిపైకి వచ్చి సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. యువతలో ఉన్న ప్రతిభను వెలికితీసి, విద్య, క్రీడలు, ఉపాధి, సామాజిక సేవ తదితర రంగాల్లో ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. నూతన అధ్యక్షుడు తమీజుద్దీన్ నాయకత్వంలో బర్కత్‌పుర యూత్ మరింత చురుగ్గా పనిచేస్తుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మొహమ్మద్ అహ్మద్, యూసుఫ్ అలీ, కౌన్సిలర్ ఆజీమ్, రాహూఫ్, షకీల్, జాకీర్, ఇస్మాయిల్, ముజ్జు, రియాజ్, వసీం, అజీమ్, మతీన్, యూత్ సభ్యులు, స్థానిక యువకులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు

## ఫ్యూచర్ సిటీలో మహేశ్వరం విలీనం వరకు పోరాటం ఆగదు

### జేపీసీ చైర్మన్ ఓత్తుల రఘుపతి

### .ఆగస్టు 31, సెప్టెంబర్ 1న రిలే నిరాహార దీక్షలు

మహేశ్వరం, ఆగస్టు 30 (ప్రజా కలం):

మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలను ఫ్యూచర్ సిటీలో విలీనం చేయాలని ఫ్యూచర్ సిటీ జాయింట్ యాక్షన్



కమిటీ (జేఏసీ) చైర్మన్ ఓత్తుల రఘుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ మేరకు ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో మహేశ్వరం ఎమ్మార్వో కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు ఆయన ప్రకటించారు.ఈ ప్రాంత అభివృద్ధి కోసం, ఇక్కడి యువత ఉద్యోగాల కోసం, భావితరాల భవిష్యత్తు కోసం మహేశ్వరం ప్రాంతాన్ని ఫ్యూచర్ సిటీలో కలపాల్సిందేనని స్పష్టం చేశారు. డిమాండ్ నెరవేర్చని పక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఫ్యూచర్ సిటీలో కలపకుండా అడ్డుపడుతున్న బీఆర్ఎస్ పార్టీ నాయకుల తీరును ప్రజాక్షేత్రంలో ఎండగడతామని ఆయన అన్నారు.ఈ రిలే నిరాహార దీక్షలను అన్ని పార్టీల నాయకులు, అన్ని గ్రామాల యువకులు, పార్టీలకు అతీతంగా గ్రామ ప్రజలు, మహేశ్వరం నియోజకవర్గ జర్నలిస్టులు, మీడియా ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని జేపీసీ చైర్మన్ రఘుపతి పిలుపునిచ్చారు.



# వెయ్యి రోజుల ప్రజాపాలన

## సంక్షేమం నుంచి ప్రపంచస్థాయి తెలంగాణ

మొదటి పేజీ తరువాయి...

**రైతుకు అండగా..**

రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. రూ.2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేసి 25 లక్షలకుపైగా రైతు కుటుంబాలకు రుణభారం నుంచి విముక్తి కల్పించింది. రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లకుపైగా పెట్టుబడి సాయం అందించింది. ఒకే విడతలో తొమ్మిది రోజుల్లో దాదాపు రూ.9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసింది.

సన్నవడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ అమలు చేసింది. ఉచిత విద్యుత్తు, రైతు బీమా, పంట నష్టపరిహారంతో రైతులకు భరోసా కల్పించింది. 32 నెలల లెక్కల ప్రకారం వ్యవసాయం, రైతు సంక్షేమానికి దాదాపు రూ.1.68 లక్షల కోట్లు ఖర్చు చేసింది.

వరి సాగు, ఉత్పత్తిలో పంజాబ్‌ను అధిగమించి తెలంగాణ దేశంలోనే అగ్రస్థానానికి చేరిందని ప్రభుత్వం పేర్కొంది. గత యాసంగిలో 8,575 కొనుగోలు కేంద్రాల ద్వారా 81.12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 13.37 లక్షల మంది రైతులకు రూ.18,929 కోట్లు చెల్లించింది. రెండు సీజన్లలో 1.47 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతులకు రూ.35,077 కోట్లు చెల్లించింది.

తెలంగాణ బియ్యానికి అంతర్జాతీయ మార్కెట్‌ను విస్తరించే చర్యల్లో భాగంగా ఫిలిప్పీన్స్‌కు 8 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతికి ఒప్పందం కుదిరింది.

**మహిళల కోసం 'మహాలక్ష్మి'..**

మహిళా సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చింది. మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. ఇప్పటివరకు 335 కోట్లకుపైగా ఉచిత ప్రయాణాలు జరిగాయని, దాదాపు రూ.11 వేల కోట్ల ప్రయాణ వ్యయం మహిళలకు ఆదా అయిందని ప్రభుత్వం తెలిపింది.

గృహజ్యోతి పథకం ద్వారా 53 లక్షలకుపైగా కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందించింది. 10 కోట్లకుపైగా జీరో బిల్లులు నమోదయ్యాయి. దాదాపు 43 లక్షల కుటుంబాలకు రూ.500కే వంటగ్యాస్ సిలిండర్ అందించింది.

కల్యాణలక్ష్మి ద్వారా 1.68 లక్షల మంది ఆడబిడ్డలకు రూ.4,709 కోట్ల సహాయం అందించింది. 4.54 లక్షల మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.60,487 కోట్ల బ్యాంకు లింకేజీ కల్పించింది. రూ.1,900 కోట్ల వడ్డీ రాయితీ ఇచ్చింది.

మహిళా సంఘాలకు పాఠశాల యూనిఫాంలు, చీరల తయారీ, పెట్రోలు బంకుల నిర్వహణ, ఆర్టీసీ బస్సుల యాజమాన్యం వంటి కొత్త ఆదాయ మార్గాలను ప్రభుత్వం కల్పించింది.

**పేదలకు ఇల్లు.. ఆహార భద్రత**

15 లక్షలకుపైగా కొత్త రేషన్ కార్డులు జారీ చేసి లక్షలాది మందిని అదనంగా ఆహార భద్రత పరిధిలోకి తీసుకొచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా దాదాపు 3.38 కోట్ల మందికి ఆహార భద్రత కల్పిస్తోంది.

రేషన్ కార్డుదారులకు నాణ్యమైన సన్నబియ్యం పంపిణీకి ప్రభుత్వం కొత్త విధానాన్ని అమలు చేసింది.

తొలి దశలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఒక్కో అర్హ కుటుంబానికి రూ.5 లక్షల సహాయం అందిస్తోంది. హైదరాబాద్ క్యూర్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణానికి నిర్ణయం తీసుకుంది.

43.01 లక్షల మందికి సామాజిక భద్రతా పింఛన్లు అందిస్తూ.. డిసెంబర్ 2023 నుంచి జూలై 2026 వరకు రూ.30,089 కోట్లు ఖర్చు చేసింది. మరో 2.25 లక్షల మందిని కొత్తగా పింఛన్ల పరిధిలోకి తీసుకొచ్చింది.

**సామాజిక న్యాయానికి కొత్త దిశ**

రాష్ట్రవ్యాప్తంగా 1.12 కోట్లకుపైగా కుటుంబాలను కవర్ చేస్తూ సామాజిక, ఆర్థిక,



విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే పూర్తి చేసింది. సర్వే ఆధారంగా కులాల వారీ సామాజిక, ఆర్థిక స్థితిగతులను వెల్లడించింది. సుప్రీంకోర్టు తీర్పు అనంతరం 59 ఎస్సీ ఉపకులాలను మూడు గ్రూపులుగా వర్గీకరించింది. ఈ విధానాన్ని అమలు చేసిన దేశంలోని తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని ప్రభుత్వం పేర్కొంది.

బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను శాసనసభ ఆమోదించి కేంద్రానికి పంపింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమానికి రాష్ట్ర మొత్తం వ్యయంలో 12.4 శాతం కేటాయించింది.

12 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కనీస వేతనాల సవరణ చేపట్టి దాదాపు 1.11 కోట్ల మంది కార్మికులకు ప్రయోజనం కల్పించింది.

**యువతకు ఉద్యోగాల బాట**

ప్రజా ప్రభుత్వ హయాంలో 72 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టినట్లు ప్రభుత్వం వెల్లడించింది. గ్రూప్–1, గ్రూప్–2, గ్రూప్–3, గ్రూప్–4, డీఎస్సీ తదితర కీలక నియామక ప్రక్రియలను పూర్తి చేసింది.

టీజీపీఎస్సీ ద్వారా మరో 456 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు ఇచ్చింది. పోలీసు నియామక బోర్డు ద్వారా 7,437 పోస్టుల భర్తీకి ప్రక్రియ ప్రారంభించింది.

యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి అధునాతన నైపుణ్య శిక్షణకు బాటలు వేసింది. ఇప్పటివరకు 1,190 మంది శిక్షణ పూర్తి చేయగా 838 మందికి ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు లభించాయి.

65 ప్రభుత్వ ఐటీఐలు, 57 పాలిటెక్నిక్ కాలేజీలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా తీర్చిదిద్దుతోంది. టీ–హబ్, టీ–వర్క్స్, టాస్క్, వీ–హబ్ ద్వారా 90 వేలకుపైగా యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చింది.

**విద్యకు పెద్దపీట**

ప్రతి నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ లక్ష్యంతో 105 పాఠశాలలను మంజూరు చేసింది. 84 పాఠశాలలకు అనుమతులు ఇచ్చి నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేసింది.

ప్రభుత్వ పాఠశాలల్లో తొలిసారిగా ప్రీ–ప్రైమరీ తరగతులను ప్రారంభించింది. 'తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల'తో ప్రభుత్వ విద్యకు కొత్త నమూనాను తీసుకొచ్చింది.

ప్రీ–ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు 22 లక్షలకుపైగా విద్యార్థులకు అల్పాహారం, పాలు, పోషకాహారం అందించేందుకు రూ.720 కోట్లు కేటాయించింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించింది.

మెగా డీఎస్సీ ద్వారా 10,006 మంది ఉపాధ్యాయులను నియమించింది. దాదాపు 11 లక్షల మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందిస్తోంది. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి రూ.1,000 కోట్లు కేటాయించింది.

**వైద్యరంగంలో విస్తరణ**

రాజీవ్ ఆరోగ్యశ్రీ చికిత్స పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచింది. గోషామహల్‌లో రూ.2,700 కోట్లతో 2,000 పడకల నూతన ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి చర్యలు చేపట్టింది.

సనత్‌నగర్ టిమ్స్‌ను ప్రారంభించడంతో పాటు అల్వాల్, ఎల్బీనగర్‌లో టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. తొమ్మిది కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రారంభించి మరో 17 మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.

నిమ్స్‌లో 2,000 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల మైలురాయిని చేరుకుంది. దాదాపు 1,900 మందికి ఉచిత చికిత్స అందించింది. ప్రభుత్వ వైద్యరంగంలో దక్షిణ భారత తొలి రోబోటిక్ రీనల్ ట్రాన్స్‌ప్లాంట్‌ను నిమ్స్‌లో నిర్వహించింది.

**డ్రగ్స్, సైబర్ నేరాలపై ఉక్కుపాదం**

ఆహార కల్తీ, డ్రగ్స్ ముప్పును సమగ్రంగా ఎదుర్కొనేందుకు 'టీ సేఫ్' వ్యవస్థను ఏర్పాటు చేసింది. ప్రత్యేక లీగల్, ల్యాబొరేటరీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలను ఏర్పాటు చేసి కల్తీదారులు, డ్రగ్స్ నేరస్థులపై చర్యలకు వ్యవస్థను బలోపేతం చేసింది.

మాదకద్రవ్యాలపై ప్రత్యేకంగా ఈగల్ వ్యవస్థను ఏర్పాటు చేసి డ్రగ్ నెట్‌వర్క్‌లపై చర్యలు చేపట్టింది. విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్, సేఫ్టీ కమిటీలను తప్పనిసరి చేసింది.

సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక పోలీసింగ్‌తో పాటు 1930 స్పందన వ్యవస్థను బలోపేతం చేసింది. షీ టీమ్స్, భరోసా కేంద్రాలు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ల ద్వారా మహిళలు, పిల్లల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టింది.

**భూ పరిపాలనలో సంస్కరణలు**

భూ భారతి చట్టంతో భూ పరిపాలనలో సమగ్ర సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. భూధార్ ద్వారా భూములకు ప్రత్యేక గుర్తింపు, ఏఐ ఆధారిత భూమిత్ర సేవలను ప్రారంభించింది. 3.76 లక్షల కొత్త పట్టాదార్ పాస్‌బుక్స్ జారీ చేసింది.

ప్రజాపాలన––అభయహస్తం ద్వారా గ్రామాలు, వార్డుల్లోనే ఆరు గ్యారంటీలు, సంక్షేమ పథకాలకు దరఖాస్తుల స్వీకరణ చేపట్టింది.




99 రోజుల ప్రజాపాలన––ప్రగతి ప్రణాళికలో 12,758 గ్రామసభలు, 3,175 వార్డుసభలు నిర్వహించింది. 1,06,598 పెండింగ్ ప్రభుత్వ ఫైళ్లను పరిష్కరించింది.

**డిజిటల్ పాలనకు పెద్దపీట**

36 సచివాలయ శాఖల్లో 100 శాతం ఈ–ఆఫీస్ అమలు చేసింది. దేశంలో తొలి పూర్తిస్థాయి డిజిటల్ కేబినెట్ నిర్వహణకు శ్రీకారం చుట్టింది.

వాట్సాప్ ద్వారా 581కిపైగా ప్రభుత్వ సేవలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. దేశంలో తొలి స్టేట్ ఏఐ డేటా ఎక్స్ఛేంజ్––టీజీడెక్స్‌ను ఏర్పాటు చేసి 21 రంగాల్లో 52 ఏఐ ప్రాజెక్టులకు మద్దతు ఇచ్చింది.

టీ–ఫైబర్ ద్వారా భారత్‌నెట్ రెండో దశలో 8,895 గ్రామపంచాయతీలకు డిజిటల్ కనెక్టివిటీ కల్పించే చర్యలు చేపట్టింది.

**హైదరాబాద్‌కు కొత్త రూపురేఖలు**

హైదరాబాద్ చుట్టూ దాదాపు 360 కిలోమీటర్ల రీజనల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టుకు ప్రణాళిక రూపొందించింది. రాష్ట్రవ్యాప్తంగా 6,092 కిలోమీటర్ల హ్యామ్ రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపట్టింది. హైదరాబాద్ మెట్రో రెండో దశలో ఏడు కారిడార్లతో 122.9 కిలోమీటర్ల విస్తరణ ప్రణాళికను ముందుకు తీసుకెళ్లింది. రేడియల్ రోడ్ల విస్తరణ, మామునూరు విమానాశ్రయ పునరుద్ధరణ, ఆదిలాబాద్‌లో జాయింట్ యూజ్ ఎయిర్‌ఫీల్డ్ అభివృద్ధికి చర్యలు చేపట్టింది.

హైడ్రా ద్వారా చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంది. 1,045 ఎకరాల భూములను స్వాధీనం చేసుకుని దాదాపు రూ.60 వేల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించినట్లు ప్రభుత్వం తెలిపింది.

మూసీ పునరుజ్జీవనానికి 55 కిలోమీటర్ల సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించింది. 39 కొత్త ఎస్టీపీల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. గోదావరి నుంచి 2.5 టీఎంసీల స్వచ్ఛమైన నీటిని మూసీలోకి తరలించే ప్రణాళికను రూపొందించింది.

**పెట్టుబడులకు 'తెలంగాణ రైజింగ్'**

పారిశ్రామిక, ఐటీ రంగాల్లో తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దే ప్రయత్నాలను ప్రభుత్వం ముమ్మరం చేసింది.

టీజీ–ఐపాస్ ద్వారా 26,608 యూనిట్లకు రూ.1.29 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదాలు లభించాయి. టీజీఐఐసీ భూముల్లో రూ.92,281 కోట్ల పెట్టుబడులకు మార్గం సుగమమైంది. 78 వేలకుపైగా ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా చర్యలు చేపట్టింది.

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్––2025లో 100 అవగాహన ఒప్పందాల ద్వారా రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయి. హైదరాబాద్‌లో సాఫ్రాన్––సీఎఫ్‌ఎం విమాన ఇంజిన్ నిర్వహణ, మరమ్మతు కేంద్రానికి మార్గం సుగమమైంది.




నెక్స్ట్–జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ––2026–30 ద్వారా రూ.73,360 కోట్ల పెట్టుబడులు, 3.5 లక్షల ఉద్యోగాల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్ రంగాలకు ప్రత్యేక ప్రోత్సాహం కల్పించింది.

**ఐటీ.. గ్లోబల్ హబ్‌గా హైదరాబాద్**

2025–26లో తెలంగాణ ఐటీ ఎగుమతులు రూ.3.97 లక్షల కోట్లకు చేరుకున్నాయని ప్రభుత్వం తెలిపింది. ప్రత్యక్ష ఐటీ ఉద్యోగాల సంఖ్య 12.14 లక్షలకు చేరింది.

హైదరాబాద్‌లో 355కుపైగా గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు ఉండగా.. 2026లోనే మరో 40 కొత్త కేంద్రాలు నగరాన్ని ఎంచుకున్నాయి. డేటా సెంటర్లు, క్లౌడ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో తెలంగాణను దేశంలో వేగంగా ఎదుగుతున్న ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేసే చర్యలు కొనసాగుతున్నాయి.

తెలంగాణలో అమెజాన్ అదనంగా 7 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టే దిశగా అడుగులు వేసింది. భారత్ ఫ్యూచర్ సిటీ, చందన్‌వెల్లి ప్రాంతాల్లో భారీ హైపర్‌స్కేల్, ఏఐ–రెడీ క్లౌడ్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధమయ్యాయి.

**పర్యాటకానికి కొత్త పాలసీ**

రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తొలి సమగ్ర టూరిజం పాలసీ––2025ను అమలు చేసింది. ఐదేళ్లలో రూ.15 వేల కోట్ల పెట్టుబడుల లక్ష్యాన్ని నిర్దేశించగా తొలి ఏడాదిలోనే రూ.23,174 కోట్ల పెట్టుబడి పైప్‌లైన్ ఏర్పడింది. 42 అవగాహన ఒప్పందాలు కుదిరాయి.

యువ టూరిజం క్లబ్‌ల ఏర్పాటులో తెలంగాణ దేశంలో నంబర్–1గా నిలిచిందని ప్రభుత్వం పేర్కొంది. తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ 2025–26లో రూ.101.93 కోట్ల ఆదాయం, రూ.13.35 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది.

**తెలంగాణ అస్థిత్వానికి ప్రాధాన్యం**

'జయ జయహే తెలంగాణ' గీతానికి అధికారిక గౌరవం కల్పించింది. తెలంగాణ తల్లి విగ్రహాలను ఆవిష్కరించింది. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారికి, వారి కుటుంబాలకు సముచిత గౌరవం కల్పించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది.

రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మాల్ గ్రామపంచాయతీ ఆత్మనిర్భర్ పంచాయతీ స్పెషల్ అవార్డులో దేశంలో మొదటి స్థానం సాధించి రూ.1 కోటి పురస్కారం అందుకుంది.

**2047 లక్ష్యంగా 'తెలంగాణ రైజింగ్'**

రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించి దీర్ఘకాలిక లక్ష్యాలను ప్రభుత్వం ప్రకటించింది. 'తెలంగాణ రైజింగ్––2047' కింద 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దే లక్ష్యాన్ని నిర్దేశించింది.

దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచే దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాన్ని పెట్టుకుంది. క్యూర్––కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ, ప్యూర్––పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ, రేర్––రూరల్ అగ్రి రీజియన్ ఎకానమీగా మూడు అభివృద్ధి వలయాలతో రాష్ట్ర సమగ్ర ప్రణాళికను రూపొందించింది. భారత్ ఫ్యూచర్ సిటీని దేశంలో తొలి నెట్–జీరో స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఏఐ సిటీ, డేటా సెంటర్లు, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్, పరిశోధన, ఆవిష్కరణలకు ప్రపంచస్థాయి కేంద్రంగా తీర్చిదిద్దే ప్రణాళికలను ప్రకటించింది.

వెయ్యి రోజుల పాలన.. ముందున్న లక్ష్యాలు

వెయ్యి రోజుల పాలనలో సంక్షేమ పథకాల అమలు, రైతు భరోసా, మహిళా సాధికారత, సామాజిక న్యాయం, ఉద్యోగ నియామకాలు, విద్యా–వైద్య రంగాల విస్తరణతో పాటు పారిశ్రామిక, ఐటీ పెట్టుబడులకు ప్రాధాన్యం ఇచ్చినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఒకవైపు పేదలు, రైతులు, మహిళలు, యువతకు ప్రత్యక్ష ప్రయోజనం కల్పిస్తూ.. మరోవైపు ప్రపంచస్థాయి మౌలిక వసతులు, ఏఐ, డేటా సెంటర్లు, ఫ్యూచర్ సిటీ వంటి భవిష్యత్ ప్రాజెక్టులపై దృష్టి సారించింది.







TELANGANA RISING GLOBAL SUMMIT

ప్రజా కలం
సోమవారం, ఆగస్టు 31, 2026

# దారి తప్పుతున్న టీనేజ్...

పాఠశాల గేటు దాటే పిల్లల చేతుల్లో పుస్తకాలు, పెన్నులు ఉండాలి. పరీక్షల గురించి ఆలోచిస్తూ, ఆటల గురించి మాట్లాడుకుంటూ, స్నేహితులతో నవ్వుకుంటూ ఇంటికి తిరిగి రావాలి. కానీ అదే పిల్లల చేతుల్లో హత్యాయుధాలు కనిపిస్తున్నాయి. ఉపాధ్యాయులపై, తోటి విద్యార్థులపై దాడులు, డ్రగ్స్.. ఇవన్నీ పాఠశాల వయసు పిల్లల చుట్టూ విని పిస్తున్నప్పుడు “పిల్లలు చెడిపోతున్నారు” అని చెప్పి ముందుకు వెళ్లిపోవడం సరిపోదు..నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో పాఠశాల ప్రిన్సిపాల్ హత్యకు సంబంధించిన ఘటనలో పదో తరగతి విద్యార్థుల ప్రమేయం ఉందన్న విషయం ఈ ఆందోళనను మరింత పెంచింది. కూకట్‌పల్లిలో తోటి విద్యార్థిపై దాడి, నిజామాబాద్‌లో విద్యార్థినిపై లైంగిక దాడికి సంబంధించిన ఘటనలు కూడా సమాజాన్ని కలవరపెడుతున్నాయి.. ఇవి కేవలం పోలీసు కేసులు కావు.. ఇవి మన విద్యా వ్యవస్థకు, కుటుంబ వ్యవస్థకు, సమాజానికి ఎదురవుతున్న ప్రశ్నలు..ఏ పిల్లవాడూ పుట్టుకతో నేరస్తుడు కాదు. ఒక పిల్లవాడు హింసాత్మకంగా మారడం వెనుక ఇంటి పరిస్థితులు, పాఠశాల లో వేధింపులు, స్నేహితుల ఒత్తిడి, మానసిక ఒత్తిడి, సోషల్ మీడియా, సినిమాలు, డ్రగ్స్, గ్యాంగ్ సంస్కృతి వంటి అనేక ప్రభావాలు ఉండవచ్చు. పిల్లవాడు అకస్మాత్తుగా ఎక్కువగా కోప్పడటం, వస్తువులు పగలగొట్టడం, తల్లిదండ్రులతో మాట్లా డటం తగ్గించడం, పాఠశాలకు వెళ్లడానికి ఇష్టపడక పోవడం, స్నేహితులను మార్చుకోవడం, ఒంటరిగా ఉండటం, హింసాత్మక వీడియోలపై ఆసక్తి చూపించడం, బెదిరింపు భాష ఉపయోగించడం వంటి మార్పులు కనిపిస్తే వెంటనే అతడిని నేరస్తుడిగా ముద్ర వేయాల్సిన అవసరం లేదు. మన సమా జంలో పిల్లవాడు తప్పు చేసిన తర్వాత స్పందిస్తాం. కానీ అతను తప్పు చేసే దిశగా వెళ్తున్నప్పుడు మాత్రం గమనించం.స్మార్ట్‌ఫోన్, సినిమాలు, వెబ్‌సిరీస్‌లు, సోషల్ మీడియా పిల్లలకు జ్ఞానం, వినోదాన్ని అందించే సాధనాలే.. కానీ అదే సమయంలో హింస, సైబర్ బుల్లీయింగ్, డ్రగ్స్, గ్యాంగ్ కల్చర్, నేరాలను గొప్పగా చూపించే కంటెంట్ కూడా వారి ముందుకు వస్తోంది. హింసను హీరోయిజంగా, ప్రతీకారాన్ని గొప్పగా, నేరాన్ని స్టైల్‌గా చూపించే దృశ్యాలను పిల్లలు పదేపదే చూస్తున్నారు.. కొన్ని సెకన్ల షార్ట్ వీడియోల కోసం గంటల తరబడి ఫోన్‌లో గడుపుతూ, పక్కనే ఉన్న తల్లిదండ్రులతో పది నిమిషాలు మాట్లాడలేని పరిస్థితి కూడా ఏర్పడుతోంది. అయితే పిల్లల ప్రవర్తనకు ఫోన్, సినిమాలనే పూర్తిగా కారణంగా చూపడం కూడా సరైంది కాదు. సమస్య సాధ నాల్లో కంటే వాటిని పిల్లలు ఎలా ఉపయోగిస్తున్నారు, వారు చూస్తున్న కంటెంట్‌ను ఎలా అర్థం చేసుకుంటున్నారనే దాంట్లో ఉంది. అందుకే తల్లిదండ్రులు ఫోన్ లాక్కోవడం లేదా సినిమాలను నిందించడం మాత్రమే కాకుండా పిల్లలతో కలిసి కంటెంట్ గురించి మాట్లాడాలి.ఇప్పటి తల్లిదండ్రులకు మంచి పాఠశాలలో చదివించడం, సౌకర్యాలు కల్పించడం, ఖరీదైన ఫోన్ కొనివ్వడం తెలుసు.. కానీ పిల్లలతో ప్రశాంతంగా కూర్చొని మాట్లాడటానికి సమయం లేకపోవడం పెద్ద సమస్య. చదివావా ఎన్ని మార్కులు వస్తాయని అడగడం మాత్రమే కాదు. ఎలా ఉన్నావు.. ఏమైనా సమస్య ఉందా? ఎవరైనా ఇబ్బంది పెడుతున్నారా అని కూడా అడగాలి. పిల్లల చేతిలో ఫోన్ ఉందా లేదా అనేది మాత్రమే చూడటం కాదు. ఆ ఫోన్ కంటే ముందు వారి మనసులో ఏం జరుగుతుందో చూడాలి. పిల్లల నేరాలను కేవలం పోలీసుల సమస్యగా చూడలేం. ఇది కుటుం బం, పాఠశాల, ప్రభుత్వం, మీడియా, సినిమా, సోషల్ మీడి యా, సమాజం.. అందరి బాధ్యత. నేరం జరిగిన తర్వాత శిక్షిం చడం అవసరం. కానీ అంతకంటే ముఖ్యమైనది నేరం జరిగే పరిస్థితులను ముందే గుర్తించడం. పిల్లల చేతుల్లో కత్తులు వచ్చిన తర్వాత మార్చడం కంటే, ఆ కత్తి అవసరం అనిపించని బాల్యాన్ని నిర్మించడం మన అసలు లక్ష్యం కావాలి.నవ మాసాలు మోసి, కని, పెంచి, పెద్ద చేసి, తమ పిల్లలు ప్రయోజకులై ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రతి తల్లిదండ్రి కలలు కంటారు.. అయితే పిల్లలను పెంచడం మాత్రమే కాకుండా, వారిని సన్మార్గంలో నడిపించడం కూడా తల్లిదండ్రుల గురుతరమైన బాధ్యత. ముఖ్యంగా ప్రస్తుత కాలంలో సెల్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాల ప్రభావం పిల్లలపై తీవ్రంగా పడుతున్న నేపథ్యంలో, వారు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పిల్లల నడవడికను, వారి ఆలోచనా విధానాన్ని, స్నేహ సంబంధాలను, సామాజిక మాధ్యమాల వినియోగాన్ని తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తూ, వారికి సరైన మార్గదర్శకత్వం అందించాలి. అంతేకాకుండా పెద్దల పట్ల గౌరవం, చిన్నల పట్ల ప్రేమ, సమాజం పట్ల బాధ్యత వంటి సద్గుణాలను అలవర్చాలి. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమైనది.ఏ లక్ష్యం కోసం అయితే, ఏ ఆశయం కోసం అయితే విద్యార్థులు మన చెంతకు చేరుతున్నారో, వారి ఆశయాలను నెరవేర్చడానికి గురువులుగా అంకితభావంతో పనిచేయవలసిన గురుతర బాధ్యత ప్రతి ఒక్క ఉపాధ్యా యుడిపై ఉంది. విద్యార్థులను తమ సొంత పిల్లలుగా భావించి, వారి సర్వతోముఖాభివృద్ధికి తోడ్పాటునందించాలి. విద్యార్థులలో క్రమశిక్షణ లోపించకుండా, చెడు అలవాట్లకు దూరంగా ఉండేటట్లు ప్రతి పిల్లవాడిని తీర్చిదిద్ద వలసిన బాధ్యత అందరిపై ఉంది. ‘కొందరు చేస్తారు - వేము మాత్రం చూస్తాం’ అనే కొందరి ఉపాధ్యాయుల బాధ్యతారాహిత్యం వలన మొత్తం ఉపా ధ్యాయ లోకం అభాసుపాలు అయ్యే అవకాశం ఉంది. కావున పిల్లలలో క్రమశిక్షణను పెంపొందించడంలో ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు భాగస్వామ్యం కావాల్సిన అవసరం తప్పనిసరి.విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండేటట్లు, క్రమశిక్షణ పొంపొందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. విద్యాలయాలకు కిలోమీటర్ దూరంగా ఎలాంటి మత్తు పదార్థాలనుగాని ఇతర ధూమపాన వస్తువులను విక్రయించకుండా నిషేధించాలి. ఒకవేళ అనధికారికంగా మత్తు పదార్థాలను విక్రయించే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. క్రమశిక్షణ లోపించిన విద్యార్థులలో, క్రమశిక్షణ పెంపొందించడానికి కౌన్సిలింగ్ సెంట ర్లను ఏర్పాటు చేయాలి. ఏది ఏమైనప్పటికీ ఆధునిక కాలంలో కూడా విద్యార్థులలో సన్నగిల్లుతున్న క్రమశిక్షణను దారిలో పెట్టడానికి, తల్లిదండ్రులు, గురువులు, ప్రభుత్వం, సమాజ భాగస్వామ్యంతో కలిసి విద్యార్థులలో విలువలతో కూడిన విద్యను అందించి, వారిలో సత్ప్రవర్తనను పెంపొందించేటట్లు చూడాలి.



# వర్గీకరణతో ఉద్యమం ఆగదు

## - ప్రజా సంక్షేమమే ఎమ్మార్పీఎస్ లక్ష్యం

## - అణగారిన వర్గాల సమస్యల పరిష్కారమే తదుపరి కార్యాచరణ

## -ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు చెట్టు పెల్లి లక్ష్మణ్

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఆగస్టు 30 (ప్రజా కలం): ఎస్సీ వర్గీకరణ సాధించినంత మాత్రాన ఎమ్మార్పీఎస్ ఉద్యమం ముగియదని, ఇకపై సమాజంలోని అణగారిన వర్గాల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారమే ఉద్యమ ప్రధాన లక్ష్యమని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు చెట్టు పెల్లి లక్ష్మణ్ మాదిగ అన్నారు. ఆదివారం కథలాపూర్ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా మాజీ అధికార ప్రతినిధి కాశవత్తుల లక్ష్మీరాజం మాదిగ అధ్యక్షతన నిర్వహించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నూతన మండల కమిటీ ఎన్నికల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు వేములవాడ నియోజకవర్గంలోని కథలాపూర్ మండలంలో నూతన గ్రామ, మండల కమిటీల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. వర్గీకరణతో ఉద్యమం ఆగదని, ప్రజా సంక్షేమమే తదుపరి లక్ష్యమని స్పష్టం చేశారు. కేవలం మాదిగలకే పరిమితం కాకుండా అన్ని అణగారిన వర్గాల హక్కులు, సంక్షేమం కోసం ఎమ్మార్పీఎస్ సామాజిక పోరాటాలు నిర్వహించిందని తెలిపారు. నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు మారంపల్లి వినోద్ మాదిగ మాట్లాడుతూ 32 ఏళ్లుగా ఎన్నో ఒడిదుడుకులు, కుట్రలు, వెన్నుపోట్లను ఎదుర్కొంటూ మాదిగ సమాజం అండతో ఎమ్మార్పీఎస్ ఉద్యమం ముందుకు సాగిందన్నారు.

మండల అధికార ప్రతినిధిగా పొడిటి అర్జున్, ప్రధాన కార్యదర్శులుగా నక్క శంకర్, కొత్తూరు నవీన్, ఉపాధ్యక్షులుగా తరి పృథ్వీరాజ్, ఆయిల్‌వార్ కిరణ్, ఎర్ర అంజయ్య, కోశాధికారిగా తుర్తి దేవేందర్, కార్యదర్శులుగా గజ్జల అశోక్, లింగంపల్లి నరసయ్య, పానుగంటి అజయ్, బోయిని జలపతి, సహాయ కార్యదర్శులుగా రాగుట్ల తిరుపతి, బొడ్డు గణేశ్, బాపురపు నరేశ్ మాదిగలను ఎన్నుకున్నారు.కార్యవర్గ సభ్యులుగా సుంకే శ్రీకాంత్, చౌలమద్ది శంకర్, తెడ్డు గంగారెడ్డి, నల్ల నరేందర్, దయ్యాల నారాయణ, సింగారపు గంగారెడ్డి, దయ్యాల నరేష్ మాదిగ, రాగుట్ల లింగం మాదిగ తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

## సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు నియోజకవర్గ వ్యాప్తంగా కార్యక్రమాలు

## బీఆర్ఎస్ నాయకుల పిలుపు



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 30(ప్రజాకలం)

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా, వెయ్యి రోజుల పాలనలో ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఆదివారం మెట్‌పల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు.జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ముఖ్య నాయకులతో సమావేశమై సెప్టెంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు నియోజకవర్గవ్యాప్తంగా నిర్వహించనున్న కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. వెయ్యి రోజుల పాలనలో రైతులు, యువత, మహిళలు, నిరుద్యోగులు, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గ్రామగ్రామాన, వార్డువార్డున ప్రజలకు వివరించాలని నిర్ణయించారు. ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా సమస్యలను ప్రజల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలను విజయవంతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు జరిగే కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సమావేశంలో పిలుపునిచ్చారు.

# లోత్తునూర్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం




గొల్లపల్లి ఆగస్టు 30 ప్రజాకలం ప్రతినిధి

గొల్లపల్లి మండలం లోత్తునూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ ఆకుల సుమన్ గౌడ్ ఆధ్వర్యంలో శ్రీ తేజ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ జగిత్యాల వారు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్.వేణు గ్రామంలోని ప్రజలకు కీళ్లు ,భుజం,తుంటి,మోకాలు,వెన్నెముక,నరాలకు వ్యాధులకి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ సుమన్ గౌడ్ మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆరోగ్యమే తమ ప్రధాన లక్ష్యమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని నిర్వహిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఒరగంటి మల్లేష్, వార్డు సభ్యులు లక్కం రవి, శ్యామల శ్రీనివాస్ స్వప్నరాజు పుట్టపాక సత్యం, మైదశీ తిరుపతి,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మంచానికే పరిమితమైన వృద్ధురాలు మృతి..

## అనుమానంతో కేసు

మల్లాపూర్, ఆగస్టు 30 ( ప్రజా కలం ప్రతినిధి )

మంచానికే పరిమితమైన వృద్ధురాలు అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన ఘటన మల్లాపూర్ మండలం వెంకట్రావుపేటలో చోటుచేసుకుంది.ఎస్సై అనిల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం వెంకట్రావుపేటకు చెందిన భీమక్క (78)కు మూడేళ్ల క్రితం పక్షవాతం రావడంతో అప్పటి నుంచి మంచానికే పరిమితమయ్యారు. ఆమెను సుమారు 20 ఏళ్లుగా జర్పుల నాగమ్మ (70) తన వద్ద ఉంచుకుని బాగోగులు చూసుకుంటున్నారు.మూడు



రోజుల క్రితం నాగమ్మ అనారోగ్యానికి గురై కుమార్తె వద్దకు వెళ్లడంతో భీమక్క బాధ్యతలను తన పెద్ద కుమార్తెకు అప్పగించారు. అయితే ఆమె భర్త అనారోగ్యంతో ఉండటంతో ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చిందని, భీమక్కకు అన్నం పెట్టి వెళ్లినట్లు తెలిపారు.అనంతరం నాగమ్మ కుమారుడు తిరుపతి, పెద్ద కుమార్తె లక్ష్మికి ఫోన్ చేసి భీమక్కను చూడగా ఆమె గుర్రుమంటూ శబ్దాలు చేస్తుండటంతో ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఆమె కిందపడటంతో తలకు గాయమైందని కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం మంచంపై ఉంచగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మరణంపై నాగమ్మకు అనుమానం ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎ. అనిల్ తెలిపారు.

# మల్లాపూర్‌లో సెప్టెంబర్ 2న మండల స్థాయి పద్య పఠన పోటీలు

మల్లాపూర్ ఆగస్టు 30(ప్రజా కలం ప్రతినిధి)

తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగు భాషా పండితుల ఫోరం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2న మండల స్థాయి పద్య పఠన పోటీలు నిర్వహించనున్నట్లు ఫోరం జిల్లా అధ్యక్షుడు శేషగిరి తెలిపారు. మల్లాపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం ఒంటిగంటకు పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 6, 7వ తరగతి విద్యార్థులను జూనియర్, 8, 9, 10వ తరగతి విద్యార్థులను సీనియర్ విభాగాలుగా విభజించి పోటీలు నిర్వహించనున్నారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన సీనియర్, జూనియర్ విభాగాల నుంచి ఇద్దరేసి విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసి ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేయనున్నారు. తెలుగు భాషపై విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించడంతో పాటు పద్య పఠన నైపుణ్యాలను వెలికితీయడమే పోటీల ప్రధాన ఉద్దేశమని మండల బాధ్యులు కామర్తి సత్యనారాయణ, హరికృష్ణ, నళినీకుమార్ తెలిపారు.

# టీఆర్ఎస్‌లో భారీగా యువకుల చేరికలు

## కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన రఘు

మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 30 (ప్రజాకలం)

తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్)లో చేరికల పర్వం కొనసాగుతోంది. ఆదివారం మెట్‌పల్లిలోని పార్టీ కార్యాలయంలో టీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రఘు సమక్షంలో మెట్ల చిట్టాపూర్ గ్రామానికి చెందిన సుమారు 30 మంది యువకులు పార్టీలో చేరారు.శివకుమార్ నాయక్ ఆధ్వర్యంలో మెట్ల




చిట్టాపూర్ గ్రామంలోని ఏఎస్ఆర్ బంజారా తండాకు చెందిన శేఖర్, తిరుపతి, శివకుమార్, సురేష్, రఘు, వర్షిత్, వెంకటేష్, రాజేష్, సంజీవ్, రవీందర్, గంగాధర్, నితిన్ తదితరులు టీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా డాక్టర్ రఘు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం డాక్టర్ రఘు మాట్లాడుతూ పార్టీలో చేరిన యువకులు టీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. యువత భాగస్వామ్యంతో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు సుఖీందర్ గౌడ్, రేండ్ల రాజన్న, లింగంపల్లి సంజీవ్, ఎంఏ ముఖీమ్ భాయ్, విక్రాంత్ రెడ్డి పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో గ్రామా దేవతలకు నైవేద్యాలు..

మల్లాపూర్ , ఆగస్టు 30 (ప్రజా కలం ప్రతినిధి )

మల్లాపూర్ మండలం నడికుడ గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో గ్రామదేవతలకు, మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. మొగిలిపేట గోదావరి నుంచి గ్రామా ప్రజలందరూ కాలినడకన పవిత్ర జలాలను తీసుకొచ్చి నైవేద్యాలను సమర్పించి గ్రామదేవతలను భక్తిశ్రద్ధలతో పూజించారు.ఈ సందర్భంగా గ్రామంలో సుఖశాంతులు, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని గ్రామ ప్రజలు ప్రత్యేకంగా ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తూర్పు సమతా రాజన్న, ఉప సర్పంచ్ మారుతీ, గ్రామా పెద్ద మనుషులు, గ్రామా ప్రజలు పాల్గొన్నారు.



# సామాన్యుడి సమస్య వింటూ..

## అండగా నిలిచిన ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

### నాయకత్వంలో మానవీయతకు నిదర్శనంగా నిలిచిన దృశ్యం

నాగర్‌కర్నూల్ ఆగస్టు 30 (ప్రజా కలం ): ప్రజా ప్రతినిధిగా అధికార హోదాను పక్కనపెట్టి సామాన్యుల సమస్యలను ఆత్మీయంగా ఆలకించడం నిజమైన ప్రజా నాయకత్వానికి నిదర్శనమని ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి తీరు చాటుతోంది.



సాయం కోసం తన వద్దకు వచ్చిన ఓ వృద్ధుడి అర్జీని స్వయంగా స్వీకరించి, ఆయన సమస్యను ఓపికగా వింటూ పరిష్కారానికి భరోసా కల్పిస్తున్న దృశ్యం ప్రజల దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రజలు తమ సమస్యలతో నాయకుల వద్దకు వచ్చినప్పుడు కేవలం హామీలకంటే తమ బాధను వినే నాయకత్వం, తమకు అండగా నిలుస్తారనే నమ్మకాన్ని కోరుకుంటారని ఈ ఘటన మరోసారి స్పష్టం చేస్తోంది.

హోదాను పక్కనపెట్టి సామాన్యుడి వద్దకు వెళ్లి, అతని పక్కన నిలబడి సమస్యను తెలుసుకోవడం ద్వారా ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి ప్రజలతో తనకున్న ఆత్మీయ అనుబంధాన్ని చాటుకున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయడమే ప్రజా ప్రతినిధి బాధ్యత అనే భావనకు ఈ దృశ్యం ప్రతిబింబంగా నిలిచిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

"నాయకత్వం అంటే శాసించడం కాదు.. బాధితుడికి అండగా నిలిచి 'నేనున్నాను' అని భరోసా ఇవ్వడం" అనే సందేశాన్ని ఈ ఘటన చాటిచెబుతోంది.

## తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుడిని సన్మానించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు.

ఖమ్మం, ఆగస్టు 30(ప్రజా కలం న్యూస్ )

తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుడు మునగాల వెంకటరత్నం



ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆదివారం సత్కరించారు. ఇటీవల హైదరాబాదులోని రవీంద్ర భారతి లో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ సేవలందిస్తూ దేశ సమగ్రతను జాతీయ సమైక్యతను కాంక్షిస్తున్నందున జాతీయ సమైక్యత అవార్డుతో పాటు ప్రశాంశపత్రం పొందిన గ్రహీత ప్రముఖ జానపద సీనియర్ కళాకారులు పిట్టలదొర, తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుడు మునగాల వెంకటరత్నం ను చింతకాని లో రాష్ట్ర డిప్యూటీ సీఎం శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మత్తేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు, చింతకాని గ్రామ సర్పంచ్ కిలారుమనోహర్ బాబు, తదితరులు వున్నారు.

## 36 ఏళ్ల తర్వాత మళ్లీ కూరగాయల సంత ప్రారంభం

### బిజ్వారంలో సంతను ప్రారంభించిన సర్పంచ్ వై. శైలజ శ్రీనివాస్‌రెడ్డి

గద్వాల ప్రతినిధి ఆగస్టు 29 ప్రజా కలం:

జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల పరిధిలోని బిజ్వారం గ్రామంలో 36 ఏళ్ల క్రితం నిర్వహించిన కూరగాయల సంతను గ్రామ సర్పంచ్ వై. శైలజ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పునఃప్రారంభించారు. గ్రామ



పెద్దలు, ప్రజాప్రతినిధులు, నాయకుల సమక్షంలో సంతను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వై. శైలజ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. 1990 సంవత్సరంలో బిజ్వారం గ్రామంలో కొనసాగిన కూరగాయల సంతను 36 సంవత్సరాల తర్వాత తిరిగి ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. గ్రామ ప్రజలకు కూరగాయలు అందుబాటులో ఉండటంతో పాటు రైతులు, వ్యాపారులకు కూడా ఈ సంత ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సంతను కొనసాగిస్తూ, గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. పాత సంతను తిరిగి ప్రారంభించడంతో గ్రామ ప్రజలు, రైతులు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు జయరాముడు, నాగేష్, ఉప సర్పంచ్ చాపలకండ్ల కర్రెన్న, ఉప సర్పంచ్ శివ,మాజీ సర్పంచ్ భరత్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.




# NEET-PG--2026 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

**=బస్‌స్టాండ్, రైల్వే స్టేషన్‌లలో బైక్ హెల్ప్ సెంటర్లు**

**=అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా చర్యలు**

**=స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్**

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగష్టు 30:

మహబూబ్‌నగర్ జిల్లాలో ఆదివారం నిర్వహించిన NEET-PG--2026 పరీక్షను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టింది. ఇందులో భాగంగా ఎస్.పి.డి.జానకి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ పరీక్షా కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. జె.పి.ఎన్.సి. ఈ.లోని NEET-PG--2026 పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. పరీక్షా కేంద్రంలో అభ్యర్థులకు కల్పించిన మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు, ప్రవేశ విధానం, పరీక్షా నిబంధనల అమలు తదితర అంశాలను పరిశీలించారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు సమన్వయంతో నిర్వహించాలని అధికారులకు సూచించారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో, సురక్షితంగా చేరుకునేలా ప్రత్యేక రవాణా సహాయ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మహబూబ్‌నగర్ బస్‌స్టాండ్, రైల్వే స్టేషన్‌లలో బైక్ హెల్ప్ సెంటర్లను ఏర్పాటు చేశారు. దూర ప్రాంతాల నుంచి జిల్లాకు చేరుకున్న అభ్యర్థులు తమ పరీక్షా కేంద్రాలకు ఇబ్బంది లేకుండా చేరుకునేందుకు ఈ బైక్ హెల్ప్ సెంటర్ల ద్వారా అవసరమైన రవాణా సహాయం అందిస్తున్నారు. అదనపు కలెక్టర్ ఆయా హెల్ప్ సెంటర్లను కూడా పరిశీలించి, అభ్యర్థులకు అవసరమైన సహాయాన్ని వెంటనే అందించాలని సిబ్బందికి సూచించారు.

పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేయడంతో పాటు, పరీక్షా నిబంధనలను కచ్చితంగా పాటించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అభ్యర్థులు ఎలాంటి



ఆందోళనకు గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాసేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు.

NEET-PG--2026 పరీక్షను ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ తెలిపారు. ఆర్.డి. ఓ నవీన్, డి.ఎన్.పి.(ఎన్.బి)రమణా రెడ్డి తదితరులు ఉన్నారు

# ఆరు గ్యారెంటీల అమలుకు మళ్లీ ఉద్యమించాల్సిందేనా?

నాగర్‌కర్నూల్ ఆగస్టు 30 (ప్రజా కలం): ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ నాయకుడు నాగం శశిధర్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. ప్రజలు, ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కి ఆందోళనలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. నాగర్‌కర్నూల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. ఆయన వెంట టిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు




రైతులకు ఉచిత విద్యుత్ అందిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని నాగం శశిధర్‌రెడ్డి ప్రశ్నించారు. విద్యుత్ కోతల కారణంగా రైతులు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, వాటి అమలులో ప్రజలను నిరాశకు గురిచేస్తోందని విమర్శించారు. ఉద్యోగులు సైతం తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలకు దిగుతున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు.అలాగే కల్వకుర్తి ప్రాజెక్టు కాలువలు పూడిక, జమ్ముతో పేరుకుపోయినా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాలువల్లో పేరుకుపోయిన పూడిక, జమ్మును వెంటనే తొలగించి రైతులకు సక్రమంగా నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని నాగం శశిధర్‌రెడ్డి కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే ప్రజల తరఫున ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, అవసరమైతే ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు.

మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు, ఆరు గ్యారెంటీల అమలుపై తీవ్ర విమర్శలు చేశారు.

# ప్రతి పేద కుటుంబానికి సొంతింటి భరోసా

### - ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

### -ఎమ్మెల్యే కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి



నాగర్ కర్నూల్ ఆగస్టు 30 (ప్రజా కలం ): పేద మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డా.కూచుకుళ్ల రాజేష్ రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని 13వ వార్డులో ఈశ్వరమ్మ చిన్న గారి ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై నూతన గృహాన్ని సందర్శించారు.

ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే నూతన గృహంలో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. పేద ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కొనసాగుతోందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని అన్నారు. ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. నూతన గృహంలోకి అడుగుపెట్టిన కుటుంబ సభ్యులకు మరోసారి శుభాకాంక్షలు తెలిపారు.

**పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం**

నాగర్‌కర్నూల్ జిల్లా డీసీసీ కార్యదర్శి కొత్త శ్రీనివాసులు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాల సొంతింటి కల నెరవేరుతోందన్నారు. సొంత ఇంటిలోకి అడుగుపెట్టిన కుటుంబంలో ఆనందాన్ని చూడటం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనం అందేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తీగల సునెంద్ర, వైస్ చైర్మన్ బాదం రమేష్, పట్టణ అధ్యక్షుడు జక్కా రాజ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

# గద్వాల మార్కెట్‌యార్డులో 6 కేజీల గంజాయి పట్టివేత!

### రూ.6 లక్షల విలువ.. ఇద్దరు పోలీసుల అదుపులో.. మరొకరు పరార్?

గద్వాల, ఆగస్టు 30 (ప్రజా కలం):

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని మార్కెట్‌యార్డులో భారీగా గంజాయి పట్టుబడినట్లు సమాచారం. సుమారు 6 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. దీని బహిరంగ మార్కెట్ విలువ సుమారు రూ.6 లక్షలు ఉంటుందని సమాచారం. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తుండగా, మరో వ్యక్తి పోలీసులకు చిక్కకుండా పరారైనట్లు సమాచారం. అదుపులోకి తీసుకున్న ఇద్దరూ ఇటిక్యాల మండలం శెనిగపల్లి గ్రామానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. మార్కెట్‌యార్డులో ఇంత పెద్ద మొత్తంలో గంజాయి పట్టుబడటంతో గద్వాల పట్టణంలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై చర్చకు దారితీసింది. గంజాయి ఎక్కడి నుంచి తీసుకొచ్చారు? ఎవరికి సరఫరా చేసేందుకు తీసుకొచ్చారు? అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా యువతను లక్ష్యంగా చేసుకుని మత్తు పదార్థాల విక్రయాలు, సరఫరా జరుగుతున్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్న



నేపథ్యంలో పోలీసులు పట్టణంలోని అనుమానాస్పద ప్రాంతాలపై మరింత నిఘా పెంచాలని ప్రజలు కోరుతున్నారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేసి, గంజాయి రహిత గద్వాలగా తీర్చిదిద్దేందుకు పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## ఆళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ వార్షిక తనిఖీ

ఆళ్లపల్లి, ఆగస్టు 30,ప్రజాకలం

ఇల్లందు సబ్ డివిజన్ పరిధిలోని ఆళ్లపల్లి పోలీస్ స్టేషన్‌ను ఇల్లందు డీఎస్పీ యు. వెంకన్న బాబు ఆదివారం వార్షికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ నిర్వహణ, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, వివిధ



రికార్డులు, సిబ్బంది పనితీరును ఆయన పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఆళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణ, నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డీఎస్పీ సూచించారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా, క్రమశిక్షణతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ తనిఖీలో టేకులపల్లి సర్కిల్ సీఐ బి. సత్యనారాయణ, ఆళ్లపల్లి ఎస్‌హెచ్‌ఓ ఎం. సోమేశ్వర్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అన్నాభావూ సాఠే ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

### - సర్పంచ్ కాలేవర్ రుచిత దిగంబర్

తానూర్, ఆగస్టు 30(ప్రజాకలం): ముధోల్ మండలంలోని విట్టోలి గ్రామంలో డాక్టర్ అన్నాభావూ సాఠే 106వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ కాలేవర్ రుచిత దిగంబర్ సాఠే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తన సాహిత్యంతో సామాజిక చైతన్యానికి, శ్రామిక వర్గాల



హక్కుల కోసం బాటలు వేసిన మహనీయుడు సాఠే అని కొనియాడారు. ఆయన చూపిన బాటలో పయనిస్తూ సామాజిక సమానత్వానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్ శివరాజ్, మాజీ సర్పంచ్ సత్య గౌడ్, నగేష్ పటేల్, దిగంబర్ పటేల్ గ్రామ పెద్దలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## మహాలక్ష్మి ఆలయంలో హుండీ చోరీ: నిందితుడి అరెస్ట్

తానూర్ ,ఆగస్టు 03(ప్రజా కలం): నిర్మల్ జిల్లా తానూర్ మండలంలోని మొగిలి గ్రామంలో ఉన్న మహాలక్ష్మి ఆలయంలో హుండీని పగలగొట్టి రూ. 5 వేల నగదు చోరీ చేసిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు,ఆదివారం తానూర్ ఎస్సై షేక్ జుబేర్ ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు, గ్రామానికి చెందిన సిద్ధులొళ్ల లక్ష్మణ్ మద్యానికి బానిసయ్యాడు, డబ్బుల కోసం ఈ నెల 27న తెల్లవారుజామున 2 గంటల సమయంలో ఆలయంలోకి చొరబడి హుండీని పగలగొట్టి నగదును అపహరించాడు,గ్రామస్థుల నుంచి సేకరించిన సమాచారం, వాంగ్మూలాల ఆధారంగా అనుమానితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా, అతడు నేరాన్ని అంగీకరించాడు,దొంగిలించిన సొమ్మును మద్యం కోసం ఖర్చు చేసినట్లు నిందితుడు తెలిపారు,నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని, కేసు తదుపరి దర్యాప్తులో ఉందని ఎస్సై పేర్కొన్నారు.



# మంత్రికి పవర్ కట్



హైదరాబాద్ : తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో మంత్రి కొండా సురేఖ వ్యవహారం అత్యంత ఆసక్తికరమైన మలుపు తిరిగింది. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అధిష్టానంతో కొండా ఫ్యామిలీ వైరం తారస్థాయికి చేరిన వేళ.. ఆమెను నేరుగా పదవి నుంచి తప్పించకుండానే, మంత్రిత్వ శాఖలో ఉన్న అధికారాలన్నింటికీ కత్తెర వేసే సరికొత్త ఆపరేషన్ మొదలైంది. ప్రత్యక్షంగా వేటు వేస్తే వచ్చే రాజకీయ నష్టాన్ని నివారిస్తూ, పరిపాలనాపరంగా ఉక్కిరిబిక్కిరి చేసి ఆమే స్వయంగా తప్పుకునేలా లేదా దిగివచ్చేలా చేయడమే ఈ వ్యూహం వెనుక ఉన్న అసలు లక్ష్యంగా కనిపిస్తోంది. పర్యావరణ, అటవీ శాఖ మంత్రిగా ఉన్న కొండా సురేఖకు తాజాగా ప్రభుత్వం ఊహించని షాక్ ఇచ్చింది. మంత్రికి ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే, ఆమె తనకు అనుకూలంగా నియమించుకున్న దాదాపు 20 మందికి పైగా అధికారుల డిప్యూటేషన్లను ప్రభుత్వం రద్దు చేసింది. ఇందులో కీలకమైన ఐఎఫ్ఎస్ అధికారులతో పాటు ఇతర ఉన్నతాధికారులు కూడా ఉన్నారు. వీరిని తక్షణమే మాతృశాఖలకు పంపించడంతో పాటు, సచివాలయం, క్షేత్రస్థాయి యంత్రాంగానికి బలమైన సంకేతాలు వెళ్లాయి. ఉన్నతాధికారులు ఇకపై మంత్రి నిర్ణయాల కంటే సీఎంఓ ఆదేశాలకే ప్రాధాన్యత ఇవ్వాలనే పరిస్థితిని తీసుకురావడం ద్వారా శాఖాపరంగా ఆమెను పూర్తిగా డమ్మీ చేసేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ కుటుంబం బహిరంగంగా విమర్శలు గుప్పించిన తర్వాత, ఆమెపై వెంటనే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటారని అంతా భావించారు. అయితే, ఆమెను నేరుగా మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేస్తే ఒక బలమైన బీసీ మహిళా నేతపై కాంగ్రెస్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందనే సామాజిక ముద్ర పడే ప్రమాదం ఉంది. ఈ 'బీసీ సెంటిమెంట్' రాజకీయంగా బూమరాంగ్ కాకుండా ఉండటానికే అధిష్టానం తాత్కాలికంగా ఈ పరోక్ష వ్యూహాన్ని ఎంచుకున్నట్టు సమాచారం. నేరుగా వేటు వేయకుండా అధికారాలను నియంత్రించడం ద్వారా.. మంత్రిగా ఎలాంటి కీలక నిర్ణయాలు తీసుకోలేరు. పరిపాలనాపరంగా, రాజకీయంగా పార్టీలో ఆమె ఒంటరి అవుతుంది. స్వయంగా రాజీనామా చేసేలా మానసిక ఒత్తిడి పెంచడం లేదా అధిష్టానం వద్దకు వచ్చి రాజీపడేలా చేయడం దీని వెనుక వ్యూహంగా ఉంది. మరోవైపు, కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ సెటిల్‌మెంట్ల వ్యవహారం చుట్టూ చట్టపరమైన ఉచ్చు బిగుస్తోంది. పాత ఆరోపణలు, సెటిల్‌మెంట్లపై పోలీసులు విచారణను ఒక్కసారిగా వేగవంతం చేశారు. గత కేసులను బయటకు తీసి దర్యాప్తు చేయడం వెనుక పక్కా వ్యూహం కనిపిస్తోంది. దీనివల్ల కొండా కుటుంబం కేవలం రాజకీయంగానే కాకుండా, చట్టపరమైన అంశాల్లోనూ పూర్తిగా డిఫెన్స్‌లో పడిపోతుంది. అవినీతి, అక్రమాల ఆరోపణల చుట్టూ చర్చను తిప్పడం ద్వారా కొండా సురేఖ సామాజిక కోణాన్ని లేదా 'బీసీ కార్డు'ను రాజకీయ రక్షణ కవచంగా వాడుకునే అవకాశాన్ని ప్రభుత్వం సమర్థవంతంగా మూసివేసింది. ఏ రాజకీయ నాయకుడికైనా అధికారాలు లేని మంత్రి పదవిలో కొనసాగడం చిరాకు తెప్పిస్తుంది. చేతులు కాలకుండా ఆకులు పట్టుకునే చందంగా కాంగ్రెస్ నాయకత్వం వేసిన ఈ ఎత్తుగడ కొండా సురేఖను పూర్తి ఆత్మరక్షణలోకి నెట్టింది. అధికారం లేని శాఖను మోస్తూ ఉత్సవ విగ్రహంలా ఉండటమా? లేక పంతం వీడి సీఎం, అధిష్టానం ముందు లొంగిపోవడమా? అన్నది తేల్చుకోవాల్సిన సంకట స్థితిలో కొండా దంపతులు పడ్డారు. పరిపాలనాపరంగా హక్కులను గుల్ల చేస్తూ రాజకీయ పట్టు బిగించే ఈ వ్యూహం తెలంగాణ కాంగ్రెస్‌లో కొండా సురేఖ రాజకీయ భవితవ్యాన్ని ఏ తీరానికి చేరుస్తుందో వేచి చూడాలి

# 'పరిషత్' ఎన్నికలు ఎప్పుడు?




సిరిసిల్ల : పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలతోపాటే జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికల ప్రక్రియ కూడా ముగిస్తారని అధికార పార్టీ కాంగ్రెస్ నేతలతో పాటు ఇతర పార్టీల్లోని ఆశావహులు హడావుడి చేసినా నిరాశనే మిగిలుస్తోంది. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీలోని ఆశావహుల్లో నామినేటెడ్ పదవులు లేక, పరిషత్ ఎన్నికల్లో పదవులు దక్కించుకునే అవకాశం రాకపోవడంతో తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఆధిపత్యాన్ని ప్రదర్శించిన నేపథ్యంలో అదే ఉత్సాహంతో పరిషత్ ఎన్నికలు కూడా నిర్వహిస్తారని భావించారు. గతంలో జడ్పీటీసీ స్థానాలు, ఎంపీపీ స్థానాలు ఖరారు చేస్తూ నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు నిలిపివేయడంతో ఎన్నికల ప్రక్రియ వాయిదా పడింది. తర్వాత పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు పాత రిజర్వేషన్ల పద్ధతిలోనే పూర్తి చేశారు. అదే మాదిరిగా పరిషత్ ఎన్నికలు కూడా నిర్వహిస్తారని ఆశావహులు పల్లెల్లో కొద్ది రోజులు హడావుడి చేసి మౌనం దాల్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 12 జడ్పీటీసీలు, 12 ఎంపీపీలు,123 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. ఇందుకు సంబంధించి ఎన్నికల నిర్వహణపై తరచూ ప్రభుత్వం పెద్దలు ఎన్నికలు వస్తాయని సంకేతాలు ఇవ్వడంతో పల్లెల్లో ఎన్నికల వాతావరణం మొదలుకావడం, ఆ తర్వాత పట్టించుకోకపోవడంతో సద్దుమణగడం, ఆశావహులకు నిరీక్షణ తప్పడం లేదు. ఏప్రిల్ మాసంలో ఓటర్ జాబితాల పరిశీలన చేపట్టడంతో ఎన్నికలు వస్తాయని భావించారు. కాంగ్రెస్ పార్టీలోని ఆశావహులు పల్లెల్లో మకాం మార్చి జిల్లా పరిషత్, ఎంపీపీ, జడ్పీటీసీలు, ఎంపీటీసీ పదవులు దక్కించుకోవడానికి ప్రయత్నాలు మొదలుపెట్టారు. గ్రామ పెద్దలు, కుల సంఘాలు, యువజన సంఘాలు, మహిళా సంఘాలతో సమాలోచన చేస్తూ.. అందర్నీ పలకరిస్తూ ఇంటింటికి తిరుగుతూ మద్దతు కూడగట్టుకున్నారు. కానీ ప్రభుత్వం కొద్దిరోజులుగా పరిషత్ ఎన్నికల ఊసే ఎత్తడం లేదు. దీంతో మళ్లీ జిల్లాలోని 260 గ్రామాల్లో రాజకీయ స్తబ్ధత ఏర్పడింది. మరోవైపు 2019 రిజర్వేషన్ల ప్రకారం పరిషత్ ఎన్నికలు జరుగుతాయని భావిస్తున్నారు. దాని ప్రకారం జిల్లాలో 12 జడ్పీటీసీ స్థానాల్లో ఒకటి ఎస్టీ మహిళ, ఒకటి ఎస్సీ మహిళ, రెండు ఎస్సీ జనరల్, ఒకటి బీసీ మహిళ, ఒకటి బీసీ జనరల్, మూడు జనరల్ మహిళ, మరో మూడు జనరల్‌లకు కేటాయించారు. రిజర్వేషన్ల ప్రకారం ఆరు మహిళలకు, ఆరు జనరల్‌గా ఉన్నాయి. 123 ఎంపీటీసీ స్థానాలు ఉండగా 68 మహిళలకు, 58 జనరల్‌కు కేటాయించారు. ఇందులో ఎస్టీలకు ఆరు కేటాయించగా, 5 మహిళలకు, ఒకటి జనరల్‌గా ఉంది. 28 ఎస్సీలకు కేటాయించగా 17 మహిళలకు, 11 జనరల్, 25 బీసీలకు కేటాయించగా 14 మహిళలకు, 11 జనరల్ స్థానాలుగా ఉన్నాయి. 64జనరల్ స్థానాలు ఉండగా 29 మహిళలకు, 25 జనరల్‌గా కేటాయించారు. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో బీసీ డెడికేషన్ కమిటీ ఇచ్చే రిపోర్ట్ ప్రకారం రిజర్వేషన్లు ఖరారు చేశారు. పరిషత్ రిజర్వేషన్లు జరుగుతాయని భావిస్తున్నారు. జిల్లా పరిషత్ ఎన్నికల్లో 3.53 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1.70 లక్షలు. మహిళలు 1.82 లక్షల మంది ఉన్నారు. ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం ఇప్పటికే పోలింగ్ కేంద్రాలు, పోలింగ్ సామగ్రిని సిద్ధం చేసింది. 12 జడ్పీటీసీలు, 123 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి 712 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసే విధంగా సిద్ధంగా ఉన్న ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ మాత్రం ఇవ్వడం లేదు.

**రెండేళ్లుగా ఎదురుచూపులే..**

రాజన్న సిరిసిల్ల జిల్లా పరిషత్, 12 మండల పరిషత్, జడ్పీటీసీలు, ఎంపీటీసీల పదవీకాలం 2024 జూలైలో ముగిసి రెండేళ్లు దాటిపోయింది. పరిషత్ పదవుల ఆశలతో పంచాయతీ ఎన్నికల్లో ఇతరులకు అవకాశాలు ఇచ్చి ఆవేదన చెందుతున్న వారు ఉన్నారు. పల్లెల్లో పంచాయతీ ఎన్నికల్లో ముందుకు వచ్చిన ఆశావహులను ఆయా పార్టీల నేతలు వారిని బుజ్జగించి కొందరికి సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాన్ని కల్పించారు. కొందరికి జడ్పీటీసీ, ఎంపీటీసీ టిక్కెట్లు ఇస్తామని హామీలు ఇచ్చారు. ప్రధానంగా అధికార కాంగ్రెస్ పార్టీలో పదవుల ఆశతో ఇతర పార్టీల నుంచి వలస వచ్చినవారు నామినేటెడ్ పదవులు దక్కకపోగా, పరిషత్ ఎన్నికలు పరిస్థితులు నిరాశ చెందుతున్నారు.

**'సర్' తర్వాత ఎన్ని'కల'లేనా...** జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికల కోసం ఇప్పటికే జిల్లాలో 3.53 లక్షల ఓటర్లతో జాబితాలు సిద్ధం చేశారు, ప్రస్తుతం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ(సర్) ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే ముసాయిదా ఓటరు జాబితాను వెల్లడించింది. తుది ఓటరు జాబితా అక్టోబర్ 19 ప్రకటిస్తారు. పరిషత్ ఎన్నికలు తుది ఓటర్ జాబితా వచ్చిన తర్వాత నిర్వహిస్తారా.. లేక ముందే నిర్వహిస్తారా అనే సందిగ్ధం కూడా ఆశావహుల్లో ఉంది. సర్ ఓటర్ జాబితా ప్రకారం నిర్వహిస్తే గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్లు తగ్గిపోతారని ఆశావాహుల్లో ఆందోళన కూడా ఉంది. ఉద్యోగం, వ్యాపారరిత్య పట్టణాల్లో స్థిరపడ్డ వారు ఈసారి ఓటు హక్కు కోసం ఎన్యూమరేషన్ పత్రాలు అక్కడే అందించారు. దీంతో వలస ఓటర్ల మద్దతు పోయినట్లుగానే భావిస్తున్నారు.

# గోశాల మరింత పటిష్ఠానికి చర్యలు



వేములవాడ : వేముల వాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారికి భక్తులు సమ ర్పించే కోడెలు, ఆవుల సంరక్షణ కోసం గోశాలను మరింత పటిష్టం చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల ఐదు రాజన్న కోడెలు మృత్యువాత పడిన ఘటనపై బుధవారం తిప్పాపూర్ గోశాలను సందర్శించారు. గోశాల నిర్వహకులు, దేవాదాయ శాఖ అధికారులు, సంబంధిత పశువైద్యులను వివరాలు అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ చిన్న వయసు కోడెలను దూరప్రాంతాల నుంచి తీసుకురావడం, వాతావరణ మార్పులు, వ్యాధులు తదితర కారణాల వల్ల ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అన్నారు. భక్తులు రాజన్నకు మొక్కు చెల్లించే ఉద్దేశ్యంతో పాలు మరవని చిన్న కోడెలను సమర్పించ వద్దని విజ్ఞప్తి చేశారు. కనీసం ఏడాది వయసు వచ్చిన తర్వాత కోడెలను సమర్పిస్తే అవి వాతావరణానికి అలవాటు పడి అనారోగ్యానికి గురికాకుండా ఉండే అవకాశం ఉంటుందని సూచించారు. గోశాలకు కొత్తగా వచ్చే కోడెలను 15 రోజుల పాటు క్వారంటైన్‌లో ఉంచి, వయసు ఆధారంగా గ్రేడింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. చిన్న కోడెలు, పెద్ద కోడెలను వేర్వేరుగా ఉంచేలా ఏర్పాట్లు చేయాలని, ఒకదానిపై మరొకటి ఎగబడటం, పొడుచుకోవడం వంటి ఘటనలతో గాయాలు కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో గోశాలలో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఎప్పటికప్పుడు శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గోశాలలో పచ్చిగడ్డి, దాతలు అందించే పశుగ్రాసంతో పాటు అవసరమైన దాణాను నాణ్యతలో రాజీ లేకుండా అందిస్తున్నామని తెలిపారు. ఇటీవల జరిగిన కోడెల మృతి ఘటనపై సమగ్ర విచారణ జరిపిస్తామని స్పష్టం చేశారు. మానవ తప్పిదం లేదా అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఘటన జరిగిందని తేలితే ప్రభుత్వపరంగా తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆధునిక పద్ధతుల్లో నూతన గోశాల నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు 40 ఎకరాల స్థలాన్ని సేకరించి, క్యాబినెట్ ఆమోదం కూడా పొందినట్లు తెలిపారు. త్వరలోనే నిర్మాణానికి సంబంధించిన చర్యలు చేపట్టి వీలైనంత త్వరగా నూతన గోశాలను అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తామని చెప్పారు. భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని రాజన్న ఆలయానికిసమర్పించేకోడెల సంరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం జరగకుండా ప్రభుత్వం,దేవాదాయ శాఖ,పశుసంవర్ధక శాఖ సమన్వయంతో పని చేస్తామని అన్నారు.

## పేదల సంక్షేమానికి పెద్దపీట

కోడుమూరు : సీఎం చంద్రబాబు పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథాన నడిపిస్తున్నారని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. ప్యాలకుర్తిలో రెండేళ్ల నమ్మకం- సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి కూటమి పాలన గురించి వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్నామని తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన చేబడుతున్నట్లు తెలిపారు. ప్యాలకుర్తిలో రూ. 90 లక్షలతో అభివృద్ధి పనులు చేసినట్లు వివరించారు. ప్యాలకుర్తి మెయిన్ బజారులో వెంకటస్వామి అనే దివ్యాంగుడు కూటమి పాలనపై సంతోషం వ్యక్తం చేశాడు. ఎమ్మెల్యే దస్తగిరి పంక్చర్ షాపు నిర్వహిస్తున్న వెంకటస్వామికి కరపత్రం ఇచ్చి ప్రభుత్వ పాలనపై ఆరా తీశారు.

# 'భగ్గుమంటున్న' నిత్యావసరాల ధరలు

అమరావతి : రాష్ట్రంలో నిత్యావసరాల ధరలు భగ్గుమంటున్నాయి. ఉల్లి, ఎండు మిర్చి, చక్కెర, వంట నూనెలు ఇలా రోజువారీ సరుకులన్నీ అమాంతం పెరిగిపోయి సామాన్యుడిని చతికిల పడేస్తున్నాయి. ప్రధానంగా ఉల్లి, మిరప వంట నూనెల ధరలు గతేడాదితో పోల్చితే భారీగా పెరిగాయి. గతేడాది ఆగస్టులో ఉన్న ధరలకూ, ఈ నెలలో ధరలకు భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. ఉల్లి ధర ఏకంగా 83 శాతం వరకు పెరుగుదల నమోదు కాగా, ఎండుమిరప ధర కూడా 54 శాతం వరకు పెరుగుదల కనిపించింది. ప్రణాళికా శాఖ నివేదికలో ఇతర నిత్యావసరాలు కూడా పెరిగినట్టు తేలింది. పెరుగుతున్న ధరలు వినియోగదారులపై భారం పెంచుతున్నాయి. ముఖ్యంగా ఎండు మిరపకాయలు, ఉల్లిపాయలు, వంట నూనెలు, కందిపప్పు ధరలు ఏడాది కాలంలో గణనీయంగా పెరిగాయి. గత నెలతో పోల్చిచూసినా పెరుగుదల ఎక్కువగానే కనిపిస్తోంది. ధరల పెరుగుదలలో ఎండు మిరపకాయలు ముందంజలో ఉన్నాయి. గ్రేడ్-1 మిరపకాయ కిలో ధర రూ. 282.39గా నమోదైంది. గతేడాది రూ. 176.55 ఉండగా, ఏడాది కాలంలో రూ. 112.24 వరకు పెరగడం గమనార్హం. ఇది ఏకంగా 63.57 శాతంగా ఉంది. గ్రేడ్-2 ఎండు మిరపకాయల ధర రూ. 253.35గా ఉండగా, ఏడాదిలో 65.81 శాతం పెరిగింది. ఉల్లి ధరల్లో భారీగా..ఉల్లిపాయల ధరలు కూడా వినియోగదారులకు గట్టి షాక్ ఇస్తున్నాయి. గ్రేడ్-1 ఉల్లి కిలో రూ. 52.62గా ఉంది. గతేడాది రూ. 29 ఉంది. ఏడాది కాలంలో ధర 75.14 శాతం పెరిగింది. గ్రేడ్-2 ఉల్లి ధర 45.35 కాగా, గత నెలతో పోలిస్తే 37.52 శాతం, గతేడాదితో పోలిస్తే ఏకంగా 83.35 శాతం పెరిగింది. బయట మార్కెట్లో అయితే కిలో రూ. 60 పైనే అమ్ముతున్నారు.. జాతీయ బీసీ సంక్షేమ సంఘం స్టేట్ సెక్రటరీ డాక్టర్ వడ్డేపల్లి తెలిపారు. నూనె ధరలూ పైకే.. వంట నూనెల ధరల్లోనూ ఏడాది కాలంలో స్పష్టమైన పెరుగుదల కనిపిస్తోంది. సన్‌ఫ్లవర్ ఆయిల్ లీటరుకు రూ. 177.22గా ఉండగా, ఏడాదిలో 21.40 శాతం పెరిగింది. పామాయిల్ రూ. 152.54 ఉండగా, గతేడాది రూ. 129 ఉంది. వేరుశనగ నూనె రూ. 159 నుంచి రూ. 183.46 వరకు పెరిగింది. కందిపప్పు ధరలు కూడా వినియోగదారులపై భారంగా మారాయి. గ్రేడ్-1 కందిపప్పు కిలో రూ. 133.10గా ఉండగా, గతేడాది రూ. 117గా ఉంది. గ్రేడ్-2 ధర 121.93తో 14.56 శాతం పెరిగింది. బియ్యం ధర కూడా.. బియ్యం ధరలు కూడా ఏడాది కాలంగా పైకి ఎగబాకుతున్నాయి. సూపర్‌ఫైన్ గ్రేడ్-1 బియ్యం 11.45 శాతం, ఫైన్ రకం 13.57 శాతం, సాధారణ గ్రేడ్-2 12.02 శాతం పెరిగాయి. మిగతా వస్తువులతో పోలిస్తే చింతపండు ధరల్లో పెరుగుదల తక్కువగా ఉంది. గ్రేడ్-1 2.27 శాతం పెరిగింది. సాధారణ రకం 5.19 శాతం, మూడో రకం 10.49 శాతం పెరిగాయి.

ఆకాశాన్నంటున్న చక్కెర ధరలు...

అన్ని ధరలతోపాటు రాష్ట్రంలో చక్కెర ధరలు కూడా గణనీయంగా పెరిగాయి. ఈ నెల ఆరంభంలో కిలో రూ. 45 వరకు ఉన్న ధర తాజాగా రూ. 65 వరకు పెరిగింది. దీంతో రోజువారీ ఇంట్లో వినియోగించేవారితో సహా హోటళ్లు, బేకరీలపై కూడా దీని ప్రభావం ఎక్కువగా పడుతోంది. చెరుకు పంట తగ్గిపోవడం వల్లే అని అధికారులు చెబుతున్నప్పటికీ ఇథనాల్ కోసం చెరుకును మళ్లించడం ద్వారా సాధారణ చక్కెరపై ఈ ప్రభావం పడుతున్నట్లు తెలుస్తోంది..

# అవినాష్‌ను 'వివేక' కేసులో అక్రమంగా ఇరికించారు

కడప : ది హ్యాట్రిక్ కడప పార్లమెంట్ సభ్యుడు వై. ఎస్. అవినాష్ గెలుపు కోసం బాబాయ్ మాజీమంత్రి వై.ఎస్. వివేక నంద రెడ్డి చనిపోక ముందు రోజే అప్పటి వైయస్సార్ సీపీ శాసన సభ్యుడు శెట్టిపల్లె రఘురామి రెడ్డి వై.ఎస్.అవినాష్ రెడ్డి తో కలసి అవినాష్ గెలుపు కోసం చాపాడు మండలంలో పర్యటించిన బాబాయ్ 'వివేక' ను అవినాష్ హత్య ఎలా చేస్తారని ఆయన సూటిగా ప్రశ్నిస్తూ అలాంటి శాంతి కాముకుడు, ఫ్యాక్షన్ అంటే గిట్టని అవినాష్ ఎదుగుదలను అడ్డుకునేందుకు కుట్ర లో బాగంగా అవినాష్ ను వివేక హత్యకేసులో ఇరికించారని. ఈ కష్టాలు తాత్కాలికమేనని ఆ కేసు నుండి వై.ఎస్. అవినాష్ కడిగిన ముత్యంలా బైట పడతారని వైయస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకట సుబ్బారెడ్డి స్పష్టం చేశారు. ఖాజీపేట మండలం, దుంపలగట్టు వద్ద నేషనల్ హైవే లోని నో మ్యాడ్ స్మార్ట్ హైవే స్టాల్ వద్ద వై.ఎస్ అవినాష్ రెడ్డి,వైయస్సార్ సీపీ మైదుకూరు నియోజక వర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి జన్మదిన వేడుకలు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, వైఎస్ఆర్సిపి నేత, కేసీ కెనాల్ ప్రాజెక్ట్ మాజీ వైస్ చైర్మన్ రెడ్యం చంద్రశేఖర్ రెడ్డి, వైయస్సార్ సీపీ మండల నేత శెట్టిపల్లె సిద్ధా రెడ్డి లు ముఖ్య అతిథులుగా పాల్గొనగా గురువారం ఉదయం ఘనంగా జరిగాయి. వైయస్సార్ సీపీ బీసీ విభాగం జిల్లా కార్యదర్శి బత్తల సుబ్బరాయుడు యాదవ్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా వైయస్సార్సీపి శ్రేణులనుద్దేశించి రెడ్యం వెంకట సుబ్బారెడ్డి ప్రసంగిస్తూ నిత్యం ప్రజల కోసం పరితపించే వై.ఎస్ అవినాష్ ఎదుగుదలను అడ్డుకోవాలనే ప్రభుత్వ,ప్రతిపక్షాల కుట్ర అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపడమేనని ఆయన తెలిపారు. అవినాష్ పై నిరాధార ఆరోపణలను చేస్తూ దొంగ దెబ్బతీసేందుకు విఫల యత్నం చేస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. వై.ఎస్ అవినాష్ పై చేసే విమర్శలు నీటి మాటలుగా మిగిలి పోక తప్పదన్నారు. వై.ఎస్.జగన్ ముఖ్యమంత్రిని చేసేందుకు వైయస్సార్ సీపీ శ్రేణులనీతా చావో,రేవో అనే విదంగా పనిచేయలన్నారు. వైఎస్సార్ సీపీ లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపు కోసం వర్గ రాజకీయాలను ప్రక్కన పెట్టకపోతే చరిత్ర హీనులు కాక తప్పదని రెడ్యం తీవ్రంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత లు,జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గి రెడ్డి కొండారెడ్డి, వైయస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు ముత్తూరు రమణ,ఏటూరు మాజీ సర్పంచ్ ఏనుగు రాజ గోపాల్ రెడ్డి, చెముళ్ళపల్లె మాజీ సర్పంచ్ లు వేమిరెడ్డి గురివిరెడ్డి,ములపాకు బుజ్జి, మిడుతూరు మాజీ సర్పంచ్ తప్పెట చంద్ర, వైయస్సార్ సీపీ మాజీ ఎంపీటీసీ గాలిపోతు మనోహర్, వైఎస్సార్ సిపీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి రామ శివప్రసాద్ నాయుడు, పాలగిరి వెంకట సుబ్బారెడ్డి, దుగ్గి రెడ్డి శ్రీనివాసు లరెడ్డి, తిప్పసాని రంగారెడ్డి, వర్దిరెడ్డి వేమారెడ్డి,కోనా సుబ్బారెడ్డి,పుల్లల చెరువు బాస్కరరెడ్డి రెడ్యం నారాయణరెడ్డి,ఒడ్యం శ్రీనివాసల రెడ్డి,తుమ్మల క్రిష్ణారెడ్డి,రెడ్యం అభిలాష్ రెడ్డి, తవ్వా సుబ్బారెడ్డి,ఇండ్ల సిద్ధారెడ్డి, చింతకుంట బాష, ఖాదాద ఖాజామస్తాన్ (ఉస్మాన్), చింతకుంట అబుభకర్, మునెల్లి సుబ్బ రాయుడు,మునెల్లి వెంకట సుబ్బయ్య, అప్పనపల్లె జయరాజు,రెడ్యం నాగేశ్వర రెడ్డి,గంగిరెడ్డి సదర్శన్ రెడ్డి, గంగిరెడ్డి ఆది కేశవరెడ్డి, తవ్వా వెంకట సుబ్బారెడ్డి,తవ్వా చిన్న సుబ్బారెడ్డి,పోలు నారాయణరెడ్డి,పోలారి సుబ్బారెడ్డి,రెడ్యం పాలకృష్ణారెడ్డి,బత్తల మల్లయ్య యాదవ్,ఖాజామస్తాన్, అంకిరెడ్డి పల్లె సుదర్శన్ రెడ్డి, కమలకూరి కిరణ్,సోమల అభినయ కుమార్ రెడ్డి తో పాటు పెద్ద ఎత్తున వైయస్ఆర్ సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

# మెట్ట రైతుకు కష్టకాలం

చోడవరం : ఎల్‌నినో ప్రభావం జిల్లాలో వర్షాధార మెట్ట భూముల్లో ఖరీఫ్ సాగుపై తీవ్రంగా పడింది. అడపాదడపా జల్లులు, మోస్తరు వర్షం మాత్రమే పడుతుండడంతో పంటలు వేయలేని పరిస్థితి నెలకొంది. ప్రధానంగా చోడవరం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో వర్షాధార భూములను ఇంతవరకు కనీసం దుక్కి కూడా దున్నలేదు. కొన్నిచోట్ల చెదురుమదురుగా కురిసిన వర్షాలతో రైతులు మడులను తయారు చేసుకొని వరి విత్తనాలు చల్లారు. మొలకలు వచ్చిన తరువాత కనీసస్థాయిలో కూడా వర్షం పడకపోవడం, ఎక్కడా నీరు అందుబాటులో లేకపోవడంతో వరి నారు ఎండిపోయింది. నైరుతి సీజన్ మొదలై మూడు నెలలు కావస్తున్నప్పటికీ ఇంతవరకు గెడ్డలు, వాగులు, నదుల్లో నీటి ప్రవాహం లేదు. చెరువుల్లో చుక్క నీరు చేరలేదు. అసలు పొలాల నుంచి వర్షం నీరు బయటకు వెళ్లిన దాఖలాలే లేవు. వరి కాకుండా పప్పు దినుసులు, చిరుధాన్యాలు, నూనె గింజల పంటలను సాగు చేసే భూములను సైతం ఖాళీగా వదిలేశారు. చోడవరం మండలంలో గత మూడు నెలలుగా లోటు వర్షపాతం కొనసాగుతున్నది. జూన్‌లో 121 మిల్లీమీటర్లకు గాను 59 మిల్లీమీటర్లు మాత్రమే కురిసింది. జూలై పరిస్థితి మరింత దారుణంగా వుంది. ఈ నెలలో 160 మిల్లీమీటర్లకుగాను, 62 మిల్లీమీటర్లు మాత్రమే కురిసింది. ఆగస్టులో సైతం ఇదే పరిస్థితి కొనసాగుతున్నది. మండలంలో వరి సాధారణ విస్తీర్ణం 2,298 హెక్టార్లు. రాగి, మొక్కజొన్న, కంది, వేరుశనగ, ఇతర పంటలు మరో ఆరు వేల హెక్టార్లలో సాగు చేస్తుంటారు. కానీ ఇంతవరకు ఐదు శాతం విస్తీర్ణంలో కూడా వరినాట్లు వేయలేదు. మిగిలిన పంటలను అక్కడక్కడా వేసినప్పటికీ వర్షాలు లేకపోవడంతో ఎండిపోతున్నాయి. నదులపై గ్రోయిన్లు, బోర్లు వున్న పొలాలు మినహా మండలంలో మరెక్కడా ఖరీఫ్‌లో పంటలు పండే పరిస్థితి లేదు. చెరువులు, వర్షంపై ఆధారపడి వరి సాగు చేసే అడ్డూరు, దుడ్డుపాలెం, నరసాపురం, ముద్దుర్తి, శేమునాపల్లి, రాయపురాజుపేట, గోవాడ, అంభేరుపురం, భోగాపురం తదితర గ్రామాల్లో వరి ఆకుమడులు ఎండిపోతున్నాయి. అక్కడక్కడ నువ్వు, రాగి, ఇతర పంటలు వేసినప్పటికీ.. వర్షాలు లేకపోవడంతో దిగుబడులపై రైతులు ఆశలు వదిలేసుకున్నారు. పెద్దేరు నది ఆధారంగా వరి సాగు చేసే బెన్నవోలు, కన్నంపాలెం, చాకిపల్లి, రామజోగిపాలెం, తిమ్మనపాలెం, జన్నవరం పంచాయతీల్లో పొలాలు బీడు భూములను తలపిస్తున్నాయి. నదిలో నీటి ప్రవాహం వుంటుందని భావించి పలువురు రైతులు మడుల్లో వరివిత్తనాలు చల్లారు. కానీ ఇంతవరకు ఒక్క రోజు కూడా నదిలో నీరు ప్రవహించకపోవడం, మరోవైపు వర్షాలు మొహం చాటేయడంతో ఆకుమడులు ఎండిపోతున్నాయి. మండలంలో 32 పంచాయతీలు వుండగా.. బోర్లు వున్న జి.జగన్నాథపురం, గవరవరం పంచాయతీల్లో మాత్రమే కొద్దిపాటి విస్తీర్ణంలో వరినాట్లు వేశారు.

# ఈఎస్ఐ ఆస్పత్రి రెండు నెలల్లో రెడీ

అచ్యుతాపురం : పారిశ్రామికంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురంలో రెండు నెలల్లో ఈఎస్ఐ ఆస్పత్రి అందుబాటులోకి రానున్నది. ఇంతవరకు ఆస్పత్రి ప్రధాన భవనం, సిబ్బంది గృహ సముదాయాల నిర్మాణం పూర్తయ్యింది. ప్రస్తుతం ఆయా భవనాల్లో అంతర్గత పనులు జరుగుతున్నాయి. రహదారులు, డ్రైనేజీల నిర్మాణం జరగాల్సి వుంది. అక్టోబరు లేదా నవంబరులో ఈఎస్ఐ ఆస్పత్రిని ప్రారంభించే అవకాశం వుందని సమాచారం. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు సంబంధించి విశాఖ నగరంలో మాత్రమే ఈఎస్ఐ ఆస్పత్రి వుంది. ప్రత్యేక ఆర్థిక మండలి, నాన్-సెజ్ ఫార్మా కంపెనీలు వున్న అచ్యుతాపురంలో చిన్నపాటి డిస్పెన్సరీ ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారు. ఇక్కడ ఓపీ మాత్రమే వుంటుంది. పరిశ్రమలు, కంపెనీల్లో తరచూ ప్రమాదాలు సంభవిస్తూ కార్మికులు తీవ్రంగా గాయపడుతున్నారు. వీరిని చికిత్స నిమిత్తం గాజువాక, విశాఖ నగరంలోని ఆస్పత్రులకు తీసుకెళ్లడానికి ఒకటి నుంచి రెండు గంటల సమయం పడుతున్నది. దీంతో సకాలంలో వైద్య సేవలందక క్షతగాత్రులు దారిలోనే మృత్యువాత పడుతున్నారు. ఇటువంటి పరిస్థితిని అధిగమించి ప్రమాదాల్లో గాయపడిన కార్మికులు, ఉద్యోగులకు సత్వరమే వైద్యం అందడానికి అచ్యుతాపురంలో ఈఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని కార్మిక సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నేతలు చాలా ఏళ్ల నుంచి డిమాండ్ చేస్తున్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వం 2022లో ఈఎస్ఐ ఆస్పత్రిని మంజూరు చేసింది. ఇందుకు అవసరమైన భూమిని రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాలి. అప్పటి వైసీపీ ప్రభుత్వం అచ్యుతాపురంలో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి ప్రత్యేకంగా భూమిని కేటాయించకుండా, సెజ్ కోసం ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో రెండు ఎకరాలను 33 సంవత్సరాలపాటు లీజుకు తీసుకుంది. కానీ ఆస్పత్రి నిర్మాణ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు చేపట్టింది. 30 పడకలతో మూడు అంతస్థులతో ఆస్పత్రి ప్రధాన భవనం, సిబ్బందికి 16 గృహాలను నిర్మించడానికి కేంద్ర ప్రభుత్వం రూ. 62.21 కోట్లు కేటాయించింది. 2024 అక్టోబరు 29వ తేదీన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. వాస్తవంగా ఈ ఏడాది మే నెలనాటికి పనులన్నీ పూర్తి చేసి ఆస్పత్రిని ప్రారంభించాల్సి వుంది.

## రేషన్ బస్తాలపై క్యూఆర్ కోడ్ స్కానింగ్ ను ఎత్తివేయాలి

బేతంచెర్ల : ప్రభుత్వ చౌక దుకాణాలలో రేషన్ బస్తాలపై కి క్యూఆర్ కోడ్ స్కానింగ్ విధానాన్ని ఎత్తివేయాలని రేషన్ డీలర్ల సంఘం జిల్లా జాయింట్ సెక్రెటరీ మురళి,కోరారు. గురువారం రేషన్ డీలర్ల సమస్యలపై మండల అధ్యక్ష కార్యదర్శులు మనోహర్, అనీఫ్ బాషా,ల ఆధ్వర్యంలో బేతంచెర్ల తాహసిల్దార్ కి నాగమణికి వినతిపత్రం అందజేశారు.వారు మాట్లాడుతూ రేషన్ బస్తాల పై క్యూఆర్ కోడ్ స్కానింగ్ ను విధానం వలన డీలర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అన్నారు.ఈ కార్యక్రమంలో డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

## కడప ఎంపీ అవినాష్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు

బద్వేలు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కడప ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా బద్వేలు నియోజకవర్గంలో ఎమ్మెల్సీ డీసీ గోవింద రెడ్డి ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాశినాయన మండలం ఓబులాపురం వద్ద ఉన్న వివేకానంద సేవా సమితి ఆశ్రమంలో నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి అవినాష్ రెడ్డి కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అవినాష్ రెడ్డి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవిస్తూ ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. అనంతరం పార్టీ రాష్ట్ర డాక్టర్ల విభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో ఆశ్రమంలోని అనాథలకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్సీ డీసీ గోవింద్ రెడ్డి స్వయంగా అన్నం వడ్డించారు. అలాగే టేకురుపేట సర్పంచ్, మాజీ సర్పంచ్ కల్లూరి రమణారెడ్డి గారు రూ.10,000/- విరాళాన్ని ఎమ్మెల్సీ డీసీ గోవింద రెడ్డి చేతుల మీదుగా ఆశ్రమం చైర్మన్ గారికి అందజేశారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ద్వారా వైయస్ అవినాష్ రెడ్డి పట్ల ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్లు సమన్వయకర్త కల్లూరి రమణారెడ్డి, నియోజకవర్గంలోని పలు ప్రజా ప్రతినిధులు కలసపాడు జడ్పిటిసి గురువి రెడ్డి, ఎంపీపీ నిర్మల నారాయణ, మాజీ ఎంపీపీ రామకృష్ణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు సీఎం భాష, సుదర్శన్, వైస్ ఎంపీపీ రాజశేఖర్ ,రాష్ట్ర జిల్లా అనుబంధ విభాగాల నాయకులు చిత్త రవి ప్రకాష్ రెడ్డి, రాజీవ్ భాషా, చాపాటి లక్ష్మీనారాయణ రెడ్డి, చిత్తా రాజశేఖర్ రెడ్డి, చిత్తాగిరి ప్రణీత్ రెడ్డి, తులసి సురేష్, మధుసూదన్ రెడ్డి, జయన్న, చాపాటి సాయి నారాయణ రెడ్డి , సూర్య ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఒకే బ్యారక్‌లో తండ్రీకొడుకులు..!

విజయవాడ : జగన్ హయాంలో ఏపీలో జరిగిన మద్యం రవాణా కాంట్రాక్టుల్లో అక్రమాలకు సంబంధించి వైసీపీ నేత, మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఆయన కుమారుడు సునీల్‌కుమార్ ప్రస్తుతం ఒకే జైలులో, ఒకే బ్యారక్‌లో ఉన్నారు. ఈ కేసులో ఇప్పటికే సునీల్ చంచల్‌గూడ జైల్లో ఉండగా.. నాగేశ్వరరావుకు సోమవారం ప్రత్యేక కోర్టు రెండు వారాలు జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో ఆయన్నూ అక్కడికే తరలించారు. ఈ కేసులో కారుమూరిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ఆదివారం హైదరాబాద్ కొండాపూర్‌లో అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. బషీర్‌బాగ్‌లోని ఈడీ ప్రధాన కార్యాలయంలో విచారణ అనంతరం.. మనీలాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్‌ఏ-2002) కింద ఆయన్ను అరెస్టు చేశారు. నాంపల్లి పీఎంఎల్‌ఏ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు. కోర్టు రిమాండ్‌కు పంపింది. దీంతో ఈడీ అధికారులు కారుమూరిని చంచల్‌గూడ కేంద్రగారానికి తరలించారు. ఆయన కుమారుడు సునీల్ ఇదే స్కాం లో ఈ ఏడాది జూన్ 18నే అరెస్టయి జైల్లో ఉన్నారు. ఆయనకు ముందే ఈ కేసులో అరెస్టయిన రాజ్ కసిరెడ్డి, ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ దొంతిరెడ్డి వాసుదేవారెడ్డి కూడా అదే జైల్లో ఉన్నారు. కీలకమైన కేసు కావడంతో తెలంగాణ జైళ్ల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జైలు వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. మద్యం రవాణా టెండర్లలో రూ.400 కోట్ల మేర దోపిడీ జరిగిందని, ఆస్ట్రేడియ సంస్థలకు ప్రయోజనం కలిగేలా నిబంధనలు మార్చి, సబ్‌కాంట్రాక్టర్లతో భారీమొత్తంలో అక్రమ లాభాలు పొందారని సిట్ తేల్చింది.

## బీసీ మంత్రుల జోలికొస్తే ఊరుకోం

**– బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు బూరుగుపల్లి కృష్ణయాదవ్**

నాగర్‌కర్నూల్ : రాష్ట్రంలో బీసీ మంత్రుల జోలికొస్తే బీసీ సమాజం చూస్తూ ఊరుకోదని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు బూరుగుపల్లి కృష్ణయాదవ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో బీసీ జాగృతి సేన ము ఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఆ యన మాట్లాడుతూ మంత్రి కొండా సురేఖ త న కూతురు మాట్లాడిన మాటలతో తనకు ఎ లాంటి సంబంధం లేదని, ఆమె వ్యక్తిగత అభి ప్రాయమని వివరణ ఇచ్చిన తర్వాత కూడా ఆమెపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మె ల్యేలు, నాయకులు డిమాండ్ చేయడం సమం జసం కాదన్నారు. గతంలో మంత్రి పదవి రా లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, జగ్గారెడ్డి తదితరులు తీవ్ర వ్యా ఖ్యలు చేసినప్పుడు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. బీసీ ప్రజాప్రతినిధులను మను షులుగా కూడా గౌరవిం చడం లేదని, బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను సహించబో మని స్పష్టం చేశారు. అగ్రవర్ణ నాయకుల వ్యా ఖ్యలు గుర్తు రావా అని ప్రశ్నించారు. బీసీలను అవమానించే నాయకులకు వచ్చే ఎన్నికల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో తగిన బుద్ధిచెబుతామ ని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో జా తీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అ ధ్యక్షుడు కాళ్ల నిరంజన్, జిల్లా వర్కింగ్ ప్రెసి డెంట్ కుంభం మల్లేష్‌గౌడ్, బీసీ మహిళా జిల్లా అధ్యక్షురాలు రేణుక, నాయకులు నేష లక్ష్మయ్య, సుధాకర్ గౌడ్, రాజు, చైతన్య పాల్గొన్నారు.

## తిమ్మాజిపేట ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలి

**– బాధితున్ని పరామర్శించిన బీఎస్పీ, కేవీపీఎస్ నాయకులు**

నాగర్‌కర్నూల్ : తిమ్మాజిపేట పోలీసు స్టేషన్‌లో ఆవంచ గ్రామానికి చెందిన పాలమూరు మహేందర్‌పై పోలీసులు దాడి చేశారన్న ఆరోపణపై సమగ్ర విచారణ జరిపి ఎస్‌ఐ, కానిస్టేబుల్స్‌పై కఠిన చ ర్యలు తీసుకోవాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి పృథ్వీరాజ్ డిమాండ్ చేశారు. జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధి తుడు పాలమూరు మహేందర్‌ను బీఎస్పీ, కేవీ పీఎస్ నాయకులు వేర్వేరుగా పరామర్శించారు. పృథ్వీరాజ్ మాట్లాడుతూ విచారణ కోసం పోలీ సు స్టేషన్‌కు పిలిపించిన మహేందర్‌ను ఎస్‌ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు విచక్షణారహితంగా కొట్టా రని బాధితు డు చెబుతు న్నాడన్నారు. ఎస్‌ఐ తనపై మూత్ర విస ర్జన చేశారని బా ధితుడు ఆరోపణ చే స్తున్న నేప థ్యంలో నిష్పక్ష పాతంగా విచారణ జరిపించాలని కోరారు. కేవీ పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్ మాట్లాడు తూ ఘటనపై ఎస్పీ సమగ్ర విచరణ జరిపించి బా ధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసు స్టేషన్‌లో ఇలాంటి ఘటనలు పునరా వృతం కాకుండా ఉన్నతాధికారులు చర్యలు తీ సుకోవాలని కోరారు. బీఎస్పీ నాయకులు కళ్యాణ్, బాలస్వామి, శ్రీహర్ష ముదిరాజ్, పరశురాములు, శంకర్, కేవీపీఎస్ నాయకులు సత్యనారాయణ, సుల్తాన్, తారాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని'

అమరావతి :నూతన సంవత్సరం కానుకగా జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని' ప్రాజెక్టును అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. కుప్పం, చిత్తూరు జిల్లాల్లో నిర్వహించిన పైలట్ ప్రాజెక్టు సత్ఫలితాలనిచ్చిన నేపథ్యంలో, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఆరోగ్య సేవలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు 90 రోజుల కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో 'సంజీవని ప్రాజెక్ట్' అమలుపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.ముందస్తు వ్యాధి నిర్ధారణే ధ్యేయంప్రతి కుటుంబంపై విద్య, వైద్య ఖర్చుల భారం అధికంగా ఉంటోందని, ఆ భారాన్ని తగ్గించడంతో పాటు వ్యాధులను ముందస్తుగా గుర్తించి నివారణ చర్యలు చేపట్టేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని సీఎం పేర్కొన్నారు. ప్రిడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్, కాస్ట్-ఎఫెక్టివ్ పద్ధతిలో వైద్య సేవలు అందించాలని సూచించారు. స్క్రీనింగ్ నుంచి చికిత్స, ఫాలో-అప్ వరకు ఏఐ డాక్టర్ సేవలను అందుబాటులోకి తేవాలని, ప్రజల ఆరోగ్య సమాచార భద్రతకు పెద్దపీట వేస్తూ డిజిటల్ హెల్త్ కార్డులను జారీ చేయాలని ఆదేశించారు. ఆశాజనకంగా పైలట్ ఫలితాలుపైలట్ ప్రాజెక్టు

## పి.యు.సి కమిటీ సమావేశంలో పలు ప్రభుత్వ సంస్థలపై సమీక్ష

**పాల్గొన్న మైలవరం ఎమ్మెల్యే, పి.యు.సి కమిటీ సభ్యులు వసంత కృష్ణప్రసాదు**

అమరావతి : ఆంధ్రప్రదేశ్ శాసనసభ పబ్లిక్ అండర్‌టేకింగ్స్ కమిటీ (పి.యు.సి) సమావేశం కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ గారి అధ్యక్షతన అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగింది. సమావేశంలో కమిటీ సభ్యులు, మైలవరం ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు గారు పాల్గొన్నారు.ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని పలు కీలక సంస్థలు, వాటి కార్యకలాపాలు, ఆర్థిక వ్యవహారాలు, అమలు చేస్తున్న కార్యక్రమాలు, సంస్థల పనితీరు తదితర అంశాలపై కమిటీ సభ్యులు సమగ్రంగా చర్చించారు. ప్రభుత్వ సంస్థలు నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తున్నాయా, ప్రజలకు అందాల్సిన సేవలు సమర్థవంతంగా అందుతున్నాయా అనే అంశాలపై సమీక్ష నిర్వహించారు.ప్రధానంగా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో విద్యారంగ అభివృద్ధి, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు, అమలవుతున్న కార్యక్రమాలపై చర్చ జరిగింది. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు చేపడుతున్న చర్యలను కమిటీ పరిశీలించింది.అలాగే ఏపీ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ పరిధిలో పట్టణ మౌలిక వసతుల నిర్వహణ, ఆస్తుల పరిరక్షణ, వాటి సమర్థ వినియోగం వంటి అంశాలపై చర్చించారు.ఏపీ రాష్ట్ర చేనేత కార్మికుల సహకార సంఘం లిమిటెడ్ ద్వారా చేనేత కార్మికుల సంక్షేమం, చేనేత ఉత్పత్తుల మార్కెటింగ్, సహకార సంఘాల బలోపేతం, చేనేత రంగ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలపై కూడా సమీక్ష జరిగింది.ఏపీ ఖాదీ మరియు గ్రామ పరిశ్రమల బోర్డు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాల కల్పన, గ్రామీణ పరిశ్రమలకు ప్రోత్సాహం, స్వయం ఉపాధి కార్యక్రమాలు, ఖాదీ ఉత్పత్తుల అభివృద్ధి తదితర అంశాలపై కమిటీ సభ్యులు చర్చించారు.అదేవిధంగా ఏపీ విద్యా మరియు సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విద్యాసంస్థలు, సంక్షేమ శాఖలకు సంబంధించిన మౌలిక వసతుల అభివృద్ధి, నిర్మాణ పనులు, వాటి పురోగతి, నాణ్యతా ప్రమాణాలు తదితర అంశాలను సమావేశంలో పరిశీలించారు.

ప్రభుత్వ రంగ సంస్థలు ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా మరింత సమర్థవంతంగా పనిచేసేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని, నిధుల వినియోగంలో పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని కమిటీ సమావేశంలో సభ్యులు అభిప్రాయపడ్డారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేసే దిశగా ఆయా సంస్థల పనితీరు ఉండాలని చర్చించారు.ఈ సమావేశం ద్వారా వివిధ ప్రభుత్వ సంస్థల పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న సేవలపై పి.యు.సి కమిటీ సమగ్రంగా సమీక్షించింది.

## పోలీసుల ఆధ్వర్యంలో పల్లెనిద్ర

ఎన్టీఆర్ జిల్లా : మైలవరం మండలం, గణపవరం గ్రామంలో పోలీసులు 'పల్లెనిద్ర - ప్రజా అవగాహన కార్యక్రమం' నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలోతెలుసుకోవడంతో పాటు, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలను భాగస్వాములను చేయడం ఈ కార్య క్రమం ప్రధాన ఉద్దేశమని పోలీసులు తెలిపారు.కార్యక్రమంలో భాగంగా ముందుగా గ్రామంలోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పోలీసు అధికారులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బీసీ సెంటర్‌లోని వేపచెట్టు అరుగు వద్ద పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మైలవరం సీఐ కిషోర్ గారు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని, సాధ్యమైనంత మేరకు క్షేత్రస్థాయిలోనే పరిష్కార మార్గాలు చూపించేందుకు పల్లెనిద్ర కార్యక్రమం ఒక చక్కటి వేదికగా నిలుస్తుందని అన్నారు.శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం ఎంతో కీలకమని, ప్రతి చిన్న సమస్యకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రజలకు అందుబాటులో ఉండేలా పోలీస్ శాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. ఎవరూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని సూచించారు. మహిళలు, బాలికలు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొంటూ, సామాజిక మాధ్యమాల ద్వారా జరుగుతున్న నేరాలు, సైబర్ మోసాలు, మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ కార్యకలాపాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో అక్రమ మద్యం, గంజాయి, పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.అలాగే గ్రామస్తులంతా ఐక్యంగా ఉంటూ గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని, నేరాల నియంత్రణలో పోలీసులకు సహకరించాలని సీఐ కిషోర్ గారు కోరారు. పోలీస్ శాఖను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు, ప్రజల్లో పోలీసులపై నమ్మకాన్ని పెంపొందించేందుకు పల్లెనిద్ర కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు.ఎస్‌ఐ కె. సుధాకర్ గారు మాట్లాడుతూ, సైబర్ మోసాలు, 'డిజిటల్ అరెస్ట్' పేరుతో జరుగుతున్న మోసాలు, ఓటీపీ ఫ్రాడ్స్, మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, రోడ్డు భద్రత తదితర అంశాలపై గ్రామస్తులకు విస్తృతంగా అవగాహన కల్పించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద ఫోన్ కాల్స్, మెసేజ్‌లు లేదా లింకులకు స్పందించవద్దని సూచించారు.

## 400 మందితో భారత్ కు జింపింగ్



న్యూఢిల్లీ : చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ వచ్చే నెల 12, 13 తేదీల్లో న్యూఢిల్లీలో జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు భారత్‌కు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దాదాపు 400 మంది అధికారుల భారీ ప్రతినిధి బృందంతో ఆయన రానున్నట్లు సమాచారం. 2020 నాటి సరిహద్దు వివాదాల తర్వాత ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలను మెరుగుపరిచే దిశగా.. ఇది ఓ కీలక పరిణామంగా మారనుంది. అదే సమయంలో భారత జాతీయ భద్రతా సలహాదారు అజీత్ డోభాల్ సరిహద్దు చర్చల నిమిత్తం బీజింగ్‌లో పర్యటించడం ప్రాధాన్యత సంతరించుకుంది.బ్రిక్స్ సదస్సు కోసం షీ జిన్‌పింగ్ వెంట దాదాపు 400 మంది సభ్యులతో కూడిన భారీ ప్రతినిధి బృందం భారత్‌కు రానున్నట్లు సమాచారం. 2019 నాటి పర్యటనతో పోలిస్తే ఈ సంఖ్య రెట్టింపు కావడం గమనార్హం. ప్రస్తుతం చైనా అధికారులు ఢిల్లీలో హోటళ్ల కేటాయింపులు, భద్రతా ప్రోటోకాల్‌లను ఆఖరి దశలో సమీక్షిస్తున్నట్లు తెలుస్తోంది. సదస్సు కేవలం బ్రిక్స్ ఎజెండా కోసమే కాకుండా భారత్-చైనాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల పునరుద్ధరణ సంకేతంగా నిలుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.ఒకవైపు షీ జిన్‌పింగ్ రాకపై సన్నాహాలు జరుగుతుండగానే.. మరోవైపు భారత జాతీయ భద్రతా సలహాదారు అజీత్ డోభాల్ చైనా రాజధాని బీజింగ్‌కు చేరుకున్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం వెళ్లిన డోభాల్.. రెండు దేశాల ప్రత్యేక ప్రతినిధుల సమావేశంలో పాల్గొని సుదీర్ఘ సరిహద్దు వివాదాలపై చర్చించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా చైనా విదేశాంగ మంత్రి, జాతీయ భద్రతా సలహాదారు వాంగ్ ఈ తో కూడా ఆయన ద్వైపాక్షిక సమావేశం కానున్నారుభారత్-చైనా మధ్య హిమాలయ ప్రాంతంలో 3,800 కిలో మీటర్ల మేర సరిహద్దు వివాదం కొనసాగుతోంది. 2020లో జరిగిన గల్వాన్ లోయ ఘర్షణల్లో 20 మంది భారత సైనికులు, నలుగురు చైనా సైనికులు ప్రాణాలు కోల్పోవడంతో ఇరు దేశాల మధ్య శాంతి వాతావరణం పూర్తిగా దెబ్బతింది. ఆ తర్వాత నాలుగేళ్ల మిలిటరీ సైనిక చర్చల ఫలితంగా 2024 అక్టోబర్ నాటికి ఒప్పందం కుదిరింది. అయితే జూలై చివర్లో సరిహద్దు వద్ద మళ్లీ సైనికులు ఎదురెదురుపడటంతో.. సరిహద్దుల్లో పూర్తి శాంతి పునరుద్ధరణే దౌత్య సంబంధాలకు ప్రాతిపదిక అని భారత్ ఇటీవల స్పష్టం చేసింది.అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న కఠినమైన వాణిజ్య విధానాల నేపథ్యంలో.. భారత్, చైనా రెండూ బ్రిక్స్ వేదికగా పరస్పర సహకారాన్ని పెంచుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. షీ జిన్‌పింగ్ చివరి పర్యటన నిర్ణయం ఇంకా పూర్తిగా ఖరారు కావాల్సి ఉన్నప్పటికీ.. బీజింగ్ మాత్రం భారత్ నిర్వహిస్తున్న ఈ సదస్సుకు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించింది.

## శ్రీశైలం దేవస్థానంలో భారీ ప్రక్షాళన

కర్నూలు : శ్రీశైలం దేవస్థానంలో వరుస వివాదాల నేపథ్యంలో భారీ ప్రక్షాళన ప్రారంభమైంది. పరిపాలనలో సమర్థత, పారదర్శకత కోసం దేవస్థానం ఈఓ శ్రీనివాసరావు 37 మంది ఉద్యోగులను అంతర్గతంగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మార్పులు దేవస్థానం దైనందిన కార్యకలాపాల్లో మెరుగైన సమన్వయాన్ని తీసుకువస్తాయని అంచనా. నూతన స్థానాల్లో వెంటనే విధుల్లో చేరాలని ఆదేశించారు.నంద్యాల జిల్లా శ్రీశైలం దేవస్థానంలో వరుస వివాదాల నేపథ్యంలో భారీ స్థాయిలో అంతర్గత బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. పరిపాలనలో మార్పులు, విధుల నిర్వహణలో సమన్వయం కోసం దేవస్థానం ఈఓ శ్రీనివాసరావు 37 మంది ఉద్యోగులను స్థానికంగా అంతర్గత బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పర్యవేక్షణ స్థాయి అధికారి నుంచి అటెండర్, హెల్పర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి వరకు వివిధ కేటగిరీలకు చెందిన సిబ్బంది ఈ బదిలీల్లో ఉన్నారు.దేవస్థానం పరిపాలన సౌలభ్యం, విధుల సమర్థవంతమైన నిర్వహణను దృష్టిలో ఉంచుకుని ఈ అంతర్గత బదిలీలు చేపట్టినట్లు ఈఓ శ్రీనివాసరావు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను ఇతర విభాగాలు, స్థానాల్లోకి మార్చడంతో పరిపాలనా వ్యవస్థలో కొత్త సమీకరణాలు చోటుచేసుకోనున్నాయి.

బదిలీ ఉత్తర్వులు అందిన వెంటనే సంబంధిత ఉద్యోగులు ప్రస్తుతం నిర్వహిస్తున్న విధుల నుంచి రిలీవ్ అయి, ఉత్తర్వుల్లో కేటాయించిన నూతన స్థానాల్లో వెంటనే విధుల్లో చేరాలని ఈఓ స్పష్టం చేశారు. ఉద్యోగుల విధుల మార్పు ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం ఉండకూడదని అధికార యంత్రాంగం ఆదేశించింది.ఇటీవల శ్రీశైలం దేవస్థా నంలో పలు అంశాలు వివాదాలకు దారితీసిన నేపథ్యంలో తాజా బదిలీలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడు,ఈఓ శ్రీనివా సరావు ప్రత్యేక శ్రద్ధతో ఈ బదిలీల ప్రక్రియను నిర్వహించినట్లు ఉద్యోగుల వర్గాల్లో సమాచారం వినిపిస్తోంది.

## తెగిన పెనగలూరు చెరువు కట్టకు మరమ్మతులు చేయాలి

చిట్వేలి : ఐదు సంవత్సరాల క్రితం అన్నమయ్య డ్యాం కొట్టుకుపోవడంతో ఆ వరద నీటి ప్రవాహంతో పెనగలూరు మండలంలో చెరువు కట్ట తెగిపోవడంతో, 1400 ఎకరాలు పంటలు సాగు లేకుండా బీడు పెట్టాల్సి వస్తోందని సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ నాయకులు సిహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. గురువారం వరదల్లో కొట్టుకుపోయిన, చెరువు కట్టను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలోనూ, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరం అయినా, ఆ చెరువు కట్టకు పడిన గండి పూడ్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పొలాలకు నీరు వదిలే గేటు తూములు కూడా, శిథిలావస్థకు చేరుకొని పాడు పడ్డాయి అన్నారు. కట్టమీద ప్రయాణించే, 10 గ్రామాలు ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు అన్నారు. చెరువులో నీరు నిలువ లేకుండా పోవడంతో, చెరువు ఆక్రమణ గురై భూ కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రెండు పంటలు పండే చెరువు పైన వైసీపీ ప్రభుత్వం గాని, నేడు టిడిపి కూటమి ప్రభుత్వం, కానీ రైతుల పైన ఎంత శ్రద్ధ ఉందో దీన్ని బట్టి తెలుస్తుందని ఆరోపించారు. చెరువు మరమ్మతుల ఖర్చుల కోసం ఇరిగేషన్ అధికారులు వేసిన 8 కోట్ల రూపాయల ఎస్టిమేషన్లు సెక్రటేరియట్, సీఈ కార్యాలయంలో ఉన్నాయని, వీటిని గురించి పట్టించుకోలేదని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిధులు మంజూరు చేసి, పనులు ప్రారంభించాలని కోరారు. ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా పెనగలూరు చెరువు రిపేరు కోసం, నిధులు కేటాయింపు కోసం, రైతులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెనగలూరు రైతులు. ఎన్. జయరామయ్య నాయుడు, కే. కృష్ణయ్య, సిరివరం పెద్ద నరసింహులు, ఏ. కృష్ణమ నాయుడు పాల్గొన్నారు.

## విద్యార్థులను రంజింపజేసిన అష్టావధానం

దేవనకొండ : మండల కేంద్రమైన దేవనకొండ ఎఫ్ఆర్ హై స్కూల్ నిర్వహించిన అష్టావధానం విద్యార్థులు అలరింపజేసింది. నిర్వహించిన అష్టావధానం సమావేశానికి వచ్చిన సభికులను ఎంతో రంజింపజేసింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన జనప్రియ ఏలూరు వెంకన్న కవి తన అధ్యక్ష ఉపన్యాసంతో విద్యార్థులను ఆకట్టుకున్నారు. ఈ సమావేశంల అష్టావధానం ప్రారంభానికి ముందు మండల విద్యాధికారులు ఉస్మాన్ భాష కే. నిర్మాణాదేవి జ్యోతి ప్రజ్వలన చేశారు. సాయి పోగుశృతి ప్రజ్ఞ ఏడవ తరగతి చదువుతున్న అమ్మాయి అష్టావధానం సభలో శాస్త్రీయ సంగీతంతో కూడిన నృత్య ప్రదర్శన చేసింది. ఇది విద్యార్థులను ఎంతో ఆకట్టుకుంది.అవధాని కళా రత్న ఆముదాల మురళి తన ప్రసంగముతో ఈనెల 29వ తేదీన తెలుగు భాషా దినోత్సవంగా గిడుగు రామమూర్తి జన్మదినోత్సవాన్ని జరుపుకుంటున్నామని అన్నారు. అందులో భాగంగా మనము రెండు రోజులు ముందుగానే తెలుగు భాషకు ఎనలేని కృషి చేసిన గిడుగు రామమూర్తి గురించి ఆయన చెప్పారు అష్టావధానం అనేటువంటి సాహిత్య ప్రక్రియ సంస్కృత భాషలోనూ తెలుగు భాషలోనూ మాత్రమే ఉందని ఇతర ఏ భాషల్లో కూడా ఇలాంటి అవగాహన ప్రక్రియ లేదని ఆయన చెప్పారు. ఇలాంటి అష్టావధానాన్ని ఎఫ్ఆర్ స్కూల్లో నిర్వహించడం విద్యార్థులకు ఎంతో మేలు చేస్తుందని చెప్పారు. అష్టావధానం సభికులను విద్యార్థులను ఎంతో రంజింప చేస్తుందని అన్నారు. అవధాన సమావేశంలో వృక్షకులు సంధించిన బాణాలకు సరైన సమధానాలతో పాటు చలోక్తులు విసిరారు. నిశిదాక్షరి సవప్ప తన నిషిదాక్షం తోటే తన ప్రసంగాన్ని కొనసాగించారు. ఎం ఓంకారప్ప వర్ణన అవధానములో ఉన్నటువంటి వర్ణనను కొనసాగించారు ఆవల బసప్ప సమస్య పూరానాలను ఎలా ఆకట్టుకున్నది సబికులలో మెప్పించారు వ్యక్తాక్షరి పి పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి ఉచ్చేరప్ప ,కరస్పాండెంట్ రఘునాథ్ అష్టావధానములో పాల్గొన్న అందరికీ పూల మాలలు వేసి, దుశ్యాలువలతో సత్కరించారు. తమ పాఠశాలలో కాకుండా ఇతర పాఠశాలలోని విద్యార్థులను కూడా అష్టావధాన సమావేశానికి రప్పించారు బసవరాజు వ్యక్తాక్షరితో అలరించారు .ఎన్ ప్రసాద్ ఆశువుతో కవిత్వంతో అలరించారు. శ్రీకృష్ణ పరబ్రహ్మ పురాణ పటణముతో అవధానిని ఎంతో మెప్పించారు భాస్కర్ అప్రస్తుత ప్రసంగంతో అటు విద్యార్థులను సబికులను ఎంతో రంజింపజేశారు. ప్రతి పాఠశాలలో కూడా ఇలాంటి అష్టావధానాలు నిర్వహించి విద్యార్థులను తెలుగు భాషా అవగాహన పెంచేందుకు ఎంతో ఉపకరిస్తాయని అవధాని ఆముదాల మురళి చెప్పారు.

## గురునానక్ కళాశాల సమీపంలో రోడ్డు ప్రమాదం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం గురునానక్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు సాయంత్రం వాకింగ్ చేస్తూ తిరిగి వస్తుండగా, మాల్ వైపు నుంచి వేగంగా వచ్చిన ట్రాలీ ఆటో ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో ఒక విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందరు. మరో నలుగురు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదానికి కారణమైన ట్రాలీ ఆటో టీఎస్ 07 యూఎన్ 0812గా గుర్తించినట్లు తెలిసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలి

చింతలమానేపల్లి/కౌటాల : కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని డీసీసీ అధ్యక్షు రాలు ఆత్రం సుగుణ అన్నారు. ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండేవిఠల్‌తో కలిసి చింతలమానేపల్లి, కౌటాలలో కాంగ్రెస్‌పార్టీ మండల సర్వసభ్య సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంఘటన్ సృజన్ అభియాన్‌లో భాగంగా మండలకమిటీ ఎన్నికకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త తన వంతుగా కృషి చేయాలన్నారు. ఎమ్మెల్సీ దండేవిఠల్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రతిఇంటింటా అవగా హన పర్చాల్సిన బాధ్యత ప్రతికార్యకర్తపై ఉందన్నారు. ఆయా కార్యక్ర మాల్లో మార్కెట్‌కమిటీ చైర్మన్ సుద్దాల దేవయ్య, మాజీజడ్పీచైర్మన్ సిడాం గణపతి, మండల అధ్యక్షుడు దుబ్బుల నానాయ్య, వెంకయ్య, బండి మహేష్, ఆయా గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ కార్యకర్తలు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తోంది

**– ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి బోగె ఉపేందర్**

కాగజ్‌నగర్ : కేంద్రప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తోందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ అన్నారు. ఏరియా హాస్పి టల్ ఆవరణలో కార్మికులతో కలిసి ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యానికి ముందు 1920అక్టోబర్ 31న ఏఐటీ యూసీ ఆవిర్భవించిందని, అప్పటినుంచి ఎన్నో పోరా టాలు, త్యాగాలు చేసిందని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల మేలు కోసమే 29 కార్మికచట్టా లను రద్దుచేసి 4లేబర్ కోడ్‌లుగా తయారుచేసిందని ఆరోపించారు. కనీసవేతనం అమలు, 8గంటల పని విధానం, సమానపనికి సమానవేతనం, ఉద్యోగ భద్రత కల్పించి, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్పీఎం ఎన్నికలను వెంటనే జరిపించేలా, పాత కార్మికులను ఎలాంటి షరతులు లేకుండా డ్యూటీలోకి తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాగజ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడ కల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్‌లో నిర్వ హించే ఏఐటీయూసీ రాష్ట్రమహాసభలు జయప్రదం చేయాలని పిలుపుచిన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి షాకీర్, జంషద్, శివం, సాయి, మీనాక్షి, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

## పీఆర్సీని ప్రకటించాలి

**–పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పులగం దామోదర్ రెడ్డి**

కాగజ్‌నగర్ : రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 3సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని వెంటనే ప్రకటించాలని పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పులగం దామోదర్ రెడ్డి డిమాండ్‌చేశారు. పద్మశాలి భవన్‌లో నిర్వహించిన జిల్లా సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పులగం దామోదర్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి మహేందర్‌రెడ్డి మాట్లాడారు. పెండింగ్ డీఎల్ విడుదల చేయాలని, సీపీఎస్ రద్దుచేయాలని, రేషనలైజేషన్ జీవో నంబరు 25ను సవరించాలని, తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్నారు.

# హిందూ సెంటిమెంట్‌కు చోటుందా?

నెల్లూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి, ఎంపీ పదవికి రాజీనామా చేసిన తర్వాత రాజకీయాలకు కొంతకాలం దూరంగా ఉన్న వి.విజయసాయిరెడ్డి క్యాంపు మార్చి, సరికొత్త రాజకీయ పార్టీ పెడుతున్నట్లు ఆకస్మికంగా ప్రకటించడం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పెద్ద చర్చకు దారితీసింది. అయితే, పార్టీ స్థాపన కంటే ఎక్కువగా ఆయన ఎంచుకున్న హిందూత్వ ఎజెండా, సామాజిక మతపరమైన అంశాలు ఇప్పుడు అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాయి. ముఖ్యంగా కాకినాడ లవ్ జిహాద్ ఆరోపణల వ్యవహారం, సాధిక్ ఖాన్ అంశంపై పదే పదే మాట్లాడటం , ఏపీలో మత మార్పిడుల నిరోధక చట్టం తేవాలని కోరడం ద్వారా తన నూతన పొలిటికల్ లైన్ హార్డ్ కోర్ హిందూత్వ అని విజయసాయిరెడ్డి స్పష్టమైన సంకేతాలిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రను పరిశీలిస్తే.. ఉత్తరాది రాష్ట్రాలు లేదా పక్కనే ఉన్న కర్ణాటక మాదిరిగా మతపరమైన సమీకరణాలు , పోలరైజేషన్‌ఓటు బ్యాంకుగా మారిన దాఖలాలు లేవు . ఉమ్మడి ఏపీ నుంచి నేటి వరకు ఇక్కడ రాజకీయం అంతా కుల సమీకరణాలు, సంక్షేమ పథకాలు, స్థానిక అభివృద్ధి , బలమైన ప్రాంతీయ నాయకత్వాల చుట్టూనే తిరిగింది. బీజేపీ కూడా ఏపీలో సుదీర్ఘకాలంగా ఉనికిలో ఉన్నప్పటికీ, ఒంటరిగా మత ఆధారిత ఓట్లతో సక్సెస్ కాలేకపోయింది. అందుకే విజయసాయిరెడ్డి తెరపైకి తెచ్చిన లవ్ జిహాద్ , మత మార్పిడుల కార్డు ఆంధ్రా నేలపై ఎంతవరకు ఫలితాన్నిస్తుందనేది ప్రధాన ప్రశ్న.ఏపీ ఓటర్లు ఎప్పుడూ కుల ప్రాతిపదికన, సంక్షేమ ఆధారంగా ఓటు వేయడానికి ప్రాధాన్యతనిచ్చారు తప్ప.. తీవ్రమైన మతపరమైన ఎజెండాలను స్వీకరించలేదనడానికి గత ఎన్నికల ఫలితాలే ఉదాహరణ. విజయసాయిరెడ్డి ఈ వ్యూహాన్ని ఎంచుకోవడం వెనుక బలమైన రాజకీయ అంశాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. వైఎస్సార్సీపీ మైనారిటీలు, క్రిస్టియన్ల వైపు ఆకర్షితమైందనే టాక్ ఉన్నందున .. అధికార టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి కూడా మైనారిటీ ఓట్లను కోల్పోకూడదనే భయంతో లవ్ జిహాద్ వంటి సున్నితమైన అంశాలపై మాట్లాడటానికి వెనుకాడుతోందని ఆయన బహిరంగంగానే ఆరోపించారు. ఈ రెండు ప్రధాన వర్గాల మధ్య ఖాళీగా ఉన్న కట్టర్ హిందూ ఓటు బ్యాంకు ను టార్గెట్ చేయడం ద్వారా, తన కొత్త పార్టీకి ఒక ప్రత్యేకమైన గుర్తింపు సాధించవచ్చని విజయసాయిరెడ్డి భావిస్తున్నారని అనుకోవచ్చు. అయితే, ఈ ప్రయత్నం సక్సెస్ కావడానికి తీవ్రమైన ప్రతిబంధకాలు ఉన్నాయి. విజయసాయిరెడ్డి గత దశాబ్దకాలంగా వైఎస్ జగన్మోహన్ రెడ్డికి అత్యంత ఆప్తుడిగా, ఆర్థిక, వ్యూహాత్మక వ్యవహారాల పర్యవేక్షకుడిగా ప్రజలకు పరిచయం. అప్పట్లో సంక్షేమ సిద్ధాంతాలను సమర్థించిన ఆయన, ఒక్కసారిగా హిందూత్వ నేత గా అవతారం ఎత్తితే ఓటర్లు ఎంతవరకు విశ్వసిస్తారనేది అసలు ప్రశ్న. పైగా, క్షేత్రస్థాయిలో పార్టీకి కేడర్ బలమైన ఆర్గనైజేషనల్ నెట్‌వర్క్ లేకుండా కేవలం మీడియా విమర్శలు, ఎక్స్ పోస్టులతో తీవ్రవాదాత్మక ఎజెండాను ఓట్లుగా మార్చడం దాదాపు అసాధ్యం.మరో కోణంలో చూస్తే, విజయసాయిరెడ్డి వేస్తున్న ఈ మతపరమైన కార్డు ఓట్ల సాధన కోసం కాకుండా.. రాజకీయంగా తన ఉనికిని కాపాడుకోవడానికి , ప్రధాన పార్టీలను డిఫెన్స్‌లో పడేయడానికి వేసిన ఎత్తుగడ కావచ్చునని అనుకోవచ్చు. అధికార కూటమిపై విమర్శలు చేస్తూనే, వైఎస్సార్సీపీ ఓటు బ్యాంకును దెబ్బతీయడానికి లేదా నేషనల్ లెవల్లో ఉండే సిద్ధాంతపరమైన మద్దతును పొందేందుకు ఈ వ్యూహం ఉపకరిస్తుందని భావిస్తుండవచ్చు. ఆంధ్రప్రదేశ్ వాతావరణంలో ఉత్తరాది తరహా రైట్ వింగ్ రాజకీయం పనిచేయడం అత్యంత కష్టం. స్థానిక సమస్యలు, రైతులు, నిరుద్యోగం, రాజధాని నిర్మాణం వంటి ప్రధాన అంశాలను పక్కనపెట్టి కేవలం ముస్లింలు, క్రిస్టియన్లను బూచిగా చూపే రాజకీయాలను నమ్ముకుంటే.. విజయసాయిరెడ్డి కొత్త పార్టీ పరిమిత ప్రభావానికే పరిమితమయ్యే ప్రమాదం ఉంది.

# ఉత్తరాంధ్రలో రియల్ జోరు

విశాఖపట్టణం : ఉత్తరాంధ్ర పారిశ్రామిక కేంద్రమైన శ్రీకాకుళం జిల్లా పరిధిలోని పైడిభీమవరం, ఎచ్చెర్ల బెల్ట్‌లో స్థిరాస్తి వ్యాపారం మళ్లీ వేగం పుంజుకుంది. జాతీయ రహదారి అనుసంధానంతో ఉన్న ఈ కారిడార్‌లో ఫార్మా రంగానికి చెందిన ప్రముఖ కంపెనీల విస్తరణ పనులు ఊపందుకోవడంతో నివాస స్థలాలకు డిమాండ్ గణనీయంగా పెరిగింది. పారిశ్రామిక వేత్తలు, కంపెనీల ఉద్యోగులతో పాటు స్థానిక ఇన్వెస్టర్లు ఈ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతుండటంతో లేఅవుట్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. పైడిభీమవరం పారిశ్రామిక రంగానికి గుండెకాయ లాంటిది కావడంతో అక్కడ పనిచేస్తున్న వేలాది మంది ఉద్యోగులు, టెక్నీషియన్లకు శాశ్వత నివాసాలు కల్పించే దిశగా ప్రైవేట్ రియల్ ఎస్టేట్ సంస్థలు సరికొత్త వెంచర్లను అందుబాటులోకి తెస్తున్నాయి. వీటికి తోడు ఎచ్చెర్ల పరిసర ప్రాంతాల్లో డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విశ్వవిద్యాలయంతో పాటు పలు ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలలు కొలువై ఉండటంతో ఈ ప్రాంతం ఎడ్యుకేషనల్ అండ్ ఇండస్ట్రియల్ హబ్‌గా రూపాంతరం చెందింది. ఈ విద్యా, పారిశ్రామిక వాతావరణమే ఇక్కడ హౌసింగ్ లేఅవుట్ల విక్రయాలు పుంజుకోవడానికి ప్రధాన కారణంగా నిలుస్తోంది.మరొకవైపు విశాఖపట్నం-భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ కారిడార్ ప్రభావం శ్రీకాకుళం జిల్లా సరిహద్దుల వరకు విస్తరించడంతో ఇక్కడ భూముల విలువలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. విమానాశ్రయం అందుబాటులోకి రావడంతో జాతీయ రహదారికి ఇరువైపులా విఆర్డిఎ అనుమతులు పొందిన లేఅవుట్లు పెద్ద ఎత్తున రూపుదిద్దుకుంటున్నాయి. తక్కువ ధరకే ప్లాట్లు దొరకడం, భవిష్యత్తులో మంచి రాబడి ఇచ్చే అవకాశం ఉండటంతో మధ్యతరగతి గృహ కొనుగోలుదారులు ఇక్కడ ప్లాట్లు కొనుగోలు చేసేందుకు ప్రాధాన్యతనిస్తున్నారు.ముగింపుగా చూస్తే, పైడిభీమవరం-ఎచ్చెర్ల పారిశ్రామిక కారిడార్ శ్రీకాకుళం జిల్లాలోనే అత్యంత వేగంగా విస్తరిస్తున్న స్థిరాస్తి కేంద్రంగా మారుతోంది. ప్రభుత్వం కూడా ఈ కారిడార్‌లో రవాణా వసతులు, డ్రైనేజీ, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తుండటంతో రాబోయే రోజుల్లో ఇక్కడ నివాస గృహాల నిర్మాణాలు మరింత ఊపందుకుంటాయని, ఇది జిల్లా ఆర్థిక పురోగతికి మరింత తోడ్పడుతుందని స్థానిక స్థిరాస్తి నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# జోగి తలంటిన అధిష్టానం

విజయవాడ : మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత జోగి రమేష్ కుటుంబ వివాదం ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది. కుటుంబ కలహాలను, వైవాహిక సమస్యలను నేరుగా పార్టీ ఆఫీసులో ప్రెస్ మీట్ ద్వారా బయటపెట్టి, దానికి రాజకీయ రంగు పులిమే ప్రయత్నం చేయడంపై వైఎస్సార్‌సీపీ అధిష్ఠానం తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు చెబుతున్నారు. వ్యక్తిగత తప్పులను లేదా కుటుంబ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి పార్టీ ప్లాట్‌ఫామ్‌ను వాడుకోవడం వల్ల వైఎస్సార్‌సీపీ ఇమేజ్ తీవ్రంగా దెబ్బతింటోందని తాడేపల్లి వర్గాలు భావిస్తున్నాయి.వివాదం ముదిరి జోగి రమేష్ కోడలు మేఘన స్వయంగా మీడియా ముందుకు వచ్చి మాట్లాడటంతో ఈ వ్యవహారం మరింత సున్నితంగా మారింది. అత్తారింట్లో తనకు జరిగిన అన్యాయాన్ని, వేధింపులను వివరిస్తూనే.. న్యాయం కోసం సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసినా ఫలితం లేకపోయిందని, జగన్ మోహన్ రెడ్డిని కలవడానికి కూడా అవకాశం దక్కలేదని ఆమె బహిరంగంగా వెల్లడించడం పార్టీకి మింగుడుపడటం లేదు. సమాజంలోనూ, చట్టపరంగానూ ఇలాంటి సున్నితమైన కుటుంబ వ్యవహారాల్లో సాధారణంగా బాధితురాలిగా నిలిచే మహిళల వైపే ప్రజా సానుభూతి ఎక్కువగా ఉంటుంది. పైగా, బయటపడిన వీడియోలు కొన్నే, అసలు ఆధారాలు ఇంకా చాలా ఉన్నాయి అని మేఘన హెచ్చరించడంతో ఇది పార్టీకి మరింత డ్యామేజ్ తెచ్చిపెడుతుందనే భయం వైఎస్సార్‌సీపీలో మొదలైంది.ఆరోగ్యపరమైన, వైవాహికపరమైన వైఫల్యాలు తెలిసి కూడా పెళ్లి చేసి జీవితాన్ని నాశనం చేశారనే ఆరోపణలతో పాటు, మత విశ్వాసాలు, కట్న వేధింపుల వ్యవహారాలను కూడా బయటకు లాగడం వల్ల ప్రతిపక్షాలకు మంచి రాజకీయ అస్త్రం దొరికినట్లయింది.

ఓవైపు జగన్ సహా పార్టీ కీలక నేతల పేర్లను ఈ వివాదంలోకి లాగడం, మరోవైపు మతపరమైన అంశాలు ప్రజల్లోకి వెళ్లడం పార్టీ సాంప్రదాయ ఓటు బ్యాంకుపై ప్రతికూల ప్రభావం చూపుతుందనే ఆందోళన వ్యక్తం అవుతోంది. అందుకే జోగి తీరుపై జగన్ అసహనంతో ఉన్నట్లుగా చెబుతున్నారు.ఈ పరిణామాలన్నింటినీ తీవ్రంగా పరిగణించిన వైఎస్సార్‌సీపీ నాయకత్వం.. జోగి రమేష్‌ను హెచ్చరించినట్లు సమాచారం. వ్యక్తిగత లే, కుటుంబ సంక్షోభాలకు వైఎస్సార్‌సీపీకి చుట్టవద్దని న, పార్టీ పేరును ఈ వ్యవహారంలోకి లాగవద్దని తాడేపల్లి ప్యాలెస్ నుంచి కఠిన ఆదేశాలు వెళ్లినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. లీగల్‌గానూ, వ్యక్తిగతంగానూ తేల్చుకోవాల్సిన సమస్యలను రాజకీయంగా మార్చవద్దని చెప్పినట్లుగా తెలుస్తోంది. వీలైనంత త్వరగా వివాదాన్ని ముగించుకోవాలని ఆదేశించినట్లుగా చెబుతున్నారు

# కొత్త దనం లేని జగన్ ప్రెస్ మీట్

విజయవాడ : వైయస్సార్ కాంగ్రెస్ అధినేత జగన్మోహన్ రెడ్డి వారానికి ఒక్కసారి ప్రెస్ మీట్ పెడుతున్నారు. అయితే స్వల్ప వ్యవధిలో ఇలా ప్రెస్ మీట్ పెడుతుండడంతో పెద్దగా ఆసక్తికరమైన అంశాలు ఆయన మాట్లాడలేకపోతున్నారు. కనీసం నెలకోసారి ఇలా ప్రెస్ మీట్ పెడితే కొంత కొత్తదనం ఉండేది. పార్టీ నేతలతో ముందురోజు మాట్లాడుతున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ అధినేత జగన్మోహన్ రెడ్డి వారానికి ఒక్కసారి ప్రెస్ మీట్ పెడుతున్నారు. అయితే స్వల్ప వ్యవధిలో ఇలా ప్రెస్ మీట్ పెడుతుండడంతో పెద్దగా ఆసక్తికరమైన అంశాలు ఆయన మాట్లాడలేకపోతున్నారు. కనీసం నెలకోసారి ఇలా ప్రెస్ మీట్ పెడితే కొంత కొత్తదనం ఉండేది. పార్టీ నేతలతో ముందురోజు మాట్లాడుతున్నారు. ఆ వీడియోలు బయటకు వస్తున్నాయి. ఆ తరువాత రోజు ప్రెస్ మీట్ పెట్టుకుని కొన్ని రకాల స్క్రిప్టులను చూసి మాట్లాడుతున్నారు. అందులో కొత్తదనం ఏమీ కనిపించడం లేదు. అటు తిరిగి ఇటు తిరిగి చంద్రబాబు ప్రభుత్వాన్ని తప్పు పట్టడం.. అవి తమ హయాంలోనే బాగా అమలు చేశామని చెప్పడం వంటివి మాత్రమే జరుగుతున్నాయి. ఈ వారాంతపు ప్రెస్ మీట్ లో కూడా అదే పరిస్థితి కనిపించింది.బీసీ రిజర్వేషన్ల అంశంపై జగన్మోహన్ రెడ్డి మరోసారి రాజకీయ విమర్శలు చేశారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో రెండు డిప్యూటీ సీఎం పదవులతో పాటు కేబినెట్ లోని 25 మందిలో 11 మంది బీసీలకు ఇచ్చామని గుర్తు చేశారు. 40 శాతం మంత్రి పదవులకు వారికి కేటాయించామని ప్రస్తావించారు. అప్పట్లోనే స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు సిద్ధపడితే కోర్టుల ద్వారా చంద్రబాబు అడ్డుకున్నారంటూ చెప్పుకొచ్చారు. రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న కోర్టు తీర్పులను ప్రస్తావిస్తూ.. కూటమి ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల పేరుతో గ్రామాలకు దిగుతోందని ఆరోపించారు. అయితే ఇప్పుడు న్యాయపరమైన అడ్డంకులను అధిగమించి బీసీ రిజర్వేషన్లు 34% కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. దానిని స్వాగతించాల్సింది పోయి గతంలో తాను గొప్పగా చేశానని చెప్పుకునే ప్రయత్నం చేశారు. బీసీల రిజర్వేషన్ల విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో ఎలా నడుచుకుంది బలహీన వర్గాలకు తెలుసు.జగన్మోహన్ రెడ్డి మీడియా సమావేశాలు అంటేనే ముఖ్యంగా మీడియా ప్రతినిధులకు ఆసక్తి తగ్గిపోయింది. మెయిన్ మీడియా కంటే సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లకు, రీల్స్ లో, ఇన్స్టాగ్రామ్ లో ఉన్నవారికి ఆసక్తి. ఇప్పుడు జగన్ చేసే వ్యాఖ్యలకు.. ఆయన హయాంలో జరిగిన పరిణామాలను జత పోలుస్తూ మీమ్స్ ఓ రేంజ్ లో వేసుకుంటారు. సోషల్ మీడియా తెరిస్తే అదే పనిగా జగన్ పైనే రీల్స్ కనబడుతూ ఉంటాయి. అందుకే వారాంతపు మీడియా సమావేశాలు మాత్రం బోర్ కొడుతున్నాయి. రాతపూర్వక స్క్రిప్టులు చదవడం తప్ప ప్రజలకు కొత్తగా చెప్పేదేమీ లేకుండా పోతోంది. అది కూడా సొంత అనుబంధ మీడియా ఛానల్ లైవ్ కవరేజ్ ఇచ్చినా ప్రయోజనం లేకుండా పోతోంది. జగన్ మీడియా సమావేశాన్ని జనాలు లైట్ తీసుకుంటున్నారు. ఆయన చెప్పిన దాంట్లో విశ్వసనీయత కంటే మరో కోణంలో వెతుకులాట ఎక్కువగా కనిపిస్తోంది. ఇక తెలుసుకోవాల్సింది ఆయన మాత్రమే.

# వెలిగోండ ప్రాజెక్టు అడుగులు

ఒంగోలు: ప్రకాశం జిల్లా ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు ఇప్పుడు కీలక దశకు చేరుకుంది. మూడు దశాబ్దాల క్రితం తానే శంకుస్థాపన చేసిన ప్రాజెక్టును ఇప్పుడు ముఖ్యమంత్రిగా తానే ప్రారంభించే అవకాశం రావడం తనకు ఎంతో ఆనందంగా ఉందని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ విషయాన్ని ఆయన సోషల్ మీడియా వేదికగా ప్రజలతో పంచుకున్నారు. 1996 మార్చి 5న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన విషయాన్ని చంద్రబాబు గుర్తుచేసుకున్నారు. అప్పట్లో ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సాగునీటి ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేసినట్లు తెలిపారు. అయితే వివిధ కారణాలతో పనులు సుదీర్ఘకాలం కొనసాగాయి. ఎన్నో అడ్డంకులు ఎదురైనా ప్రాజెక్టును పూర్తి చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగామని సీఎం పేర్కొన్నారు.ఈ నెల 31న వెలిగొండ ప్రాజెక్టు తొలి దశ పనులను అధికారికంగా ప్రారంభించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. దాదాపు 30 ఏళ్ల క్రితం వేసిన పునాదికి ఇప్పుడు ఫలితం కనిపించడం తనకు ప్రత్యేకమైన అనుభూతిని ఇస్తోందని చంద్రబాబు అన్నారు. తన సంకల్పం నెరవేరుతున్న ఈ సందర్భాన్ని ఒక గొప్ప అనుభవంగా ఆయన అభివర్ణించారు. దీనికి సంబంధించిన 1996 నాటి ఫోటోలను కూడా సోషల్ మీడియాలో పంచుకున్నారు.వెలిగొండ మొదటి దశ పూర్తవడంతో ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో సాగునీటి పరిస్థితుల్లో గణనీయమైన మార్పు వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ దశ ద్వారా సుమారు 1.19 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందే అవకాశం ఉంది. దీంతో వర్షాలపై ఆధారపడే రైతులకు ఎంతో ఊరట లభించనుంది. వ్యవసాయానికి నీటి లభ్యత పెరగడంతో పంటల సాగు విస్తీర్ణం, దిగుబడులు కూడా మెరుగుపడే అవకాశం ఉంది.తాగునీటి విషయంలోనూ ఈ ప్రాజెక్టు కీలక ప్రయోజనాన్ని అందించనుంది. సుమారు నాలుగు లక్షల మంది ప్రజలకు తాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రాజెక్టు ఉపయోగపడనుంది. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి 10.7 టీఎంసీల కృష్ణా వరద జలాలను నల్లమలసాగర్ రిజర్వాయర్‌కు తరలించేందుకు తొలి దశ మార్గం సుగమం చేస్తుంది.ప్రకాశం, నెల్లూరు , కడప జిల్లాల్లోని ఫ్లోరైడ్ ప్రభావిత, కరవు ప్రాంతాలకు సురక్షితమైన తాగునీటిని అందించడంలో కూడా వెలిగొండ ప్రాజెక్టు ఉపయోగపడనుంది. భూములు ఇచ్చిన రైతులకు విడతల వారీగా పరిహారం అందించామని చంద్రబాబు తెలిపారు. గతంలో ప్రాజెక్టు పూర్తికాకుండానే పూర్తయినట్లు ప్రచారం చేశారని ఆయన విమర్శించారు. ఇప్పుడు నిజంగా పనులను పూర్తి చేసి ప్రజలకు ప్రయోజనం అందించడమే లక్ష్యమని ప్రభుత్వం చెబుతోంది. మూడు దశాబ్దాల నిరీక్షణకు తెరదించే ఈ ప్రాజెక్టు ప్రారంభం ప్రకాశం జిల్లా అభివృద్ధిలో కీలక మలుపుగా నిలిచే అవకాశం ఉంది.

# తాగునీటికి మాత్రమే...

## సాగర్ కుడి కాలువకు విడుదలైన నీరు – ఐదు జిల్లాల అవసరాలకు 8 టీఎంసీలు

ఒంగోలు : జిల్లావ్యాప్తంగా నెలకొన్న తాగునీటి ఇక్కట్ల నుంచి కొంతమేర ఉపశమనం లభించనుంది. సాగర్ డ్యామ్ నుంచి తాగునీటి అవసరాల కోసం బుధవారం జలాలను విడుదల చేశారు. సాగర్ కుడికాలువ పరిధిలో ప్రస్తుతం రాష్ట్రంలో ఐదు జిల్లాలు ఉండగా ఆయా జిల్లాల్లో తాగునీటి కోసం కనీసం 8 టీఎంసీలు అవసరమని రాష్ట్ర అధికారులు జరిగిన కృష్ణానదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) సమావేశంలో నివేదించారు. ఈ సీజన్ నీటి పంపకాలపై రెండు తెలుగు రాష్ట్రాల మధ్య స్పష్టత రాకపోవడంతో వచ్చేనెల 4న మరోసారి భేటీ కావాలని కేఆర్‌ఎంబీ నిర్ణయించింది.

**సమస్య తీవ్రత దృష్ట్యా..** రాష్ట్రంలో సాగర్ కుడి కాలువ పరిధిలో ఉన్న అన్ని జిల్లాల్లోనూ తాగునీటి సమస్య తీవ్రంగా ఉండటంతో అత్యవసర సమా వేశంలో డ్యామ్ నుంచి నీటిని తీసుకొని అనంతరం కేఆర్‌ఎంబీ నుంచి ఆమోదం పొందే అధికారం రాష్ట్రానికి ఉంది. ఆ నిబంధనకు అనుగుణంగా బుధవారం డ్యామ్ నుంచి కుడి కాలువకు నీటిని అధికారులు విడుదల చేశారు. కేవలం తాగునీటి కోసం మాత్రమే ఇవ్వనున్నారు. సాగర్ డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు, నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా ప్రస్తుతం 536.90 అడుగుల నీటిమట్టం, 180.90 టీఎంసీల నీరు ఉంది. ఎగువ నుంచి కేవలం 2,150 క్యూసెక్కులు మాత్రమే నీరు డ్యామ్‌లోకి వస్తుండగా ఇక్కడికి నీరు వచ్చే శ్రీశైలం డ్యామ్ కూడా ఇంకా నిండలేదు.

**2వేల క్యూసెక్కులు విడుదల**

ఎల్‌నినో దెబ్బతో వర్షాలు లేక ఇతర ప్రాంతాల నుంచి నీరు రావడం లేదు. ఈనేపథ్యంలో ఈ ఏడాది



సాగర్ డ్యామ్ నుంచి వరిసాగు, ఇతర పంటలకు నీటిని ఇచ్చే అవకాశం లేదని ప్రభుత్వం ఇప్పటికే స్పష్టత ఇచ్చింది. ఈ నేపథ్యంలో తాగునీటి కోసం బుధవారం జలాలను విడుదల చేశారు. ఉదయం పది గంటల సమయంలో డ్యామ్ నుంచి కుడికాలువకు తొలుత 2వేల క్యూసెక్కులు నీటిని విడుదల చేయగా క్రమంగా రాత్రికి 6వేల క్యూసెక్కులకు పెంచారు. అలా పక్షం రోజులపాటు కుడికాలువకు రోజుకు ఆరువేల క్యూసెక్కుల నీరు వస్తుంది. కాగా కుడికాలువ పరిధిలో మొత్తం 442 చెరువులు, మరో 16 మునిసిపాలిటీలకు తాగునీటిని అందించే ఎస్‌ఎస్ ట్యాంకులు ఉన్నాయి. అందులో ఒంగోలు ఎన్‌ఎస్పీ సర్కిల్ పర్యవేక్షణలో ఉన్న ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 222 తాగునీటి చెరువులు, ఒంగోలుతో సహా ఐదు మునిసిపాలిటీలు ఉన్నాయి.

ప్రస్తుతం ప్రకాశంలో 145, బాపట్ల జిల్లా ప్రాంతంలో 63, మార్కాపురం జిల్లాలో 14 చెరువులు ఉన్నాయి. మరో 200 వరకు నాన్ నోటిఫైడ్ చెరువులు ఉన్నాయి. వీటన్నింటికి ప్రస్తుతం విడుదల చేసిన నీటిని నింపేందుకు అధికారులు చర్యలు తీసుకోనున్నారు. కాగా డ్యామ్ నుంచి వదిలిన నీటితో కుడి ప్రధాన కాలువ ఎగువ భాగాన ఉన్న బుగ్గవాగు రిజర్వాయర్‌ను తొలుత నింపి అనంతరం దిగువకు ఇస్తారు. అలా నెలాఖరు నాటికి ఉమ్మడి జిల్లా సరిహద్దు ప్రాంతానికి నీరు వచ్చే అవకాశం ఉంది. అనంతరం ఉమ్మడి జిల్లాలో చెరువులు, ఎస్‌ఎస్ ట్యాంకులు నింపాల్సి ఉంటుంది. తొలుత ఒంగోలు కోసం రామతీర్థం రిజర్వాయర్‌ను నింపి అనంతరం ఇతర ఎస్‌ఎస్ ట్యాంకులు, చెరువులను నింపనున్నారు. కేవలం తాగునీటి అవసరాలకు యంత్రాంగం మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంది.

# రెచ్చిపోతున్న మట్టి మాఫియా

సింగరాయకొండ : మండలంలోని శానంపూడి పంచాయతీ పరిధిలో ఉన్న పచ్చటి మామిడి తోటల్లో యంత్రాల బీభత్సం కొనసాగుతోంది. మట్టి మాఫియా ఏమాత్రం బెరుకు లేకుండా అసైన్డ్ భూముల నుంచి నిత్యం టిప్పర్లతో యథేచ్ఛగా గ్రావెల్‌ను తరలిస్తోంది. పగలు, రాత్రి తేడా లేకుండా తవ్వకాలు సాగుతుండటంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ యంత్రాలతో భూముల్ని తవ్వేస్తుండటంతో ఈ ప్రాంత స్వరూపమే మారిపోతుందని చెబుతున్నారు. తవ్వకాలు భవిష్యత్‌లో ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని వాపోతున్నారు.

**పట్టపగలే తరలిస్తున్న కందుకూరు కాంట్రాక్టర్**

కందుకూరు నియోజవర్గానికి చెందిన ఓ కాంట్రాక్టర్ మూడు రోజుల క్రితం శానంపూడి- ఓగూరు సరిహద్దుల్లో ఉండే అసైన్డ్ భూముల్లోకి భారీ ఎక్స్‌కవేటర్లను దింపారు. వాటితో మట్టిని తవ్వి టిప్పర్లతో ఉలవపాడు జాతీయ రహదారి పక్కనే 90 ఎకరాల్లో వేసిన వెంచర్‌కి తరలిస్తున్నారు. రాత్రింబవళ్లు దాదాపు 20 భారీ టిప్పర్లు గ్రావెల్‌ను అక్రమ రవాణా చేస్తూ జాతీయ రహదారిపై అతివేగంతో దూసుకెళ్తున్నాయి. పట్టపగలు కళ్లెదుటే జరుగుతున్న అక్రమ తంతును చూసి స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శానంపూడిలోని సర్వే నెం.519-1లో ఉలవపాడు గ్రామంలోని నీలకంఠేశ్వర స్వామి ఆలయానికి చెందిన దాదాపు 30 ఎకరాల భూమి ఉంది. అందులో నాణ్యమైన గ్రావెల్ లభ్యమవుతోంది. ఆ భూమి పక్కనే 519-2లో అరకొర అనుమతులతో గులకరాళ్లు వ్యాపారం చేస్తున్న వ్యక్తి అక్రమంగా రాత్రి సమయాల్లో దేవుడి భూమిలో మట్టి తవ్వి తరలిస్తున్నారని గ్రామస్థులు చెబుతున్నారు.

అంతేకాకుండా చుట్టుపక్కల ఉన్న మామిడి తోటలను కొనుగోలు చేసి ఎటువంటి అనుమతులు లేకుండా ఆ భూముల్లో నిరంతరం మట్టి తవ్వకాలు చేస్తున్నారు. పచ్చని మామిడి తోటల మధ్యలో యంత్రాలతో మట్టిని జల్లెడపట్టి, అందులోని రాళ్లను గ్రేడ్ చేస్తుండటంతో ఆ పరిసర ప్రాంతాల్లోని తోటలు ఎర్రటి మట్టి దూళితో నిండిపోతున్నాయి. దీంతో కాపు సక్రమంగా రావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధలను విరుద్ధంగా నడుపుతున్న ప్లాంట్‌ను వెంటనే నిలిపివేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. శానంపూడి పరిధిలో మట్టిని తరలించే వ్యక్తులు కొంతమంది తమకు అనుమతులు ఉన్నాయని మభ్యపెడుతూ రూ. లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. గనుల శాఖ నుంచి మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతులు ఉన్నాయి.. ఉంటే అనుమతించిన విస్తీర్ణం ఎంత..

# నగరిపై గురి

తిరుపతి : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని నగరి మున్సిపల్ ఎన్నికలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ముఖ్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ) నాయకురాలు, మాజీ మంత్రి ఆర్కే రోజా కు ఈ ఎన్నికలు కీలకంగా మారే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె ఓటమి తర్వాత నగరి రాజకీయాల్లో పరిస్థితులు మారాయి. తెలుగుదేశం పార్టీ ( నుంచి గాలి భాను ప్రకాష్ నాయుడు ) విజయం సాధించడంతో నియోజకవర్గంలో కొత్త రాజకీయ సమీకరణాలు ఏర్పడ్డాయి.అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను రోజా పెద్దగా పట్టించుకోనప్పటికీ, ఇప్పుడు జరగబోయే మున్సిపల్ ఎన్నికల ఫలితాలు ఆమె రాజకీయ ప్రభావానికి ఒక కొలమానంగా మారవచ్చని స్థానికంగా చర్చ సాగుతోంది. దీంతో నగరి మున్సిపాలిటీపై వైసీపీ ఎలా వ్యూహం రచిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. మరోవైపు ఎమ్మెల్యే భాను ప్రకాష్ మాత్రం ఈ ఎన్నికలను తనకు వచ్చిన అవకాశంగా భావిస్తున్నట్లు తెలుస్తోంది.నగరి పట్టణంలోని ప్రతి వార్డులో టీడీపీ బలాన్ని పెంచేందుకు భాను ప్రకాష్ నాయుడు విస్తృతంగా పర్యటిస్తున్నారు. కౌన్సిలర్ అభ్యర్థులతో పాటు స్థానిక ప్రజలను కలుస్తూ వారి సమస్యలను తెలుసుకుంటున్నారు. ఇప్పటికే పరిష్కరించిన సమస్యలను ప్రజలకు వివరిస్తూ, భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాలపై హామీలు ఇస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన విజయాన్ని మున్సిపల్ స్థాయిలోనూ పునరావృతం చేయాలన్న లక్ష్యంతో ఆయన ముందుకు వెళ్తున్నట్లు తెలుస్తోంది.రోజాను లక్ష్యంగా చేసుకుని భాను వర్గం చేస్తున్న రాజకీయ విమర్శలు కూడా చర్చకు వస్తున్నాయి. ఆమె నియోజకవర్గానికి తరచూ రావడం లేదంటూ 'విజిటింగ్ లీడర్' అనే ప్రచారాన్ని టీడీపీ వర్గాలు తెరపైకి తెస్తున్నాయి. మాజీ ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉండటం లేదన్న అంశాన్ని కూడా ఎన్నికల ప్రచారంలో ప్రస్తావించే అవకాశం ఉంది. గతంలో చోటుచేసుకున్న ఆడుదాం వ్యవహారం కూడా రాజకీయంగా చర్చకు వస్తోందినగరిలో జనసేన కు కూడా కొంత ప్రభావం ఉంది. అయినప్పటికీ టీడీపీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం ఉండటం భాను ప్రకాష్‌కు అదనపు బలంగా మారే అవకాశం కనిపిస్తోంది. స్థానిక ఎన్నికల్లో ఎమ్మెల్యేలకు ఎక్కువ బాధ్యతలు అప్పగించిన పరిస్థితుల్లో మున్సిపల్ ఫలితం తన నాయకత్వానికి కూడా ప్రతిబింబంగా ఉంటుందని భావిస్తూ ఆయన మరింత దూకుడుగా వ్యవహరిస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.మరోవైపు రోజా మాత్రం ఇప్పటివరకు మున్సిపల్ ఎన్నికలపై పెద్దగా దృష్టి పెట్టలేదనే అభిప్రాయం ఉంది. నియోజకవర్గంలో ఆమె కార్యక్రమాలు తక్కువగా కనిపించడం వైసీపీకి ఇబ్బందిగా మారే అవకాశముంది. దీనికి తోడు పార్టీలోని అంతర్గత విభేదాలు కూడా ఆమెకు సవాలుగా మారుతున్నాయి.

# బడ్లవు జరూరీ హై.. మార్పు కావాలి

### చలో ఢిల్లీకి నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి వందలాది మంది సీపీఐ శ్రేణులు

### సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ ఫయాజ్

నాగర్‌కర్నూల్, ఆగస్టు 30( ప్రజా కలం ): దేశంలో ప్రజాస్వామ్య, రాజ్యాంగ పరిరక్షణ కోసం సీపీఐ ఇచ్చిన పిలుపు మేరకు సెప్టెంబర్ 1న నిర్వహించనున్న 'చలో ఢిల్లీ' కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి వందలాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ



ఫయాజ్ తెలిపారు.'బడ్లవు జరూరీ హై.. మార్పు కావాలి' నినాదంతో సీపీఐ దేశవ్యాప్తంగా నిర్వహించిన పాదయాత్రకు కొనసాగింపుగా చలో ఢిల్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చిందన్నారు. హైదరాబాద్‌లోని నాంపల్లి రైల్వే స్టేషన్ నుంచి తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌తో పాటు ఇతర మార్గాల ద్వారా పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు ఢిల్లీకి బయలుదేరి వెళ్తున్నట్లు తెలిపారు. 2014 తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను, ఆర్థిక పరిస్థితులను తీవ్రంగా ప్రభావితం చేశాయని ఫయాజ్ ఆరోపించారు. కులం, మతం, ప్రాంతం పేరుతో విద్వేషాలను పెంచడం తప్ప మోదీ 12 ఏళ్ల పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. 'మోదీ పాలన చాలు.. జరూరీ మార్పు కావాలి' అనే నినాదంతో ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో లక్షలాది మందితో సీపీఐ భారీ నిరసన సభ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు సభలో పాల్గొని దేశంలో నెలకొన్న పరిస్థితులను ప్రజలకు వివరిస్తారని పేర్కొన్నారు.చలో ఢిల్లీ కార్యక్రమం కోసం సీపీఐ జిల్లా సమితి సభ్యులు బండి లక్ష్మీపతి, బిజా శ్రీనివాసులు, తుమ్మల శివుడు, వి. రవీందర్, ఈ. మల్లయ్య, టి. కిరణ్‌కుమార్, డి. అంజనేయులు, జె. రమేష్, కె. వెంకటమ్మ, ప్రేమ్‌కుమార్ తదితరులు ఢిల్లీకి బయలుదేరారు

# ప్రభుత్వం చేయూత పించన్ల ద్వారా సామాజిక భద్రత కల్పిస్తుంది

### రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### - యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

యాదాద్రి భువనగిరి జిల్లా, ఆగస్టు 30 (ప్రజా కలం)

అర్హులైన ప్రతి ఒక్కరూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన చేయూత సామాజిక భద్రతా పింఛన్ల కోసం ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి నేడోక ప్రకటనలో తెలిపారు అర్హులైన వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు,రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న దివ్యాంగులు,కల్లుగీత కార్మికులు,చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులకు ప్రభుత్వం చేయూత పింఛన్ల ద్వారా సామాజిక భద్రత కల్పిస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీఓలు,పంచాయతీ కార్యదర్శులు,పట్టణ ప్రాంతాల్లో వార్డు అధికారులు, మున్సిపల్ కమిషనర్లు చేయూత పింఛన్ల కొరకు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.చేయూత పింఛన్ల దరఖాస్తు ఫారాలను చేయూత వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని,అలాగే నింపిన దరఖాస్తులను ఎంపీడీఓ కార్యాలయాలు,గ్రామ పంచాయతీ కార్యాలయాలు, మున్సిపాలిటీ కార్యాలయాల్లో సమర్పించాలని విజ్ఞప్తి చేశారు.

పింఛను రకాలు - అర్హతా ప్రమాణాలు

వితంతువులు:
- 18 సం.లు పైబడిన వారు
- భర్త మరణ ధృవీకరణ పత్రం

ఒంటరి మహిళలు:
- వివాహితులు: 18 సం.లు పైబడిన వారు, భర్తతో విడిపోయి/వదిలివేయబడి 1 సం.లు పైబడిన వారు
- అవివాహితులు: గ్రామీణ ప్రాంతాల్లో 30 సం.లు పైబడిన వారు; పట్టణ ప్రాంతాల్లో 35 సం.లు పైబడిన వారు

దివ్యాంగులు:
- వయసుతో సంబంధం లేదు
- SADAREM / UDID ధృవీకరణ ద్వారా 40% వైకల్యం (వినికిడి లోపం ఉన్నవారికి 51%)

రక్త సంబంధిత దివ్యాంగులు:



- తలసేమియా, సికిల్ సెల్ డిసీస్, హీమోఫీలియా (SADAREM / UDID ధృవీకరణ)

కల్లుగీత కార్మికులు:
- 50 సం.లు పైబడిన వారు
- కల్లుగీత కార్మికుల సహకార సంఘ సభ్యత్వం
- ఎక్సైజ్ శాఖ ధృవీకరణ

చేనేత కార్మికులు:
- 50 సం.లు పైబడిన వారు
- చేనేత ఒ జౌళి శాఖ ధృవీకరణ

ఫైలేరియా బాధితులు:
- గ్రేడ్–II & III ఫైలేరియా వ్యాధిగ్రస్తులు

దరఖాస్తుల స్వీకరణ

గ్రామీణ ప్రాంతాలలో:
- పంచాయతీ కార్యదర్శులు
- మండల పరిషత్ అభివృద్ధి అధికారులు

పట్టణ ప్రాంతాలలో: వార్డు అధికారులు

పురపాలక కమీషనర్లు

దరఖాస్తు ఫారాలను https://cheyutha.telangana.gov.in వెబ్‌సైట్‌లోని cheyutha application forms బటన్ నొక్కి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

# మానవతా దృక్పథం చాటుకున్న కొమ్ము నగేష్, నాగినేనిపల్లి గ్రామ 8వార్డ్ మెంబర్

బొమ్మలరామారం, ఆగస్టు 30 (ప్రజా కలం)

ఆపద వస్తే నేను ఉన్నానంటూ వార్డ్ ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా నాగనేనిపల్లి గ్రామ 8వ వార్డు సభ్యులు కొమ్ము నగేష్ పనిచేస్తున్నారు



యాదాద్రి భువనగిరి జిల్లా, బొమ్మలరామవరం మండలం, నాగినేనిపల్లి గ్రామానికి చెందిన బొమ్మగల్ల ఎల్లయ్య,లక్ష్మి దంపతుల ఏకైక కుమార్తె సుప్రజ వివాహం కొండమడుగు గ్రామంలోని ఎస్వీ ఫంక్షన్ హాల్ ఆదివారం రోజున జరిగింది ఈ వివాహ కార్యక్రమంలో ఎనిమిదవ వార్డు సభ్యులు కొమ్ము నగేష్ పాల్గొని ఆర్థిక సహాయం అందజేశారు ఈ సందర్భంగా కొమ్ము నగేష్ మాట్లాడుతూ గ్రామంలోని ఎనిమిదో వార్డు ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేస్తానని అన్నారు ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరిని ఆదుకోవడమే తన కర్తవ్యమని అన్నారు ఈ సహాయ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొండోజు ఆంజనేయులు, మాజీ ఉపసర్పంచులు రామిడి నరసింహారెడ్డి,పాషా, ఇప్పలపల్లి మల్లేష్,మాజీ వార్డ్ మెంబర్ మోత్కుపల్లి మహేందర్,బొమ్మగల స్వామి, ఇప్పలపల్లి రమేష్, ఆవుల భూపాల్,ముదుగుల నరసింహ,ఇప్పలపల్లి మనోహర్,కొమ్ము మహేందర్, పర్రె జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు

# చైత్యభూమి రాజగృహ లను సందర్శించిన ప్రఖ్యాత ఆంధ్ర మేధావి

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 30:

తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యావంతుడు, పద్మశ్రీ అవార్డ్ గ్రహీత, ప్రముఖ ఎస్.వి యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సిలర్, కవి, రచయిత, దళితబహుజన



బంధువు, ఆచార్య కొలకలూరి ఇనాక్ ముంబైలోని బాబాసాహెబ్ అంబేడ్కర్ సమాధి ఐన "చైత్యభూమి", ఆయన పుస్తక గృహమైన "రాజగృహ" లను తన కుమారుడి తోసహా సందర్శించారు. శనివారం ముంబైలోని ఆంధ్ర మహాసభ వారు ఏర్పాటు చేసిన "తెలుగు భాష – సాహిత్యం" అనే కార్యక్రమానికి అతిథిగా విచ్చేసారు. తదనంతరం ఆదివారం నగరంలోని పలు అంబేడ్కరైట్ సంఘాలు ఆయనతో భేటీయై, ఐతిహాసిక రాజగృహ చైత్యభూమిల సందర్శనానికి తీసుకెళ్లారు. వీరిలో ప్రముఖులు నాగెళ్ల దేవానంద్, బత్తుల లింగం, మేడి తిరుపతి గంగపుత్ర, మందారపు రమేష్ రజక, ఏనుగంటి నరేందర్, భీంరత్న మాలజీ, కె.రంగారాజు, గుర్రం నరేష్, మూలనివాసి మాలజీ లు రాజగృహం వద్ద అతిథులకు స్వాగతం పలికి, చైత్యభూమి వద్ద జైభీం కలం ఇచ్చి, నీలి కండువాలతో ఘనంగా సత్కరించారు. ప్రత్యేకించి మహారాష్ట్రలో బాబాసాహెబ్ పోరాటం, వారి కుటుంబ నేపథ్య విషయాలను మాట్లాడుకున్నారు. చివర్లో మేధావి ఇనాక్ గురించి కవి రచయిత నాగేళ్ల దేవానంద్ ముంబైకర్లకు పరిచయ కార్యక్రమం నిర్వహించారు.

# ఘనంగా తెలంగాణ 19 టీవీ 5వ వార్షికోత్సవం

### జర్నలిస్టులకు మెమెంటోలు, శాలువాలతో ఘనంగా సన్మానం

### ముఖ్య అతిథులుగా హాజరైన సర్పంచ్ కొత్తపల్లి హారిక, ఉప సర్పంచ్ అశోక్

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 30:

తెలంగాణ 19 టీవీ 5వ వార్షికోత్సవ వేడుకలు నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని శ్రీ హర్ష ఏసీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమ్మర్‌పల్లి గ్రామ సర్పంచ్ కొత్తపల్లి



హారిక, ఉప సర్పంచ్ కొత్తపల్లి అశోక్, గ్రామ కమిటీ అధ్యక్షులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. తెలంగాణ 19 టీవీ ప్రజా సమస్యలను నిరంతరం వెలుగులోకి తీసుకువస్తూ, నిజాన్ని నిర్భయంగా సమాజానికి చేరవేస్తోందని కొనియాడారు. పేద ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారానికి మీడియా వేదికగా కృషి చేయడం అభినందనీయమన్నారు. తెలంగాణ 19 టీవీ సీఈవో నాగేంద్రస్వామి నేతృత్వంలో ఈ ఛానల్ భవిష్యత్తులో రాష్ట్రస్థాయిలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. అనంతరం తెలంగాణ 19 టీవీ సీఈవో నాగేంద్రస్వామి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతూ, వార్తలను ప్రజలకు చేరవేస్తున్న జర్నలిస్టుల సేవలు ఎంతో విలువైనవన్నారు. ఈ సందర్భంగా సమాజ సేవలో ముందున్న పలువురు జర్నలిస్టులను మెమెంటోలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, జర్నలిస్టులు మామిడి రాజు, సామ్రాట్, అశోక్, అంగులీ మాల, ఎం9 రాజు భీంగల్, స్థానిక ఎంపీటీసీలు, గ్రామ కమిటీ సభ్యులు, తెలంగాణ 19 టీవీ ప్రతినిధులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి..

### యువతకు 2కే రన్‌తో సందేశం

### - సత్తా చాటిన నాగర్కర్నూల్ లక్ష్య అథ్లెటిక్స్ విద్యార్థులు

### -అభినందించిన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



నాగర్ కర్నూల్ ఆగస్టు 30 ప్రజా కలం (ప్రతినిధి ): డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా నాగర్‌కర్నూల్ జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కల్వకుర్తి పట్టణంలో "2కె రన్ సే నో టూ డ్రగ్స్ "కార్యక్రమాన్ని నిర్వహించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలనే సందేశంతో ఈ 2కే రన్ నిర్వహించారు. కల్వకుర్తి పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తా నుంచి ప్రారంభమైన 2కే రన్ ఎంపీడీవో కార్యాలయం వరకు కొనసాగింది. అనంతరం తిరిగి హైదరాబాద్ చౌరస్తాకు చేరుకోవడంతో రన్ విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో యువత, క్రీడాకారులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ 2కే రన్‌లో నాగర్‌కర్నూల్ లక్ష్య అథ్లెటిక్ సెంటర్ విద్యార్థులు సత్తా చాటారు. విద్యార్థులు గణేష్, అనిల్ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. వారి విజయాన్ని అభినందించిన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి విజేతలకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

విద్యార్థులు క్రీడల్లో రాణిస్తూ 2కే రన్‌లో విజయం సాధించడం పట్ల కోచ్ రాణా మల్లేష్ హర్షం వ్యక్తం చేశారు. విజయం సాధించిన గణేష్, అనిల్‌ను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. యువత మత్తు పదార్థాల వైపు ఆకర్షితులు కాకుండా క్రీడలు, విద్య, ఆరోగ్యకరమైన కార్యకలాపాలపై దృష్టి సారించాలని నిర్వాహకులు సూచించారు. "డ్రగ్స్‌కు నో చెప్పండి.. క్రీడలకు జై కొట్టండి" అనే సందేశాన్ని ఈ 2కే రన్ ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లారు.

# డాక్టర్ చంద్రావతి లేనిది క్రైస్తవ లోకానికి తీరని లోటు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 30:

క్రిస్టియన్ బిలీవర్స్ తెలుగు అసెంబ్లీ– సాంతక్రూజ్ కు చెందిన డాక్టర్ వాల్తాటి చంద్రావతి (75) గైనకాలజిస్ట్. వీరు గురువారం ప్రభువు నందు నిద్రించారు. వారి అంతక్రియాలకు



ముంబైలోని అశేష జనం వచ్చి నివాళి అర్పించారు. వీరు ఆంధ్రప్రదేశ్లోని నంద్యాల జిల్లాకు చెందిన వారు. ఐతే వారు బోరివలి డాక్టర్స్ కాటర్స్ నుంచి ప్రస్తుతం కాందివలీ ప్రాంతంలో నివాసమై ఉ ండిరి. వీరికి 2కూతుళ్ళు 1కుమారుడు ఉన్నారు. బోరివలి మున్సిపల్ మెటర్నిటీ ఆసుపత్రిలో అత్యధిక ఆపరేషన్లు చేసి బిఎంసి డిపార్ట్మెంట్లో ప్రసంశలు పొందిన ప్రఖ్యాత డాక్టర్. ఆమె అనేకమంది మహిళా పేషెంట్లకు సిజేరియన్ ఆపరేషన్లు, ఇతర ఆపరేషన్లు, కష్టమైన ప్రసవాల వేళ్లలో దినం రాత్రనకా వచ్చిన వారికి మద్దతు చేసేది. రోగులను ఆత్మీయత ప్రేమతో పలకరించేది. ప్రత్యేకించి పిల్లలు లేని వారికి సరైన చికిత్స అందించిన ఘనత, సకల ఆడజాతికి ఆమె మహనీయురాలు. వీరి భర్త చంద్రశేఖర్ గారు సీనియర్ మోస్ట్ పాస్టర్ గా వ్యవహరిస్తున్నారు. ముంబైలో వీరిరువురు ఒకరు వైద్యంలో మరొకరు దైవ కార్యంలో సేవలు అందించిన "ఆదర్శ క్రైస్తవ దంపతులు" గా ప్రజల్లో అపారమైన అభిమానం ఉందని, ఆమె లేనిది క్రైస్తవ లోకానికి తీరని లోటు అంటూ "అగ్నిజ్వాల మినిస్ట్రీస్ చర్చి" పాస్టర్ సుంకరి ప్రభుదాస్ తెలియజేస్తూ, వారి ఫ్యామిలీకి ప్రగాఢ సంతాపం వ్యక్తపర్చారు.

# బడ్లవు జరూరీ హై.. మార్పు కావాలి

### చలో ఢిల్లీకి నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి వందలాది మంది సీపీఐ శ్రేణులు

### సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ ఫయాజ్

నాగర్‌కర్నూల్, ఆగస్టు 30( ప్రజా కలం ): దేశంలో ప్రజాస్వామ్య, రాజ్యాంగ పరిరక్షణ కోసం సీపీఐ ఇచ్చిన పిలుపు మేరకు సెప్టెంబర్ 1న నిర్వహించనున్న 'చలో ఢిల్లీ' కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి వందలాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ ఫయాజ్ తెలిపారు. 'బడ్లవు జరూరీ హై.. మార్పు కావాలి' నినాదంతో సీపీఐ దేశవ్యాప్తంగా నిర్వహించిన పాదయాత్రకు కొనసాగింపుగా చలో ఢిల్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చిందన్నారు. హైదరాబాద్‌లోని నాంపల్లి రైల్వే స్టేషన్ నుంచి తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌తో పాటు ఇతర మార్గాల ద్వారా పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు ఢిల్లీకి బయలుదేరి వెళ్తున్నట్లు తెలిపారు. 2014 తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను, ఆర్థిక పరిస్థితులను తీవ్రంగా ప్రభావితం చేశాయని ఫయాజ్ ఆరోపించారు. కులం, మతం, ప్రాంతం పేరుతో విద్వేషాలను పెంచడం తప్ప మోదీ 12 ఏళ్ల పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. 'మోదీ పాలన చాలు.. జరూరీ మార్పు కావాలి' అనే నినాదంతో ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో లక్షలాది మందితో సీపీఐ భారీ నిరసన సభ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు సభలో పాల్గొని దేశంలో నెలకొన్న పరిస్థితులను ప్రజలకు వివరిస్తారని పేర్కొన్నారు. చలో ఢిల్లీ కార్యక్రమం కోసం సీపీఐ జిల్లా సమితి సభ్యులు బండి లక్ష్మీపతి, బిజా శ్రీనివాసులు, తుమ్మల శివుడు, వి. రవీందర్, ఈ. మల్లయ్య, టి. కిరణ్‌కుమార్, డి. అంజనేయులు,



జె. రమేష్, కె. వెంకటమ్మ, ప్రేమ్‌కుమార్ తదితరులు ఢిల్లీకి బయలుదేరారు



# పాత ఎల్లాపూర్ గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమం

**-60 ద్విచక్ర వాహనాలు,8 ఆటోలు స్వాధీనం -- జరిమానాలు విధింపు**

**-ప్రజలు సైబర్ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి**

**-యువత గంజాయి బారిన పడకుండా తల్లి తండ్రులు చూసుకోవాలి**

**-ఒక్కసిసి కెమెరా వంద మంది పోలీసులతో సమానం - నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్**

నిర్మల్ ఆగస్టు 30 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఆదేశాల మేరకు,నిర్మల్ డిఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం ఖానాపూర్ మండలం పాత ఎల్లాపూర్ గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టి, అనుమతులు/పత్రాలు లేని 60 ద్విచక్ర వాహనాలు, 8 ఆటోలను స్వాధీనం చేసుకొని, నిబంధనల మేరకు జరిమానాలు విధించచారు.అదేవిధంగా గ్రామంలోని ప్రజలకు ట్రాఫిక్ నియమాలు పట్ల, గంజాయి పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని,మైనర్ డ్రైవింగ్ వల్ల కలిగే ప్రమాదాలు, చట్టపరమైన పరిణామాలు, సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసులు అవగాహన కల్పించారు. ముఖ్యంగా మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని,సైబర్ నేరాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సిసి కెమెరాల ప్రాముఖ్యత గురించి వివరించారు.

ప్రజల భద్రత, నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఇటువంటి తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, ఖానాపూర్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్ఐలు రాహుల్, సాయి కుమార్, హనుమాండ్లు, సర్పంచ్, ఉప సర్పంచ్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# బంజారా సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కృషి అభినందనీయం

## బడంగ్‌పేట్ తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న ఏఐసీసీ విచార్ విభాగ్ కో ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేంద్ర రెడ్డి

మహేశ్వరం, ఆగస్టు 30, (ప్రజా కలం)

బంజారా సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికి ఏఐసీసీ విచార్ విభాగ్ కో ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేంద్ర రెడ్డి అభినందించారు. మహేశ్వరం నియోజక వర్గం బాలాపూర్ మండల కేంద్రం బడంగ్ పేటలో నిర్వహించిన బంజారా సమాజం యొక్క గొప్ప సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను ప్రతిబింబించే తీజ్ (మొలకల) పండుగ ఉత్సవాల్లో పాల్గొన్నారు.బంజారా మహిళల ఆత్మీయత, సంప్రదాయాల పట్ల వారి గౌరవం, ప్రకృతితో ముడిపడిన బంజారా జీవన విధానానికి తీజ్ పండుగ ఒక గొప్ప ప్రతీక. తరతరాలుగా వస్తున్న ఈ సంస్కృతిని భావితరాలకు అందించడంలో ఇలాంటి ఉత్సవాలు ఎంతో కీలకం అన్నారు.ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఏఐసీసీ -- విచార్ విభాగ్ కో ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేంద్ర రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, బంజారా సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కృషి చేస్తున్న ప్రతి ఒక్కరినీ అభినందించారు.ఈ కార్యక్రమంలో బంజారా ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు అజయ్ నాయక్, బంజారా సేవాదళ్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రాజేశ్వరి రాథోడ్,రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహిపాల్ నాయక్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేష్ నాయక్,రాష్ట్ర అధికార ప్రతినిధి సురేష్ నాయక్, బడంగ్‌పేట్ బంజారా సంఘం అధ్యక్షుడు రాజు నాయక్,హనుమంతు నాయక్, వేణు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నెన్నో తీయటి కలలు కన్నాము- యువశక్తి దేశ సంపద

# డ్రగ్స్ వద్దు.. మార్పు ముద్దు..



నిజామాబాద్,
(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 30:

యువశక్తి దేశ సంపదని ఏ రంగంలోనైనా రాణించాలంటే యువత పాత్ర కీలకమైనదని తెలపడంలో అతిశయోక్తి లేదు. ఆధునిక ప్రపంచంలో యువకులు మత్తుతో తమ జీవితాలు చిత్తు గా మార్చుకొని, గంజాయి కిక్కు తో లైఫ్ ను చిక్కుల్లో పెట్టుకున్నారని అనడంలో సందేహం లేదు. కడుపున పుట్టిన బిడ్డలు మారకద్రవ్యాల మత్తులో మునిగి మాయ ప్రపంచంలో విహరిస్తుంటే కన్నవారి కలలు కడతెరుస్తున్నారు. తల్లి తన కడుపులో నవమాసాలు మోసేటప్పుడు తన బిడ్డ తండినప్పుడు నొప్పి కలిగిన ఎంతైనా నా బిడ్డ నన్ను తాకుతున్నాడని ఆనందపడింది. ప్రసవ వేదన నొప్పులతో మరణపు అంచుల వరకు వెళ్లిన తన బిడ్డకు జన్మనిస్తున్నానన్న ఆశతో నొప్పులను భరించి గర్భం లోనుంచి బయటకు వచ్చిన బిడ్డను చూసిన ఆనందంలో ఆ బాధనంత మర్చిపోయింది. తండ్రి తన కుమారుడిని ఎత్తుకున్నప్పుడు తన గుండెలపై తన్నుతున్నప్పుడు ఆనందపడ్డాడు తండ్రి. బిడ్డ ఎదుగుతున్నప్పుడు వాడికి డాక్టర్, లాయర్, పోలీస్, టీచర్, ఇంజనీర్, బిజినెస్ మాన్, మంచి నాయకుడు అంటు రకరకాల దుస్తులు ధరించి మురిసిపోయారు. కాలం గిర్రున తిరిగింది. బిడ్డ ఇంటర్మీడియట్లో అడుగుపెట్టాడు. తల్లిదండ్రుల సంరక్షణలో ఉన్న తాను నూతన ప్రపంచంలోకి అడుగు పెట్టడంతో రంగుల ప్రపంచంలో ప్రతిదీ తనను ఆకర్షించింది. తల్లిదండ్రులు ఎర్రని ఎండల్లో మండుతున్న కడుపు మడ్చుకొని కష్టపడుతూ లేదనకుండా కన్న కొడుకు కు డబ్బులు పంపిన కన్నవారిని మరిచి లోకపు బ్రాబల్లో నిండా మునిగి మనిషన్న సంగతే మరిచి ఎంజాయ్ పేరుతో గంజాయి, ధూమపానం, మద్యం సేవించి యువత తమ జీవితాన్ని చేజేతులా చేజార్చుకుంతున్నారు. పట్నంలో వాడేటి డ్రగ్స్ అంత పల్లెటూరుకు వచ్చి చాక్లెట్ల రూపంలో గంజాయి ప్యాకెట్లు రూపంలో పసి హృదయాలను సైతం మత్తులో ముంచేస్తూ జీవితాలను తుంచేస్తున్న గంజాయి ఘాటును అదపాతాలానికి తొక్కడానికి ప్రతి ఒక్కరు చేయి చేయి కలపాలి. అందరు కలిసి కట్టుగా ముందుకు సాగాలి. పల్లెల్లో పట్టణాల్లో ఉన్న యువత సంతోషంగా జీవితాన్ని గడపాలంటే గంజాయి లేని సమాజాన్ని సిద్ధం చేయాలి.

**పెరిగిన మారకద్రవ్యాల కేసులు**

తెలంగాణ రాష్ట్రంలో తాజాగా వెల్లడించిన క్రైమ్ రేట్ ప్రకారం మరకద్రవ్యాల కేసులు 2023-24 లో 2,026 ఉండగా 2025-26 లో 2960 కు చేరాయి. అంటే సంవత్సరం లో 934 కేసులు పెరిగినట్లు అధికారులకు గణాంకాలు తెలుపుతున్నాయి.

**పల్లెల్లో తీర్మానాలతో ప్రారంభించాలి**

పల్లెల్లో ఉన్న ప్రతి ఒక్కరు తమ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ప్రతి ఒక్కరితో మారకద్రవ్యాలు తమ గ్రామానికి రాకుండా పకడ్బందీగా సైనికుల పనిచేసి గంజాయి ఘాటు లేకుండా సువాసన వెదజల్లే పల్లెలను ఏర్పాటు చేయడంలో ముందుండాలి.

**ఆట పాటల్లో ఆనందం ఉంది**

ఒక వ్యక్తి సంతోషంగా ఉండాలన్న కుటుంబం ఆనందంతో గడపాలన్న ఆటపాటల్లోని ఆనందం ఉందని గ్రహించాలి. క్షణిక సంతోషాలకు మరకద్రవ్యాలకు అలవాటు కాకుండా జీవితాలను నిలబెట్టుకోవాలి.



తుమ్మల మహేష్ కుమార్
జర్నలిస్ట్, శెట్ పల్లీ

# సైక్లింగ్ ద్వారా ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ

**- జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీకాంత్ రెడ్డి.**

**-భైంసాలో ఘనంగా "సండేస్ ఆన్ సైకిల్స్" కార్యక్రమం.**



నిర్మల్ ఆగస్టు 30 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

ఖేలో ఇండియా కేంద్రం భైంసా వేదికగా ఆదివారం సండేస్ ఆన్ సైకిల్స్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల్లో శారీరక దారుఢ్యం, ఆరోగ్యకర జీవనశైలి, పర్యావరణ పరిరక్షణ పట్ల చైతన్యం పెంచడమే లక్ష్యంగా ఈ సైక్లింగ్, నడక కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ నిత్యజీవితంలో శారీరక వ్యాయామానికి ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు. క్రీడలు, వ్యాయామం వల్ల మానసిక ప్రశాంతతతో పాటు ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ పెరుగుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ సైక్లింగ్, నడకను రోజువారీ అలవాటుగా మార్చుకోవాలని ఆకాంక్షించారు. ఫిట్ ఇండియా, హిట్ ఇండియా, ఆరోగ్య భారత్, సమృద్ధి భారత్ నినాదాలతో సాగిన ఈ కార్యక్రమంలో యువత, విద్యార్థులు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామస్థాయి నుంచి యూత్ కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తాం

## ఆళ్లపల్లిలో యూత్ కాంగ్రెస్ సమావేశం

ఆళ్లపల్లి, ఆగస్టు 30,ప్రజాకలం

మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సూచనలు, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆళ్లపల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాసం శ్రీనాథ్ అధ్యక్షతన సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా వాసం శ్రీనాథ్ మాట్లాడుతూ.. యువత రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించాలని, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి యువజన విభాగం కీలకంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి యూత్ కాంగ్రెస్‌ను పటిష్టం చేసి, ప్రతి గ్రామంలో యువతను సంఘటితం చేస్తామని తెలిపారు. యువత సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ విధానాలను యువతకు వివరించి మరింత మంది యువకులను పార్టీతో అనుసంధానం చేయాలని కార్యకర్తలకు సూచించారు. మండలంలోని ప్రతి గ్రామంలో యూత్ కాంగ్రెస్ కమిటీలను మరింత క్రియాశీలం చేసి, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కార్యాచరణ



రూపొందించనున్నట్లు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా ప్రజలకు అవగాహన కల్పించడంలో యువజన కాంగ్రెస్ కార్యకర్తలు భాగస్వాములు కావాలని సూచించారు. రాబోయే రోజుల్లో యువతకు మరిన్ని అవకాశాలు కల్పించే దిశగా పార్టీ నాయకత్వంతో కలిసి పనిచేస్తామని వాసం శ్రీనాథ్ తెలిపారు. యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, గ్రామస్థాయిలో పార్టీ కార్యకర్తలతో సమన్వయం చేసుకోవడం, సోషల్ మీడియా ద్వారా కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. ప్రతి కార్యకర్త పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని నాయకులు సూచించారు. ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు పాల్గొన్నారు.

# మున్నూరు కాపు రాజ్యాధికార పార్టీ జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవంగ ఎన్నిక



నాగర్‌కర్నూల్, ఆగస్టు 30 (ప్రజా కలం ): నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని నల్లవెల్లి రోడ్ సబ్‌జైలు ఎదురుగా ఉన్న కీర్తిశేషులు వారధి మాణిక్ (మాజీ సైనికుడు) నివాసంలో ఆదివారం ఉదయం మున్నూరు కాపు రాజ్యాధికార పార్టీ జిల్లా ఎన్నికల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మున్నూరు కాపు కుల సోదరులు, బంధువులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. చేయూత వెల్ఫేర్ సొసైటీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు ఏటిగడ్డ శ్రీనివాసులు పర్యవేక్షణలో అధ్యక్షురాలు వారధి స్వర్ణలత, ఉపాధ్యక్షులు తీగల భాస్కర్ పాలమూర్ శంకరయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఏటిగడ్డ శ్రీనివాసులు సంయుక్త కార్యదర్శి జాజుల బాలురాజు కోశాధికారి వారధి నరేందర్,ఈ సి సభ్యుడు పొడుగు రాఘవులు వారధి శ్రీనివాసులు మాదాసు శ్రీనివాసులు అడ్వకేట్ సలహాదారుడు ఎన్ అంజలి నూతన కమిటీని ఏ విధంగా ఎన్నుకున్నారు ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలు వారధి స్వర్ణలత మాట్లాడుతూ తనను ఇంత పెద్ద బాధ్యతకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కుల సోదరులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మున్నూరు కాపు సోదరులంతా ఐక్యంగా, సంఘటితంగా ముందుకు సాగాలని, రాజ్యాధికార సాధన దిశగా ప్రతి ఒక్కరూ కదలాలని పిలుపునిచ్చారు.

# ఎల్.ఎల్.బి పట్టా సాధించిన అరవింద్‌కు హంగిర్గాలో గ్రామస్థుల ఘన సన్మానం

తానూర్,ఆగస్టు 30(ప్రజా కలం): మండలంలోని హంగిర్గా గ్రామానికి చెందిన శీతల్కర్ అరవింద్ ఎల్.ఎల్.బి పట్టా పొందిన సందర్భంగా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. గ్రామంలోని బుద్ధ విగ్రహం వద్ద సర్పంచ్ , లక్ష్మణ్ అప్పా, ఉప సర్పంచ్ రాజు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు అరవింద్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.?సాధారణ కుటుంబ నేపథ్యం, ఆర్థిక ఇబ్బందులను అధిగమించి గ్రామంలోనే తొలి అడ్వకేట్‌గా ఎదగడంపై ప్రశంసలు కురిపించారు, చదువే ఆయుధంగా లక్ష్యాన్ని సాధించిన అరవింద్, గ్రామ యువతకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు, భవిష్యత్తులో న్యాయ రంగంలో ఎదిగి పేదలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు.



# సోషల్ మీడియా నవ్వుల స్టార్‌కు ఘన సన్మానం

**చిన్న వీడియోలతో.. లక్షల మందికి చిరునవ్వులు పంచుతున్న అరుణ్ కుమార్‌కు యువ న్యాయవాది కవిత అభినందన**



**హనుమకొండ ఆగస్టు 30 ప్రజా కలం ప్రతినిధి**

ప్రతిభకు వేదిక దొరికితే ఎంత ఎత్తుకైనా ఎదగవచ్చని నిరూపిస్తున్న సోషల్ మీడియా నవ్వుల స్టార్ అరుణ్ కుమార్ను ఆదివారం హనుమకొండలో యువ న్యాయవాది కవిత ఘనంగా సన్మానించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన అరుణ్ కుమార్ తనదైన శైలిలో రూపొందిస్తున్న వీడియోలతో సోషల్ మీడియాలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యంగా ప్రతి వీడియో చివరలో టీ తాగుతూ పలికించే హాస్యభరితమైన హావభావాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. రోజుకు వేలాది మంది ఆయన వీడియోలను వీక్షిస్తూ నవ్వులు పూయిస్తున్నారు. సాధారణ నేపథ్యం నుంచి వచ్చి, తనలోని ప్రతిభను నమ్ముకుని సోషల్ మీడియాను వేదికగా మార్చుకున్న అరుణ్ కుమార్ ప్రయాణం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని యువ న్యాయవాది కవిత అన్నారు. "మనలో ఉన్న ప్రతిభను గుర్తించి, కష్టపడి ముందుకు సాగితే విజయం తప్పకుండా మన సొంతమవుతుంది" అని ఆమె పేర్కొన్నారు. ఇతరులను నవ్వించడం కూడా ఒక గొప్ప కళేనని, ఒత్తిడితో నిండిన ఈ జీవితంలో అరుణ్ కుమార్ వంటి సోషల్ మీడియా కంటెంట్ క్రియేటర్లు ప్రజలకు కాసేపైనా ఆనందాన్ని అందిస్తున్నారని కొనియాడారు.

## గిరిజన బిడ్డపై అత్యాచారం, హత్య జరిగితే

# పట్టించుకునే నాథుడే లేడా?

- దారుణం జరిగిన మహిళా సంఘాలు మౌనం ఎందుకో...?
- హిందువుల పైనే దాడులు ఎందుకు జరుగుతున్నాయి
- వెంటనే గిరిజన బిడ్డకు న్యాయం చేయాలి
- గిరిజన బిడ్డ పై అత్యాచారం అత్య జరిగితే ప్రశ్నించాల్సిన సో కాల్డ్ ఎక్కడ
- తుక్కుగూడ ప్రైమ్ కేర్ హాస్పిటల్ లో దారుణంపై స్థానిక ఎమ్మెల్యే ఎందుకు స్పందించలే
- తుక్కుగూడ మాజీ బిజెపి కౌన్సిలర్ బాకీ విలాస్



మహేశ్వరం, ఆగస్టు 30 (ప్రజా కలం):

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని తుక్కుగూడ ప్రైమ్ కేర్ హాస్పిటల్ లో గిరిజన బిడ్డపై అత్యాచారం చేసి హత్య చేసిన ఘటనపై ఎవరూ పట్టించుకోకపోవడం చాలా బాధగా ఉందని తుక్కుగూడ మాజీ బీజేపీ కౌన్సిలర్ బాకీ విలాస్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ భద్రాచలం - కొత్తగూడెం ప్రాంతానికి చెందిన గిరిజన బిడ్డ, ఎస్టీకి చెందిన శిరీష అనే అమ్మాయిపై ఒక ముస్లిం యువకుడు అతి దారుణంగా అత్యాచారం చేసి హత్య చేశాడని ఆరోపించారు. ఇంత దారుణం జరిగినా ఎవరూ స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రతి చిన్న విషయానికి గతంలో బండి సంజయ్ కుమారుడి విషయంలో అన్ని పనులు పక్కన పెట్టి ప్రశ్నించిన మీడియా, కొన్ని ప్రముఖ పత్రికలు, సో కాల్డ్ యూట్యూబ్ ఛానళ్లు ఇప్పుడు ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. ముస్లింలపై చిన్న తప్పు జరిగితే గొంతెత్తి ప్రశ్నించే సో కాల్డ్ మేధావులు ఇప్పుడు ఎక్కడికి పోయారని ప్రశ్నించారు. హిందువులను, గిరిజన బిడ్డలను ఏం చేసినా ఎవరూ అడగరా? వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు, ఎస్టీ నాయకులు ఎక్కడికి పోయారని ఆయన ప్రశ్నించారు. ఈ ఘటనపై స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి స్పందించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే అయి ఉండి ఇంత ఘోరం జరిగినప్పుడు వచ్చి పరామర్శించకపోవడం, అసలు ఏం జరిగిందో తెలుసుకోకపోవడం, ఈ ఘటనను ఖండించకపోవడం బాధగా ఉందన్నారు.

గిరిజన బిడ్డపై అత్యాచారం చేసి హత్య చేసిన వ్యక్తిని పోలీసులు మీడియా ముందుకు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో పోలీసులు గుట్టుచప్పుడు కాకుండా విచారణ జరిపి తూతూ మంత్రంగా వ్యవహరిస్తారేమోనని ఆందోళన వ్యక్తం చేశారు. చట్టం అందరికీ సమానంగా ఉండాలని, కానీ చట్టం కొందరికి చుట్టంగా మారుతోందని అన్నారు. గిరిజన బిడ్డకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా గిరిజన బిడ్డకు న్యాయం చేయడానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు, గిరిజన సంఘాలు, మహిళా సంఘాలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

# మల్కాజ్గిరి లో ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు



**మల్కాజిగిరి, ఆగస్టు 30(ప్రజా కలం ప్రతినిధి)**

జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని మల్కాజిగిరిలో అభిమానులు పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పవన్ కళ్యాణ్ హైదరాబాద్ ఫ్యాన్స్ అసోసియేషన్, మల్కాజిగిరి పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అఖిల్ నేతృత్వంలో రక్తదాన శిబిరం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించి పలువురికి భోజనం అందించారు.

పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం ఆనందంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. అభిమానాన్ని సేవా కార్యక్రమాల రూపంలో చాటుకోవడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో చెర్రీ, రమేష్ గౌడ్, చిక్కీ నాని, రిజ్వాన్ వలి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వహణలో కార్తిక్, పవన్, నితిన్, జీవన్, వంశీ, కళ్యాణ్, రిత్విక్, పూర్ణ సాయి, రవి తదితరులు పాల్గొన్నారు.

# ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీ

## మహిళ మృతి.. భర్తకు తీవ్ర గాయాలు.



దుబ్బాక ప్రజాకలం ఆగష్టు 30.

ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా, ఆమె భర్తకు గాయాలైన ఘటన రాయపోల్ మండలం తిమ్మక్‌పల్లి గ్రామంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తిమ్మక్‌పల్లి గ్రామానికి చెందిన ఉడిది అమృత (48), ఆమె భర్త రామస్వామి వ్యవసాయ పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వస్తుండగా, రాయపోల్ నుంచి దౌల్తాబాద్ వైపు వెళ్తున్న మరో ద్విచక్ర వాహనం కబీర్ పెద్దమ్మ గుడి--ఎల్లమ్మ గుడి మధ్య ప్రాంతంలో వారి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అమృతకు తలకు, చేతికి తీవ్ర గాయాలు కాగా, రామస్వామికి కాళ్లకు గాయాలయ్యాయి. స్థానికులు వారిని గజ్వేల్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అమృత పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. కుమార్తె చిట్టబోయిన మరియ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాయపోల్ ఎస్ఐ మానస తెలిపారు.

## ఉద్యోగ దరఖాస్తుల ఆహ్వానం

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని CHC బెజ్జూర్ మరియు CHC తిర్యాని ఆసుపత్రులలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగాలు భర్తీ చేయుటకు ఈ ప్రకటన ద్వారా అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరబడుతున్నాయి.

ఉద్యోగ వివరాలు & అట్టి ఉద్యోగమునకు అర్హతలు ఈ క్రింద వివరించబడినవి :

| క్ర.సం. | ఆఫీస్ యొక్క పేరు | పోస్ట్ యొక్క పేరు | కావాల్సిన అర్హత |
|---|---|---|---|
| 1 | CHC బెజ్జూర్ | ల్యాబ్ టెక్నీషియన్ -01 | ఇంటర్మీడియట్ (10+2) మరియు డిప్లొమా / మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజీలో (MLT/DMLT) సర్టిఫైడ్ కోర్సు లేదా దానికి సమానమైనది |
| 2 | CHC తిర్యాని | ల్యాబ్ టెక్నీషియన్ -01 | |
| నోట్: కేవలం కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కి చెందిన అభ్యర్థులకు మాత్రమే | | | |

కావున అర్హత కలిగిన కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా అభ్యర్థులు తమ సర్టిఫికెట్ జిరాక్స్ సెట్ తోపాటు ఒక passport సైజ్ ఫోటోని తేదీ: 31.08.2026 ఉదయం 10 గంటల నుండి 01.09.2026 సాయంత్రం 5 గంటల వరకు వ్యక్తిగతంగా విచ్చేసి దరఖాస్తు చేసుకోగలరు.

గమనిక: ఇట్టి ఉద్యోగ ప్రకటనలో సవరణలు లేదా రద్దు పర్చుటకై ప్రెసిడెంట్, శ్రీ సాయి యూత్ అసోసియషన్ గారికి సంపూర్ణ అధికారం కలదు. మరిన్ని వివరాలకు సంప్రదించవలసిన చిరునామా: శ్రీ సాయి యూత్ అసోసియేషన్ ఆఫీస్ : H. No: 13-160, బాపునగర్, ఆసిఫాబాద్, జిల్లా: కొమురం భీమ్ ఆసిఫాబాద్, ఫోన్: 9849068124




Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com